
## మహా శివరాత్రి శుభాకాంక్షలు

పాఠకులు, ప్రకటన కర్తలు, ఏజెంట్లు, శ్రేయోభిలాషులకు
మనం మహా శివరాత్రి శుభాకాంక్షలు.

**సెలవు**

పండుగ సందర్భంగా మా కార్యాలయానికి ఆదివారం సెలవు. సోమవారం పత్రిక వెలువడదు. మంగళవారం పునర్దర్శనం.

\- ఎడిటర్



# మనం

జనం కోసం అక్షర యజ్ఞం..

గుంటూరు - ఆదివారం 15 ఫిబ్రవరి 2026 | సంపుటి: 10 | సంచిక: 43 | పేజీలు: 8+4 | వెల: రూ.5

GUNTUR | TIRUPATI | KURNOOL | ELURU | VISHAKAPATNAM | ANANTHAPURAM | KADAPA | HYDERABAD | KARIMNAGAR | NIZAMABAD | NALGONDA | MAHABUBNAGAR | WARANGAL | KHAMMAM


## సుప్రీం కోర్టులో తన కేసును తానే వాదించుకున్న విద్యార్థి



2

# రూ.3,32,205 కోట్లతో రాష్ట్ర బడ్జెట్





### బడ్జెట్ స్థూల రూపం

| | |
|---|---|
| మొత్తం బడ్జెట్ : | రూ.3,32,205 కోట్లు |
| రెవెన్యూ వ్యయం: | రూ.2,56,143 కోట్లు |
| మూలధన వ్యయం: | రూ.53,915 కోట్లు |
| రెవెన్యూ లోటు: | రూ.22,002 కోట్లు |
| ద్రవ్య లోటు: | రూ.75,868 కోట్లు |

ఏపీ శాసనసభలో ఆర్థిక మంత్రి పయ్యావుల కేశవ్ వార్షిక బడ్జెట్ ను ప్రవేశపెట్టారు. అనంతరం బడ్జెట్ ప్రసంగం చేసిన ఆయన 2026-27 ఆర్థిక సంవత్సరానికి రూ.3,32,205 కోట్లతో ఏపీ పద్దును ప్రవేశపెడుతున్నట్లు చెప్పారు. తమ దృష్టిలో బడ్జెట్ అంటే కేవలం పద్దుల ప్రకటన కాదని.. రాష్ట్రాభివృద్ధి, ప్రజా సంక్షేమాన్ని జోడెద్దుల బండిలా పరుగులు పెట్టించాలనే సంకల్ప పత్రం లాంటిదని పేర్కొన్నారు.



## ప్రస్తుత పరిస్థితుల్లో మెరుగైన బడ్జెట్ ఇది: సీఎం చంద్రబాబు

**అమరావతి:** ప్రస్తుత పరిస్థితుల్లో మెరుగైన బడ్జెట్‌ను ప్రవేశపెట్టామని ఏపీ సీఎం చంద్రబాబు తెలిపారు. రెండుమూడేళ్లలో మరింత మెరుగైన బడ్జెట్ ప్రవేశపెడతామన్నారు. వైకాపా విధ్వంసం నుంచి కోలుకోవడానికి ఇంకా సమయం పడుతుందని చెప్పారు. రాష్ట్ర బడ్జెట్‌పై ఆయన స్పందిస్తూ.. ఇబ్బందులు అధిగమించి ఇప్పుడిప్పుడే ట్రాక్ ఎక్కుతున్నట్లు చెప్పారు. రాష్ట్రంలో సమస్యలు ఇంకా చాలా ఉన్నాయని చెప్పారు. "ఆదాయం తక్కువ - ఖర్చులు ఎక్కువ అనేది వారసత్వంగా వచ్చింది. కేంద్ర సహకారంతో మేనేజ్ చేసుకుంటూ వస్తున్నాం. వ్యవసాయం, సేవారంగాల నుంచి ఎక్కువ ఆదాయం రావాలి. రెండుమూడేళ్లలో అమరావతికి ఒక రూపు వస్తుంది. అక్కడి రోడ్లను జాతీయ రహదారికి అనుసంధానిస్తున్నాం. అమరావతికి రాకపోకలు పెరిగి ఆదాయమూ వస్తుంది. అమరావతికి పశ్చిమ బైపాస్‌తో యాక్సెస్ పెరిగింది. ఇన్నర్, ఔటర్ రింగురోడ్డుతో

...మిగతా 2లో

## ప్రకృతి వ్యవసాయంలో ఏపీ రోల్ మోడల్

**ప్రతి ఎకరాకు సాగునీరు అందించడమే ప్రభుత్వం లక్ష్యం..**

**దేశ వ్యవసాయ రంగంలో ఏపీ వాటా 10 శాతం: మంత్రి అచ్చెన్నాయుడు**

**అమరావతి:** మూడోసారి వ్యవసాయ బడ్జెట్ ప్రవేశ పెట్టడం సంతోషంగా ఉందని మంత్రి అచ్చెన్నాయుడు తెలిపారు. రాష్ట్రంలో 62 శాతం జనాభాకు వ్యవసాయ అనుబంధ రంగాలే ఆధారంగా ఉన్నాయి. రాష్ట్ర ఆర్థిక

...మిగతా 2లో














ప్రకటన

ముఖ్య కార్యక్రమాలు

| | | |
|---|---|---|
| 15.02.2026 మహాశివరాత్రి | సాయంత్రం : 5.30 గం.లకు | ప్రభోత్సవం |
| | రాత్రి : 7.00 గం.లకు | నందివాహన సేవ |
| | రాత్రి : 10.00 గం.ల నుండి | శ్రీ స్వామి వారికి లింగోద్భవకాలం మహాన్యాసపూర్వక ఏకాదశి రుద్రాభిషేకం, పాగాలంకరణ |
| | రాత్రి : 12.00 గం.లకు | శ్రీ స్వామి అమ్మవార్ల దివ్య కల్యాణ మహోత్సవం |
| 16.02.2026 | సాయంకాలం: 5.00 గం.లకు | రథోత్సవం |
| | రాత్రి : 8.00 గం.లకు | తెప్పోత్సవం |
| 17.02.2026 | ఉదయం : గం.9.45 లకు | పూర్ణాహుతి, కలశోద్వాసన, అవభృథం, వసంతోత్సవం, త్రిశూలస్నానం. |
| | సాయంత్రం : గం.6.00 గం.లకు | సదస్యం, నాగవల్లి, ఆస్థానసేవ |
| | రాత్రి : గం.7.30 లకు | ధ్వజావరోహణ |
| 18.02.2026 | రాత్రి : గం.7.30 లకు | అశ్వవాహన సేవ |
| | రాత్రి : గం. 8.30 లకు | పుష్పోత్సవం, శయనోత్సవం, ఏకాంతసేవ |

శ్రీ స్వామి అమ్మవార్ల సేవలో...



పోతుగుంట రమేష్ నాయుడు
ధర్మకర్తల మండలి అధ్యక్షులు



యం. శ్రీనివాసరావు, యం.ఎ.,యం.ఇడి.,
స్పెషల్ గ్రేడ్ డిప్యూటీ కలెక్టర్ మరియు
కార్యనిర్వహణాధికారి



# రూ.3,32,205 కోట్లతో ఏపీ బడ్జెట్

**అమరావతి, ఫిబ్రవరి 14:** ఏపీ శాసనసభలో ఆర్థిక మంత్రి పయ్యావుల కేశవ్ వార్షిక బడ్జెట్ ను ప్రవేశపెట్టారు.
అనంతరం బడ్జెట్ ప్రసంగం చేసిన ఆయన 2026-27 ఆర్థిక సంవత్సరానికి రూ.3,32,205 కోట్లతో ఏపీ పద్దును ప్రవేశపెడుతున్నట్లు చెప్పారు. తమ దృష్టిలో బడ్జెట్ అంటే కేవలం పద్దుల ప్రకటన కాదని.. రాష్ట్రాభివృద్ధి, ప్రజా సంక్షేమాన్ని జోడెద్దుల బండిలా పరుగులు పెట్టించాలనే సంకల్ప పత్రం లాంటిదని పేర్కొన్నారు.

## కీలకాంశాలకు కేటాయింపులు

| | |
|---|---|
| రాజధాని అమరావతి నిర్మాణానికి రూ.6 వేల కోట్లు | ప్రతి జిల్లాకు ప్రత్యేక సైబర్ క్రైమ్ పోలీసు స్టేషన్ |
| విద్యుత్ రంగానికి రూ.13,934 కోట్లు | పాఠశాల విద్యాశాఖ- రూ.32,308 కోట్లు |
| రోడ్లు, పోర్టు, ఎయిర్పోర్టులకు రూ.13,546 కోట్లు | పంచాయతీరాజ్- రూ.22,942 కోట్లు |
| పరిశ్రమలకు రూ.3,161 కోట్లు | వ్యవసాయం, అనుబంధ |
| సర్దుబాటు నిధి.. రూ.1,500 కోట్లు | రంగాలు- రూ.13,598 కోట్లు |
| వీబీ జీ రామ్ జీకి.. రూ.8365 కోట్లు | అన్నదాత సుఖీభవ- రూ.6,660 కోట్లు |
| గృహ నిర్మాణ రంగానికి రూ.5,451 కోట్లు | పోలవరం- రూ.6,105 కోట్లు |
| ఎన్టీఆర్ వైద్య సేవకు రూ.4000 కోట్లు | హోంశాఖ- రూ.9,165 కోట్లు |
| జల్ జీవన్కు రూ.4,000 కోట్లు | మున్సిపల్ శాఖ-రూ.14,539 కోట్లు |
| స్వచ్ఛ భారత్ మిషన్కు రూ.1,037 కోట్లు | జలవనరుల శాఖ- రూ.18,224 కోట్లు |
| విశాఖ ఆర్థిక ప్రాంతానికి రూ.28,000 కోట్లు.. | హాస్టళ్లు, గురుకులాలకు రూ.300 కోట్లు |
| ఈ ఆర్థిక ప్రాంతం పరిధిలోకి పది జిల్లాలు | విద్యార్థులకు ఉపకారవేతనాలకు |
| 9 జిల్లాలతో అమరావతి ఆర్థిక ప్రాంతం | రూ.3,836 కోట్లు |
| రాయలసీమ గ్లోబల్ హార్టికల్చర్ | మధ్యాహ్న భోజన పథకం.. రూ.2,161 కోట్లు |
| హబ్కు రూ.30,000 కోట్లు | ఎన్టీఆర్ భరోసా.. రూ.27,719 కోట్లు |

# ప్రస్తుత పరిస్థితుల్లో మెరుగైన బడ్జెట్ ఇది: సీఎం చంద్రబాబు

(మొదటి పేజీ తరువాయి)

మరింత పెరుగుతుంది. రాయలసీమ ముఖచిత్రం మార్చింది మేమే హార్టీకల్చర్ హబ్కు రూ.30వేల కోట్లు కేటాయించడం బాగుంది. రాయలసీమలో ఒకప్పుడు పశువులకు నీరు కూడా దొరికేది కాదు. 2014-19 మధ్య కూడా రెయిన్ గన్స్తో పంటలు కాపాడే పరిస్థితి ఉండేది. అప్పుడే హంద్రీనీవాను సీరియస్గా తీసుకున్నాం. రాయలసీమ ముఖచిత్రం మార్చింది మేమే. దేశంలోనే నాణ్యమైన పండ్లు రాయలసీమ నుంచి వస్తున్నాయి. ఇక్కడ పండే దానిమ్మకు మంచి డిమాండ్ ఉంది.

**గతంలో ఉన్నట్లే నిక్కచ్చిగానే ఉంటా**

ఎమ్మెల్యేలకు సీల్డ్ కవర్లో ఇచ్చే నివేదిక వారి పనితీరుకు నిలువుటద్దం. నేను గతంలో ఉన్నట్లు నిక్కచ్చిగానే ఉంటా. మారకపోతే వాళ్లకే నష్టం. మొత్తం 9 పారామీటర్లలో సర్వే చేయించి వారికి నివేదిక ఇస్తున్నా. వారికి తెలియని ఇంకొన్ని పారామీటర్లు కూడా నా వద్ద ఉన్నాయి. లోకేశ్ తన పని తాను చేస్తున్నాడు. నా పని నేను చేస్తున్నా.

# ప్రకృతి వ్యవసాయంలో ఏపీ రోల్ మోడల్

(మొదటి పేజీ తరువాయి)

సౌధానికి వ్యవసాయం మూల స్తంభం.. ఫుడ్ ప్రాసెసింగ్, డిమాండ్ ఆధారిత పంటలకు ప్రాధాన్యత ఇస్తున్నాం.. రైతులకు త్వరలో విశిష్ట గుర్తింపు సంఖ్య ఇస్తామని పేర్కొన్నారు. వాతావరణ హెచ్చరికల ఆధారంగా రైతులకు మెసేజ్ లు పంపుతున్నామని అచ్చెన్నాయుడు వెల్లడించారు.
అయితే, ప్రకృతి వ్యవసాయంలో ఏపీ రోల్ మోడల్ గా నిలుస్తుందని మంత్రి అచ్చెన్న చెప్పుకొచ్చారు. అధిక ఆదాయం కోసం ప్రకృతి వ్యవసాయం ముఖ్యం.. ప్రతి ఎకరాకు సాగునీరు అందించడమే కూటమి ప్రభుత్వం లక్ష్యంగా పెట్టుకుందన్నారు. దేశ వ్యవసాయ రంగంలో ఏపీ వాటా 10 శాతంగా ఉంది. అలాగే, 11 వ్యవసాయ పంటలను గ్రోత్ ఇంజిన్లుగా గుర్తించామని : మంత్రి అచ్చెన్నాయుడు తెలిపారు.
ఇక, 24 గంటల్లో రైతుల ఖాతాల్లో రూ. 9,000 కోట్లకు పైగా జమ చేశామని అచ్చెన్నాయుడు వెల్లడించారు. ధాన్యం సేకరణ ద్వారా 24 గంటల్లోనే రూ. 10,571 కోట్లు రైతుల ఖాతాల్లో జమ చేశాం.. పీఎం కిసాన్ పథకం కింద రూ. 6,309 కోట్లు చెల్లించాం.. 2026-27 సంవత్సరానికి పీఎం కిసాన్ కోసం రూ. 6,600 కోట్లు కేటాయించామని మంత్రి అచ్చెన్న పేర్కొన్నారు.

# సుప్రీం కోర్టులో తన కేసును తానే వాదించుకున్న విద్యార్థి

**ఢిల్లీ, ఫిబ్రవరి 14:** దేశ అత్యున్నత న్యాయస్థానంలో అరుదైన దృశ్యం ఆవిష్కృతమైంది. ఒక 19 ఏళ్ల కుర్రాడు 10 తన కేసును తానే వాదించుకుని సానుకూల తీర్పును సాధించుకున్నాడు. మధ్యప్రదేశ్ లోని జబల్ పూర్కు చెందిన లాయర్ మనోజ్ చతుర్వేది కుమారుడు అథర్వ చతుర్వేది. అతడు రెండుసార్లు నీట్లో 530 స్కోర్ సాధించాడు. ఈడబ్ల్యూఎస్ కోటా కింద ఏదో ఒక ప్రైవేటు కాలేజీలో సీటు కచ్చితంగా వస్తుందని ధీమాగా ఉన్నాడు. కానీ, కౌన్సెలింగ్ లో సీటు రాలేదు. తమ రాష్ట్రంలో ప్రైవేటు మెడికల్ కాలేజీల్లో ఈడబ్ల్యూఎస్ కోటాను అమలు చేయకపోవడం వల్లే తనకీ పరిస్థితి వచ్చిందని గ్రహించాడు. తనతో పాటు తనలాంటి ఈడబ్ల్యూఎస్ విద్యార్థులకు అన్యాయం జరుగుతోందని భావించాడు. మరోవైపు ఎస్సీ, ఎస్టీ, దివ్యాంగులకు సీట్లు అందుబాటులో ఉన్నాయని గుర్తించాడు. ఈనేపథ్యంలో తానే సొంతంగా డ్రాఫ్టింగ్ చేసిన స్పెషల్ లీవ్ పిటిషన్ను జనవరి 6న సుప్రీం కోర్టులో ఫైల్ చేశాడు. ఆర్థికంగా బలహీనవర్గానికి చెందిన విద్యార్థికి రెండుసార్లు నీట్ పాస్ అయినా సీటు రాకపోవడంతో అత్యున్నత న్యాయస్థానం స్పందించింది. విధానపరమైన లోపాలు అతడి చదువుకు ఆటంకంగా ఉండకూడదని చెబుతూ ప్రైవేటు కళాశాలల్లో ఈడబ్ల్యూఎస్ కోటాను రాష్ట్ర ప్రభుత్వం నోటిఫై చేయనందున అతని అడ్మిషన్ను తిరస్కరించకూడదని సుప్రీం కోర్టు పేర్కొంది. 2025-2026 సెషన్లో అతడికి అడ్మిషన్ ఇవ్వాలని ఆదేశించింది. ఇటీవల ఈ పిటిషన్ విచారణ సందర్భంగా ప్రధాన న్యాయమూర్తి జస్టిస్ సూర్యకాంత్ను 10 నిమిషాలు సమయం ఇవ్వాలని కోరిన అథర్వ.. సొంతంగా తన వాదనలు వినిపించి విజయం సాధించడం విశేషం.

# దామోదరం సంజీవయ్యకు ఘన నివాళులు

- నగర పోలీసు కమీషనర్ డా.శంఖబ్రాత బాగ్చి



విశాఖపట్నం మనం ఉత్తరాంధ్ర ప్రాంతీయ ప్రత్యేక ప్రతినిధి ఫిబ్రవరి 14: తెలుగు జాతి గర్వించదగ్గ మహనీయుడు, తొలి దళిత ముఖ్యమంత్రి దామోదరం సంజీవయ్య జయంతిని శనివారం నగర పోలీసు కమిషనరేట్ లో ఘనంగా నిర్వహించారు. పోలీసు కమిషనర్ ఆయన చిత్రపటానికి పూలమాల వేసి ఘన నివాళులు అర్పించారు.సామాన్య నిరుపేద కుటుంబంలో జన్మించి, తన స్వయంకృషితో దేశ రాజకీయాల్లో ధ్రువతారగా వెలిగిన దామోదరం సంజీవయ్య జీవితం ప్రతి ఒక్కరికీ, ముఖ్యంగా యువతకు ఆదర్శనీయమని సీపీ తెలిపారు.
కేవలం 38 సంవత్సరాల పిన్న వయసులోనే ఉమ్మడి ఆంధ్రప్రదేశ్ రాష్ట్రానికి రెండవ ముఖ్యమంత్రిగా, దేశంలోనే తొలి దళిత ముఖ్యమంత్రిగా ఆయన చరిత్ర సృష్టించారన్నారు. ముఖ్యమంత్రిగా ఆయన హయాంలో తీసుకువచ్చిన సంస్కరణలు నేటికీ ఆదర్శప్రాయమని తెలిపారు. బడుగు బలహీన వర్గాల అభ్యుదయానికి ఆయన విశేష కృషి చేశారన్నారు. భూసంస్కరణల విషయంలో ఆయన తీసుకున్న నిర్ణయాలు విప్లవాత్మకమైనవని, రాష్ట్రవ్యాప్తంగా సాగునీటి ప్రాజెక్టుల విస్తరణకు ఆయన ఎంతోప్రాధాన్యతనిచ్చారన్నారు. సంజీవయ్య కేంద్ర మంత్రిగా పనిచేసిన కాలంలో కార్మికుల సంక్షేమం కోసం అనేక చట్టాలను తీసుకువచ్చారని తెలిపారు. రెండు పర్యాయాలు అఖిల భారత కాంగ్రెస్ కమిటీ అధ్యక్షుడిగా పనిచేసి, పదవిని ఒక బాధ్యతగా భావించి నిజాయితీగా సేవ చేసిన నిస్వార్థ రాజకీయ నాయకుడని కొనియాడారు. బడుగు బలహీన వర్గాల వారికి న్యాయం చేకూరాలని ఆయన తపించారని, పోలీస్ యంత్రాంగం కూడా అదే స్ఫూర్తితో పనిచేస్తూ సామాన్యులకు, బడుగు బలహీన వర్గాలకు భరోసాగా ఉండాలని తెలిపారు.



# మహాశివరాత్రి ఏర్పాట్లపై ఆలయ ఈవో సమీక్ష

- ప్రసాద తయారీ,అన్నప్రసాదం, కేంద్రంలో ఆకస్మిక తనిఖీ



విశాఖపట్నం, ఫిబ్రవరి 14, మనం ఉత్తరాంధ్ర ప్రాంతీయ ప్రత్యేక ప్రతినిధి: సింహాచల పుణ్యక్షేత్రంలో రేపు జరగనున్న మహాశివరాత్రి పర్వదినాన్ని పురస్కరించుకుని భక్తులకు కల్పించాల్సిన సౌకర్యాలు, క్షేత్రస్థాయి ఏర్పాట్లపై ఆలయ కార్యనిర్వహణాధికారి జె. వెంకట్రావు శనివారం అధికారులతో కలిసి విస్తృతంగా పర్యటించారు. కొండపై ఉన్న శివాలయాలను ఈవో సందర్శించి, శివరాత్రి వేడుకల కోసం జరుగుతున్న ఏర్పాట్లను పరిశీలించారు. కొత్త క్యూ కాంప్లెక్స్ వద్ద జరుగుతున్న ఇంజనీరింగ్ పనులను ఎగ్జిక్యూటివ్ ఇంజనీర్ బండారు రాంబాబు, డిప్యూటీ ఇంజనీర్ రామరాజులకు త్వరితగతిన పూర్తి చేయాలని, తెలియజేశారు.
లడ్డు, పులిహోర ప్రసాద తయారీ విభాగాలను పర్యవేక్షించిన ఈవో తయారీ విధానం, వినియోగిస్తున్న వస్తువుల నాణ్యతను పరిశీలించిన ఆయన, స్వయంగా లడ్డు ప్రసాదాన్ని తిని రుచి చూశారు.
అనంతరం అక్కడ ఉన్న పాత్రికేయ మిత్రులను కూడా ప్రసాదాన్ని రుచి చూడవలసిందిగా కోరారు. పాత్రికేయ మిత్రులు ప్రసాదాన్ని రుచి చూసి, నాణ్యత మరియు రుచి అత్యద్భుతంగా ఉందని చెప్పడంతో ఈవో సంతృప్తి వ్యక్తం చేశారు.దక్షిణ రాజగోపురం వద్ద ఈవో వెంకటరావు ఏఈవో తిరుమలేశ్వరరావుతో కలిసి భక్తులతో మమేకమయ్యారు. దర్శనం ఏ విధంగా జరుగుతోంది? సౌకర్యాలపై సంతోషంగా ఉన్నారా? అని ఆరా తీశారు. అనంతరం అన్నదాన భవనంలో ఏఇఓ రమణమూర్తి, పర్యవేక్షణ అధికారి నర్సింగరావు బృందంతో కలిసి భోజనం చేస్తున్న భక్తులతో నేరుగా మాట్లాడారు అన్న ప్రసాదము రుచి అడిగి తెలుసుకున్నారు. భక్తుల నుంచి సానుకూల స్పందన రావడంతో హర్షం వ్యక్తం చేశారు.వచ్చే ఫిబ్రవరి 23 నుండి 27 వరకు (5 రోజుల పాటు) శ్రీ విశ్వావసు నామ సంవత్సర ఉత్తరాయణ ఫాల్గుణ మాస శుక్ల పక్ష ఏకాదశి, 27.02.2026 (శుక్రవారం) ఉదయం 11:25 గంటలకు వృషభ లగ్నమందు ఆలయ పునఃప్రతిష్ఠా కార్యక్రమాలు వైభవంగా నిర్వహించనున్నట్లు ఈ సందర్భంగా ఈవో ప్రకటించారు. ఆలయ పరిసరాల్లోని సీసీ కెమెరాల పనితీరును కూడా ఈవో పరిశీలించారు. భక్తుల భద్రత దృష్ట్యా నిరంతరం నిఘా కొనసాగించాలని సిబ్బందిని ఆదేశించారు.శివరాత్రి రద్దీ దృష్ట్యా నిరంతర నిఘా కొనసాగించాలని సిబ్బందిని ఆదేశించారు.

## టిబిఎస్ఐ క్యాలండర్ ఆవిష్కరణ



**కాత్రేనికోన, ఫిబ్రవరి 14 మనం ప్రతినిధి:** నాకు పుట్టినవాళ్లే నా వారసులనుకొను, నా ఉద్యమాన్ని,నా ఉద్యమరథాన్ని ,ముందుకు తీసుకెళ్ళే వారే నానిజమైన, వారసులు అని బోధిసత్వ బాబాసాహెబ్ డా. అంబేద్కర్ పేర్కొన్నారు అని, బౌద్ధ మత వ్యాప్తికి ,ప్రచారం అత్యంత అవసరం అని బి ఎస్ ఐ జిల్లా అధ్యక్షులు కుశల రత్నబోధి పేర్కొన్నారు. దానిలో భాగంగా శనివారం సాయంకాలం కాత్రేనికోన మండలం గేటు సెంటర్ లో ఉన్న డా.అంబేద్కర్ విగ్రహం వద్ద సామాజిక చైతన్య కార్యకర్త గెల్లా రాజేంద్ర ఆధ్వర్యంలో టి బి ఎస్ ఐ ఫ్రీ కాలెండర్ ను ఆవిష్కరణ చేయడం జరిగింది. ఈ కార్యక్రమంలో బీర అంబేద్కర్, గిడ్డి రత్నశ్రీ, దడాల భైరవమూర్తి, గజిని, కుంచే మోహన్, యాళ్ల దుర్గా ప్రసాద్, జొన్నాడ దొరబాబు, కొండిపర్తి వెంకటరమణ, జొన్నాడ హాసిని తదితరులు పాల్గొన్నారు.

# మహా శివరాత్రికి విశిష్ట ఆధ్యాత్మిక ప్రసస్తి

- కేంద్ర మంత్రి కింజరాపు రామ్మోహన్ నాయుడు

**విశాఖపట్నం, ఫిబ్రవరి 14, మనం:** మహా శివరాత్రి పర్వదినం సందర్భంగా కేంద్ర పౌర విమానయాన శాఖ మంత్రి కింజరాపు రామ్మోహన్ నాయుడు ప్రజలకు శుభాకాంక్షలు తెలియజేశారు. విశేష ఆధ్యాత్మిక ప్రసస్తి కలిగిన మహాశివరాత్రి పండుగను అందరూ భక్తి శ్రద్ధలతో జరుపుకోవాలని కోరారు. ఇదే సందర్భంలో శ్రీకాకుళం జిల్లాలోని ప్రముఖ శైవ క్షేత్రాలు అయిన శ్రీముఖలింగం, ఉమారుద్ర కోటేశ్వర ఆలయం, రావివలస ఎండల మల్లిఖార్జున క్షేత్రంతో పాటు మిగిలిన ఆలయాల్లో భక్తుల రద్దీ దృష్ట్యా ప్రత్యేక చర్యలు చేపట్టాలని జిల్లా అధికారులను ఆదేశించారు. ఈ మేరకు చరవాణి ద్వారా జిల్లా అధికారులతో సమీక్ష నిర్వహించారు. ప్రధాన ఆలయాల్లో భక్తుల రద్దీ దృష్ట్యా చేపట్టిన మౌలిక వసతుల కల్పన గురించి ఆరా తీశారు. భక్తులకు ఎలాంటి అసౌకర్యం కలగకుండా ప్రశాంతంగా దర్శనం జరిగేలా ఏర్పాటు చెయ్యాల ని సూచించారు. ఎక్కువమంది ఉపవాస దీక్షలు చేస్తున్న సందర్భంలో ఆలయాల్లో మంచినీరు, వైద్య సదుపాయాలు అందుబాటులో ఉండేలా చూడాలని తెలిపారు. జిల్లాలో చేపట్టిన చర్యల గురించి కేంద్ర మంత్రి రామ్మోహన్ నాయుడుకు జిల్లా అధికారులు పరిస్థితులను వివరించారు.



## ఈనెల 16 నుండి 20 వరకు రాష్ట్ర గవర్నర్ పర్యటన

**విశాఖపట్నం ఫిబ్రవరి 14:** రాష్ట్ర గవర్నర్ శ్రీ ఎస్. అబ్దుల్ నజీర్ ఈనెల 16వ తేదీ నుండి 20వ తేదీ వరకు విశాఖపట్నంలో జరిగే పలు కార్యక్రమాలలో పాల్గొననున్నారు. ఈ నెల 16వ తేదీ రాత్రి 9 గంటలకు వాయు మార్గాన విశాఖ చేరుకొని రాత్రి బస చేస్తారు. 17వ తేదీ సాయంత్రం 4:45 గంటలకు విశాఖ కు వస్తున్న భారత రాష్ట్రపతి శ్రీమతి ద్రౌపది ముర్ము కు స్వాగతం పలుకుతారు. అనంతరం రాష్ట్రపతి ఇచ్చే విందులో పాల్గొని రాత్రి బస చేస్తారు. 18వ తేదీ ఉదయం 10 గంటలకు ఐ ఎఫ్ ఆర్ లో పాల్గొంటారు. సాయంత్రం ఢిల్లీ వెళ్లనున్న భారత రాష్ట్రపతి ద్రౌపది ముర్ము కు వీడ్కోలు పలుకుతారు. అనంతరం రాత్రి బస చేస్తారు. 20వ తేదీ మధ్యాహ్నం విశాఖ విమానాశ్రయం నుండి వాయు మార్గం ద్వారా విజయవాడ బయలుదేరి వెళతారు.

# టెన్త్, ఇంటర్ పరీక్షలు పారదర్శకంగా నిర్వహించాలి

- కలెక్టర్ మహేష్ కుమార్



**అమలాపురం, ఫిబ్రవరి 14మనం న్యూస్:** డాక్టర్ బి.ఆర్ అంబేద్కర్ కోనసీమ జిల్లాలో 10వ తరగతి ఇంటర్మీడియట్ పబ్లిక్ పరీక్షలు పారదర్శకం గా, నిష్పక్షపాతంగా నిర్వ హించేందుకు సన్నద్ధత ఏర్పాట్లు పటిష్టంగావిం చాలని జిల్లా కలెక్టర్ ఆర్ మహేష్ కుమార్ అధికా రులు ఆదేశించారు రాష్ట్ర ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి కె విజ యానంద్ జిల్లా కలెక్టర్లతో అమరావతి నుండి వీడియో కాన్ఫరెన్స్ నిర్వహించి పదో తరగతి ఇంటర్మీడియట్ పబ్లిక్ పరీక్షల నిర్వహణ సన్నద్ధత ప్రజా సంతృప్తి స్థాయిలు మెరుగుపరచుట, డాక్యు మెంట్ అప్లోడ్, కొత్తగా ఏర్పాటు అయిన జిల్లా లలో జిల్లా కోర్టు భవన నిర్మాణాలకు భూ సేకరణ అంశాల పురోగతిపై జిల్లాల వారీగా సమీక్షించి జిల్లా కలెక్టర్లకు దిశా నిర్దేశం చేశారు ఈ వీడియో కాన్ఫరెన్స్ అనంతరం జిల్లా కలెక్టర్ అధికారులు ఉద్దే శించి ప్రసంగిస్తూ పబ్లిక్ పరీక్షలు ఆద్యంతం సీసీ కెమెరాలు ప్రత్యేకంగా బృందాల పర్య వేక్షణ నిర్వహించేందుకు ఏర్పాట్లు చేయాలని సూచించారు.జిల్లా లో పదవ తరగతి మరియు ఇంటర్మీడియట్ పబ్లిక్ పరీక్షల నిర్వహణకు సంబంధించి అన్ని విభాగాలు సమన్వయంతో పూర్తి స్థాయి సన్నద్ధతను పూర్తి చేయాలని జిల్లా కలెక్టర్ తెలిపారు. పరీక్షా కేంద్రాలలో తగిన మౌలిక వసతులు, తాగునీరు, విద్యుత్, వైద్య సదు పాయాలు, సీసీ కెమెరాలు, ప్రశ్నాపత్రాల భద్రత, జవాబు పత్రాల తరలింపు భద్రత,పోలీ స్ బందోబస్తు వంటి అన్ని ఏర్పాట్లు కట్టు దిట్టం చేయాలన్నారు. విద్యార్థినీ విద్యార్థులకు ఒత్తిడికి లోనుకాకుండా ప్రశాంత వాతావరణంలో పరీక్షలు శాంతియుతంగా రాయడానికి చర్యలు తీసుకోవాలన్నారు. పరీక్షల నిర్వహణపై ప్రజల్లో సానుకూల దృక్పథం ఏర్పడేలా అవగాహన కార్యక్రమాలు నిర్వహిస్తూ తల్లిదండ్రులు, ఉపాధ్యాయులు, విద్యా ర్థులు సమన్వయంతో సహకరించాలని కోరారు.

# ఏలూరి లక్ష్మీదేవి చారిటబుల్ ట్రస్ట్ సేవలు ప్రశంసనీయం

**ఉచిత మెడికల్ క్యాంపు ప్రారంభోత్సవ సభలో జేసీ పులి శ్రీనివాసులు**



**మార్కాపురం, ఫిబ్రవరి,14,మనం న్యూస్):** మహాశివరాత్రి ఉత్సవాల సందర్భంగా సామాజిక సేవా దృక్పథంతో ఏలూరి లక్ష్మీదేవి చారిటబుల్ ట్రస్ట్ ఆధ్వర్యంలో ఉచిత మెడికల్ క్యాంపు ను నిర్వహించడం ప్రశంసనీయమని జాయింట్ కలెక్టర్ పులి శ్రీనివాసులు అన్నారు. శివరాత్రి పర్వదినం సందర్భంగా ఏలూరి లక్ష్మీదేవి చారిటబుల్ ట్రస్ట్ ఆధ్వర్యంలో శనివారం దోర్నాల పట్టణంలోని శ్రీశైలం రోడ్ లో భక్తుల సౌకర్యార్థం మెడికల్ క్యాంపు ను డిఎస్పీ డాక్టర్ యు నాగరాజు తో కలిసి జాయింట్ కలెక్టర్ పులి శ్రీనివాసులు ప్రారంభించారు. ఈ సందర్భంగా జేసి శ్రీనివాసులు మాట్లాడుతూ మానవతా దృక్పథంతో లక్షల రూపాయలు విలువ చేసే మెడిసిన్స్ ను మూడు రోజుల పాటు నిరంతరం కాలినడక, వివిధ అనారోగ్య సమస్యలతో బాధ పడుతున్న భక్తులకు ఉచితంగా అందజేయడం అభినందనీయమని, ట్రస్ట్ సభ్యులు డాక్టర్ ఏలూరి రామచంద్రారెడ్డి సేవలను అభినందించారు. డిఎస్పీ డాక్టర్ యు. నాగరాజు మాట్లాడుతూ శైవ క్షేత్రమైన శ్రీశైలానికి ఈ పండుగ సందర్భంగా లక్షల సంఖ్యలో భక్తులు పెద్ద ఎత్తున రాక పోకలు సాగిస్తుంటారని, ఇలాంటి పరిస్థితుల్లో వారికి యుద్ధ ప్రాతిపదికపై మందులను అందజేసి, ఆరోగ్యాలను కాపాడడం గొప్ప విషయమని అన్నారు. అలాగే శ్రీశైలం వెళ్ళే భక్తులు తమ వాహనాలను ట్రాఫిక్ రూల్స్ కు అనుగుణంగా నడపాలని సూచించారు. ఏలూరి లక్ష్మీదేవి చారిటబుల్ ట్రస్ట్ సభ్యులు డాక్టర్ ఏలూరి రామచంద్రారెడ్డి మాట్లాడుతూ భారత ప్రధాని నరేంద్ర మోడీ స్ఫూర్తితో తమ ట్రస్ట్ సేవా కార్యక్రమాలను అనేక సంవత్సరాలుగా కొనసాగిస్తున్నామని, అందులో భాగంగా ఉచిత మెడికల్ క్యాంపు నిర్వహిస్తున్నామని అన్నారు. దాదాపుగా రూ లక్షల విలువ చేసే మందులను ఈ సందర్భంగా రోగులకు అందిస్తున్నామని అన్నారు. ఫార్మా కంపెనీ లిమిటెడ్ వారు స్వర్గీయ నాగిరెడ్డి జ్ఞాపకార్థం మందులను ఈ క్యాంపు కు అందించిన సహకారం మరువలేనిదని అన్నారు. వెనుక బడిన మార్కాపురం జిల్లాలో తమ ట్రస్ట్ ఆధ్వర్యంలో నిరంతరం సేవా కార్యక్రమాలను కొనసాగిస్తామని ఆయన అన్నారు. ఈ మెడికల్ క్యాంపు కార్యక్రమానికి హాజరైన జేసీ పులి శ్రీనివాసులు, డిఎస్పీ డాక్టర్ యు నాగరాజు లకు ట్రస్ట్ సభ్యులు డాక్టర్ ఏలూరి రామచంద్రారెడ్డి శాలువ కప్పి, స్వామి వారి మెమెంటో లను అందజేసి సన్మానించారు. ఈ కార్యక్రమంలో బీజేపీ జిల్లా ప్రధాన కార్యదర్శి తంగిరాల అశోక్ రెడ్డి, పి ఏ సీసీ అధ్యక్షులు బట్టు సుధాకర్ రెడ్డి, జిల్లా పార్టీ ఉపాధ్యక్షులు నరాల శ్రీనివాస రెడ్డి,పిచ్చయ్య, త్రిపురాంతకం మండల పార్టీ అధ్యక్షులు సముద్రాల మల్లికార్జున, కంభం మండలం పార్టీ అధ్యక్షులు బాదం కిషోర్, గిద్దలూరు పట్టణ పార్టీ అధ్యక్షులు అప్పిశెట్టి ఉదయ్ కుమార్, మహిళా నాయకురాలు మద్దెల లక్ష్మీదేవి తదితరులు పాల్గొన్నారు.

# బకాయిలు విడుదలతో లోకేష్ చిత్రపటానికి పాలాభిషేకం

**ఏపీలో విద్యార్థులకు ఫీజు రీయింబర్స్మెంట్ బకాయిలను విడుదల సందర్భంగా నందవరం మండలంలో పెద్ద ఎత్తున ర్యాలీ నిర్వహణ**

నందవరం ఫిబ్రవరి మనం న్యూస్ 14: ఆంధ్రప్రదేశ్ వ్యాప్తంగా విద్యార్థులకు పెద్ద ఉపశమనం కలిగించేలా, మంత్రి నారా లోకేష్ 2024 నుండి 25 విద్యా సంవత్సరానికి చాలా కాలంగా పెండింగ్లో ఉన్నరూ.1,198 కోట్ల ఫీజు రీయింబర్స్మెంట్ బకాయిలను విడుదల చేసినందుకు గానూ ఎమ్మెల్యే బివి జయనాగేశ్వర రెడ్డి గారి ఆదేశాల మేరకు నందవరం మండల కేంద్రంలో టీడీపీ మండల అధ్యక్షుడు కాశీంవలి ఆధ్వర్యంలో శనివారం నాడు పెద్ద ఎత్తున ర్యాలీ నిర్వహించడం జరిగింది. తెలుగుదేశం పార్టీ కార్యాలయం నుండి బస్టాండ్ వరకు ర్యాలీ నిర్వహించి, సీఎం చంద్రబాబు, మంత్రి నారా లోకేష్ బాబు, డిప్యూటీ సీం పవన్ కళ్యాణ్, ఎమ్మెల్యే బివి జయనాగేశ్వ రెడ్డి గార్ల చిత్ర పటానికి పాలాభిషేకం చేశారు అనంతరం విద్యార్థులు, టీడీపీ నాయకులు మాట్లాడుతూ కూటమి ప్రభుత్వానికి ధన్యవాదాలు తెలియజేశారు. దీంతో పాటు తాజాగా అసెంబ్లీలో ఎమ్మెల్యే బివి జయనాగేశ్వర రెడ్డి గారు వీరశైవ లింగాయత్, లింగబలిజ సామాజికవర్గానికి సంబంధించిన రిజర్వేషన్లకు సంబంధించిన సమస్యను పరిష్కరించాలని కోరుతూ అసెంబ్లీలో ప్రస్తావించడంపై కూడా ఈ సందర్భంగా ధన్యవాదాలు తెలియజేసి ఎమ్మెల్యే బివి జయనాగేశ్వరరెడ్డి గారి చిత్రపటానికి పాలాభిషేకం చేశారు. ఈ కార్యక్రమంలో నందవరం మండల, గ్రామ కూటమి నాయకులు, విద్యార్థులు, కార్యకర్తలు, ప్రజలు పెద్ద ఎత్తున పాల్గొనడం జరిగింది.



# ఏపీ వార్షిక బడ్జెట్ పై చిత్తూరు ఎంపీ హర్షం



**చిత్తూరు, ఫిబ్రవరి 14 మనం న్యూస్ :** ఆంధ్రప్రదేశ్ అసెంబ్లీలో ప్రవేశపెట్టిన ఆర్థిక బడ్జెట్.., రాష్ట్ర సమగ్రాభివృద్ధి, సగటు మనిషి జీవన ప్రమాణాలను పెంచేందుకు దోహదం చేసేవిధంగా ఉందని చిత్తూరు పార్లమెంటు సభ్యులు దగ్గుమళ్ళ ప్రసాదరావు అభిప్రాయ పడ్డారు. సంక్షేమం, అభివృద్ధికి ప్రాధాన్యతనిస్తూ, ముఖ్యంగా మహిళా సాధికారత, నిరుద్యోగ భృతి, రాయలసీమ ప్రాజెక్టుల పూర్తికి కేటాయింపులతో సామాన్యుల అవసరాలను తీర్చేలా రూపొందించబడిందన్నారు.

రాష్ట్ర ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు సమర్థతకు నిలువుటద్దంలా నిలిచిందని, సీఎం కృషిని కొనియాడారు.

ఏపీ. సీఎం. చంద్రబాబు నాయుడు,ఉప ముఖ్యమంత్రి పవన్ కళ్యాణ్ నేతృత్వంలో శనివారం ఏపీ అసెంబ్లీలో 2026-27 ఆర్థిక సంవత్సరానికి గాను, కూటమి ప్రభుత్వం రూ.3,32,205 కోట్ల 3వ వార్షిక బడ్జెట్ను ప్రవేశపెట్టింది.

రాష్ట్ర ఆర్థిక శాఖ మంత్రి పయ్యావుల కేశవ్ ప్రవేశపెట్టిన ఈ బడ్జెట్ సమావేశాల్లో స్వయంగా పాల్గొన్న చిత్తూరు ఎంపీ దగ్గుమళ్ళ ప్రసాదరావు పాల్గొన్నారు. ఈ భారీ వార్షిక బడ్జెట్ పై హర్షం వ్యక్తం చేశారు. నవ్యాంధ్రప్రదేశ్ ప్రగతి ప్రస్థానానికి ఈ బడ్జెట్ మరో కీలక ఘట్టాన్ని ఆవిష్కృతం చేయనుందని చెప్పారు.

సామాన్యుడి రవాణా సౌకర్యాలు, గృహ నిర్మాణం, విద్యుత్ రంగాలకు పెద్దపీట వేసిందని చెప్పారు. కాలుష్య నివారణ కోసం 11 నగరాల్లో 750 కొత్త ఎలక్ట్రిక్ బస్సులను ప్రవేశపెట్టేందుకు ఈ ప్రాధాన్యతనివ్వడం అభినందనీయమన్నారు. గృహ నిర్మాణ రంగానికి రూ.6,357 కోట్లు కేటాయించి, పేదల సొంతింటి కలను సాకారం చేసేందుకు ఈ బడ్జెట్ దోహదపడుతుందని ఆయన అన్నారు. గత జూన్ నుంచి ఇప్పటివరకు 3 లక్షల ఇళ్ల నిర్మాణం పూర్తి కాగా, వచ్చే ఏడాదిలో మరో 6 లక్షల ఇళ్లను పూర్తి చేయాలని కూటమి ప్రభుత్వం లక్ష్యంగా పెట్టుకుందన్నారు.

ఎస్సీ, బీసీ లబ్ధిదారులకు రూ. 50 వేలు, ఎస్టీలకు రూ. 75 వేలు, పీవీటీజీ వర్గాలకు రూ. లక్ష అదనపు ఆర్థిక సాయం అందించేందుకు ఈ ఈ బడ్జెట్లో ప్రత్యేకంగా ప్రాధాన్యతనివ్వడం కూటమి ప్రభుత్వ చిత్తశుద్ధికి నిదర్శనం అన్నారు. రాష్ట్ర ఆర్థిక భద్రతకు విద్యుత్ రంగమే ప్రాణాధారమని పేర్కొంటూ.., ఇంధన శాఖకు రూ. 13,934 కోట్లు కేటాయింపులు చేసి , ఈ వార్షిక ఆర్థిక బడ్జెట్ వ్యవసాయానికి పెద్దపీట వేసిందని చెప్పకనే చెప్పిందన్నారు. వ్యవసాయ విద్యుత్ సబ్సిడీ కోసం ఏకంగా రూ. 11 వేల కోట్లు విడుదల చేసి 22.5 లక్షల మంది రైతులకు అండగా నిలిచిందనీ.., అదే సమయంలో ఆక్వా సబ్సిడీ కింద రూ. 890 కోట్లు కేటాయించి రైతు పక్షపాత ప్రభుత్వంగా నిరూపించిందన్నారు.

మొత్తంగా మౌలిక సదుపాయాల కల్పన , సంక్షేమాన్ని సమన్వయం చేస్తూ ఈ బడ్జెట్ను రూపొందించినట్లు స్పష్టం చేశారు.



## సహస్ర దీపాలంకరణ'లో శోభా రాజు సంకీర్తనా సేవ

**తిరుమల, ఫిబ్రవరి 14,మనం , న్యూస్ :** 'సహస్ర దీపాలంకరణ' సేవా కార్యక్రమంలో పద్మశ్రీ డాక్టర్ శోభా రాజు గారు వారి శిష్యులతో కలిసి తిరుమల శ్రీ వేంకటేశ్వర స్వామి వారికి సంకీర్తనా కైంకర్యం చేశారు. తొలుతగా 'అన్నమ గాయత్రి' మంత్రంతో ప్రారంభి 'సర్వం విష్ణు మయంబను'

'తిరుమలగిరి రాయా' రెండు అన్నమయ్య కీర్తనలను వారి శిష్యులు వాసంతి, సాయి గాయిత్రి తేజస్విని కలిసి ఆలపించారు.కార్యక్రమానికి వాయిద్య సహకారం కీబోర్డ్ కళ్యాణ్, తబలా మంజూ అందించారు. అనంతరం ఆలయ వెద పండితుల ఆశిర్వచనంతో డాక్టర్ శోభారాజు గారికి స్వామి వారికి ఇచ్చిన హారతి తీర్థ ప్రసాదాలు అందజేశారు.

## ప్రజా బడ్జెట్ : ఎమ్మెల్యే ఆరణి శ్రీనివాసులు

**తిరుపతి, ఫిబ్రవరి 14 మనం న్యూస్ :** ప్రభుత్వం ప్రవేశపెట్టిన బడ్జెట్ ప్రజల ఆశలను నెరవేర్చే బడ్జెట్ అని ఎమ్మెల్యే ఆరణి శ్రీనివాసులు తెలిపారు. సంక్షేమం, అభివృద్ధికి అధిక ప్రాధాన్యత బడ్జెట్ కేటాయింపులు చేశారని ఆయన చెప్పారు. శనివారం రాష్ట్ర



ఆర్థిక శాఖ మంత్రి పయ్యావుల కేశవ్ ప్రవేశపెట్టిన బడ్జెట్ 2047 స్వర్ణాంధ్ర లక్ష్యాలకు అనునగుణంగా ఉందని ఆయన తెలిపారు. రాయలసీమను హార్టీకల్చర్ హబ్ గా మార్చేందుకు ముప్పయ్ వేల కోట్లు కేటాయించడం గొప్ప ముందడుగని ఆయన అన్నారు. ఎన్డీఏ కూటమి ప్రభుత్వానికి రాయలసీమ అభివృద్ధిపట్ల ఉన్న అంకిత భావాన్ని తెలుపుతుందని ఆయన చెప్పారు. అలాగే రాష్ట్ర అభివృద్ధి 10.75 శాతంగా ఉంటుందని ఆర్థిక శాఖ అంచనా నిజం అవుతుందని ఆయన తెలిపారు. రాష్ట్రంపై సుమారు పది లక్షల అప్పు పెట్టి వెళ్ళిన వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీ చేసిన విధ్వంశాన్ని సరిదిద్దుతూ అభివృద్ధి, సంక్షేమం వైపు రాష్ట్రాన్ని పరుగులు పెట్టించేందుకు ఈ బడ్జెట్ దోహదపడుతుందని ఆయన చెప్పారు.

# మెడికల్ మాఫియాను అరికట్టకుంటే గోడౌన్లపై దాడులు

- **సిపిఐ జాతీయ కార్యవర్గ సభ్యులు డాక్టర్ కే నారాయణ**

**తిరుపతి, ఫిబ్రవరి 14 మనం న్యూస్ :** మెడికల్ మాఫియాను అరికట్టకుంటే గోడౌన్లపై దాడులకు దిగుతామని సిపిఐ జాతీయ కార్యవర్గ సభ్యులు డాక్టర్ కే నారాయణ హెచ్చరించారు. రాష్ట్రంలో మెడికల్ మాఫియాను అరికట్టడంలో ప్రభుత్వం ఘోరంగా విఫలమైందని విమర్శించారు. సిపిఐ రాష్ట్ర కమిటీ ఇచ్చిన పిలుపులో భాగంగా మెడికల్ మాఫియా కు వ్యతిరేకంగా శనివారం తిరుపతి నగరంలో నిరసన ప్రదర్శన నిర్వహించారు. పాత మున్సిపల్ కార్పొరేషన్ కార్యాలయం నుండి తిలక్ రోడ్డు మీదుగా నాలుగు కాళ్ల మండపం వరకు ర్యాలీ చేపట్టారు.

ఈ కార్యక్రమానికి ముఖ్యఅతిథిగా హాజరైన డాక్టర్ కే నారాయణ మాట్లాడుతూ నకిలీ మందులు రాష్ట్రంలో రాజ్యమేలుతోందని సామాన్యుల ఆరోగ్యాలతో చెలగాటమాడుతున్నారని పేర్కొన్నారు. మెడిసిన్స్ తయారు చేస్తున్న యాజమాన్యాలు నాసిరకం మందులను సరఫరా చేస్తున్నారని చెప్పారు. మెడికల్ ఏజెన్సీలు, మెడికల్ షాప్ లలో తనిఖీలు నిర్వహించాల్సిన వైద్య అధికారులు మామూలు మత్తులో ఉన్నారని ధ్వజమెత్తారు. నెల నెల మామూలు వసూలు చేసుకుంటూ అధికారులు గాఢ నిద్రలో ఉన్నారని అన్నారు. దీనిని రాష్ట్ర ప్రభుత్వం పట్టించుకోవడంలేదని స్పష్టం చేశారు.




మందుల కొనుగోళ్ల కోసం ప్రభుత్వం టెండర్ లు ఆహ్వానించిన సందర్భంలో తక్కువ రేట్ కి వేసిన వారికి మాత్రమే అవకాశం ఇస్తున్నారని చెప్పారు. దీంతో నాణ్యమైన మందులు సరఫరా ఉండడం లేదని, నాసిరకం మందులు ప్రభుత్వ ఆసుపత్రులకు సరఫరా చేస్తున్నారని అన్నారు. వారం రోజుల లోపు మెడికల్ మాఫియాను అరికట్టి వారిపై క్రిమినల్ చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు. నకిలీ మందులు నాసిరకం మందులు పంపిణీ చేస్తున్న ఏజెన్సీలను సీజ్ చేయాలని డిమాండ్ చేశారు. లేనిపక్షంలో సిపిఐ ఆధ్వర్యంలో మెడిసిన్ గోడౌన్లపై దాడులు చేస్తామని హెచ్చరించారు. ఈ కార్యక్రమంలో సిపిఐ రాష్ట్ర కార్యవర్గ సభ్యులు ఏ రామానాయుడు, జిల్లా కార్యదర్శి పి మురళి, నగర కార్యదర్శి విశ్వనాథ్, జిల్లా కార్యవర్గ సభ్యులు రాధాకృష్ణ, నదియా, ప్రజా సంఘాల ఎన్ డి రవి, శివ, పద్మనాభ రెడ్డి, రామచంద్రయ్య, గోవిందస్వామి, శీను, మహేంద్ర, నాగరాజు, కాలయ్య, ప్రవీణ్, వినయ్, మంజుల, రత్నమ్మ తదితరులు పాల్గొన్నారు.



## అశ్వ వాహనంపై సోమస్కందమూర్

**తిరుపతి, ఫిబ్రవరి 14 మనం న్యూస్ :** తిరుపతిలోని శ్రీ కపిలేశ్వరస్వామివారి బ్రహ్మోత్సవాల్లో ఏడో రోజైన శనివారం రాత్రి శ్రీ సోమస్కంధమూర్తి అశ్వ వాహనంపై భక్తులను అనుగ్రహించారు. భజనమండళ్ల కోలాటాలు, భజనలు, మంగళవాయిద్యాల నడుమ పురవీధుల్లో వాహనసేవ కోలాహలంగా జరిగింది.

ఉపనిషత్తులు ఇంద్రియాలను గుర్రాలుగా వర్ణిస్తున్నాయి. అందువల్ల అశ్వాన్ని అధిరోహించిన పరమాత్మ ఇంద్రియ నియామకుడు. స్వామి అశ్వవాహనాన్ని అధిష్టించి కలిదోషాలకు దూరంగా ఉండాలని, నామ సంకీర్తనాదులను ఆశ్రయించి తరించాలని ప్రబోధిస్తున్నారు.

వాహనసేవలో ఆలయ సూపరింటెండెంట్ చంద్రశేఖర్, ఇతర అధికారులు, అర్చకలు, విశేషంగా భక్తులు పాల్గొన్నారు.

## మహాశివరాత్రికి ప్రభుత్వం తరఫున పట్టు వస్త్రాలు సమర్పించిన మంత్రి ఆనం



**శ్రీకాళహస్తి, ఫిబ్రవరి 14, మనం న్యూస్ :** మహాశివరాత్రి బ్రహ్మోత్సవాల శుభ సందర్భంగా ఏర్పేడు మండలం గుడిమల్లం గ్రామంలో వెలసిన చారిత్రాత్మక శ్రీ పరశురామేశ్వర స్వామి వారికి రాష్ట్ర దేవాదాయ శాఖ మంత్రి ఆనం రామనారాయణరెడ్డి, శ్రీకాళహస్తి శాసనసభ్యులు బొజ్జల వెంకటసుధీర్ రెడ్డి ఆలయ పాలకమండలి సభ్యులు మరియు కూటమి నాయకులతో కలిసి స్వామివారికి ప్రభుత్వ తరపున పట్టువస్త్రాలను సమర్పించారు. బొజ్జల వెంకట సుధీర్ రెడ్డి మాట్లాడుతూ క్రీస్తు పూర్వం 2వ శతాబ్దానికి చెందిన ఈ క్షేత్రం,ప్రపంచంలోనే అత్యంత పురాతనమైన, ఇప్పటికీ పూజలందుకుంటున్న ఏకైక శివలింగంగా ప్రసిద్ధి గాంచిందని,పరశురాముడు ఇక్కడ స్వామివారిని పూజించి తరించాడని పురాణాలు చెబుతున్నాయి అన్నారు. అనంతరం మంత్రితో కలిసి ఆలయ అభివృద్ధి పనులు, మౌలిక వసతుల కల్పన మరియు దానికి కావలసిన నిధుల కేటాయింపు గురించి ప్రత్యేకంగా చర్చించారు.

మన వారసత్వ సంపదను కాపాడుకుంటూ, భక్తులకు మెరుగైన వసతులు కల్పించేలా నా కృషి నిరంతరం కొనసాగుతుంది. ఆ పరమశివుని కృపాకటాక్షాలు ప్రజలందరిపై ఎల్లప్పుడూ ఉండాలని మనస్ఫూర్తిగా కోరుకుంటున్నానని అన్నారు. ఈ కార్యక్రమంలో తిరుపతి జిల్లా కలెక్టర్ వెంకటేశ్వర్, ఎస్పి సుబ్బరాయుడు పాల్గొన్నారు.

## ఎర్రచందనం ముద్దాయిలు ఇద్దరిపై పీడీ యాక్ట్

**తిరుపతి, ఫిబ్రవరి 14 మనం న్యూస్ :** ఎర్రచందనం అక్రమ రవాణాకు చెందిన పలు కేసుల్లో ముద్దాయిలుగా ఉన్న కర్నాటక కు చెందిన సయ్యద్ ఫైరోజ్ ఎలియాస్ ఫైరోజ్ ఎలియాస్ సయ్యద్ ఎలియాస్ ఫైరు (38), చిత్తూరు జిల్లాకు చెందిన రాజశేఖర్ ఎలియాస్ రాజా బాబు ఎలియాస్ బూసి (33)లపై టాస్క్ ఫోర్స్ అధికారులు పీడీ యాక్ట్ అమలు చేశారు. టాస్క్ ఫోర్స్ హెడ్ ఎల్. సుబ్బారాయుడు ప్రత్యేక కార్యాచరణ



అములులో భాగంగా టాస్క్ ఫోర్స్ ఎస్పీ పీ శ్రీనివాస్ అధ్వర్యంలో ఏఎస్పీ జె. కులశేఖర్ మార్గ నిర్దేశకత్వంలో ఎర్రచందనం అక్రమ రవాణా నిరోధించడమే కాకుండా, ఎక్కువ కేసుల్లో ఎర్రచందనం అక్రమ రవాణా వృత్తిగా చేసుకుని, ముఠాగా ఏర్పడి స్మగ్లింగ్ కు పాల్పడుతున్న వారిపై పీడీ యాక్ట్ లు అమలు చేస్తున్నారు. ఇందులో భాగంగా ఇద్దరు ముద్దాయిలు సయ్యద్ ఫరోజ్ ఎలియాస్ ఫైరోజ్ ఎలియాస్ ఫైరు, రాజశేఖర్ ఎలియాస్ రాజబాబు ఎలియాస్ బూసి లపై పీడీ యాక్ట్ అమలుకు టాస్క్ ఫోర్స్ హెడ్ ఎల్. సుబ్బారాయుడు సిఫారసు చేశారు. ఈ మేరకు తిరుపతి జిల్లా కలెక్టరు, జిల్లా మెజిస్ట్రేట్ డాక్టర్ ఎస్. వెంకటేశ్వర్ , వీరిపై పీడీ యాక్ట్ అమలుకు ఉత్తర్వులు జారీ చేశారు. వీరిద్దరూ ఎర్రచందనం కొల్లగొట్టడుతూ, వన్య మృగాల చట్టాలను ఉల్లంఘించి నేరాలు చేస్తూ ప్రజాజీవనానికి అటంకం కలిగిస్తున్నట్లు గుర్తించారు. పీడీ యాక్ట్ అమలులో భాగంగా నిందితులను కడప సెంట్రల్ జైలుకు తరలించారు. ఎర్రచందనం అక్రమ రవాణా నిరోధకంలో భాగంగా పీడీ యాక్ట్ అమలు చేయడానికి వెనుకాడబోమని టాస్క్ ఫోర్సు ఎస్పీ పీ.శ్రీనివాస్ హెచ్చరించారు. ఎర్రచందనం కేసుల్లో ఇప్పటికే అనేక మందికి శిక్షలు పడ్డాయని గుర్తు చేశారు. యువత ఎర్రచందనం అక్రమ రవాణాకు ప్రయత్నించి వారి భవిష్యత్తును పాడు చేసుకోవద్దని చెప్పారు. స్మగ్లర్లకు శిక్ష పడటంతో పాటు వారి ఆస్తులు కూడా జప్తు చేసుకో పడతాయని తెలియజేసారు.

## నూతన దంపతులను ఆశీర్వదించిన పినిపే శ్రీకాంత్

**కాత్రేనికోన , ఫిబ్రవరి 14, మనం ప్రతినిధి :** మహిపాల చెరువు వి కన్వెన్షన్ హాల్ నందు కావూరి వారి వివాహ వేడుక ఘనంగా జరిగింది. కార్యక్రమం లో అమలాపురం అసెంబ్లీ నియోజకవర్గ వైసీపీ కో ఆర్డినేటర్ డా పినిపే శ్రీకాంత్, మాజీ శాసన సభ్యులు పాముల రాజశ్వరి దేవిపాల్గొని నూతన వధూవరులను ఆశీర్వదించారు. ఈ కార్యక్రమంలో రాజోలు సర్పంచ్ రేవు జ్యోతి, ఉప్పాడి వైసీపీ నాయకుడు ఉచ్చిల రవి కుమార్, ,ములపర్తి శ్రీను,గుమ్మళ్లసురేష్, పెయ్యాల రాజ్ కుమార్,పెయ్యాల చిట్టిబాబు భూలక్ష్మి, పెయ్యాల ఈశ్వర రావు,బీర జాన్, ముడిదుడ్డి వెంకట రమణ, బుడితి నాగేశ్వరరావు, ఉండ్రు వెంకటేష్,కాశి హనుమంత రావు, చెల్లూరి బాల కృష్ణ, పెయ్యాల సురేష్ బాబు తదితరులు పాల్గొన్నారు.



# బడ్జెట్ గొప్పలు... బాబు గారి తిప్పలు



- **ఉద్యోగ, కార్మికులకు మొండి చెయ్యి!**

**తిరుపతి ఫిబ్రవరి 14,మనం న్యూస్ :** కూటమి ప్రభుత్వం తరపున ఆంధ్రప్రదేశ్ అసెంబ్లీలో ఆర్థిక మంత్రి పయ్యావుల కేశవ్ ప్రవేశపెట్టిన బడ్జెట్, గొప్పలు చెప్పుకోవడానికి మరియు బడాయి మాటలు మాట్లాడుకోవడానికి ఉద్దేశించినదిగా కనిపిస్తోందని ప్రజలను ఉద్ధరించడానికి ఎలాంటి కాదని సిఐటియు రాష్ట్ర ఉపాధ్యక్షులు కందారపు మురళి ఒక ప్రకటనలో తెలిపారు.

రాష్ట్ర బడ్జెట్లో సోత్కర్ష, పరనింద మాత్రమే కనిపిస్తున్నాయని ఆయన ఆరోపించారు.

అప్పులు తెచ్చుకోవడానికి రాష్ట్ర స్థూల ఉత్పత్తి ని పెంచి చూపడం 2017 నుంచి రాష్ట్ర అధినేతలకు అలవాటుగా మారిందని ఆయన ఎద్దేవా చేశారు. జంబోజెట్ బడ్జెట్లను ప్రవేశపెట్టి, ఆదాయం లేకపోవడంతో సవరించేటప్పుడు కేటాయింపులను తగ్గించుకోవడం గత కొంతకాలంగా రాష్ట్రంలో సాధారణ విధానంగా మారిందని కందారపు మురళి విమర్శించారు.

ఉద్యోగులకు 12వ పే రివిజన్ కమిషన్ ఇవ్వకపోవడం, కాంట్రాక్టు కార్మికులకు కనీస వేతనం నిర్ణయించకపోవడం యజమానులకు అనుకూలమైన లేబర్ కోడ్లు మరియు కార్మిక సంస్కరణల గురించి గొప్పగా చెప్పుకోవడం చేతగానితనమే అని ఆయన అన్నారు. ఈ బడ్జెట్ కార్మికులు, ఉద్యోగుల హక్కులను పూర్తిగా విస్మరించిందని, ప్రజల సమస్యలకు పరిష్కారం చూపలేదని ఆయన అన్నారు.

నిరుద్యోగం, విశాఖ ఉక్కు ప్రైవేటీకరణ, పోలవరం, అమరావతి రాజధాని, వెనుకబడిన ప్రాంతాల అభివృద్ధి, సాగునీటి ప్రాజెక్టులలో ప్రాధాన్యత క్రమం అధిక ధరలు తదితర మౌలిక అంశాలు ఈ బడ్జెట్లో కొరవడిందని కందారపు మురళి ఆ ప్రకటనలో పేర్కొన్నారు.

# చెవిరెడ్డి భాస్కర్ రెడ్డి దంపతుల తలకోన శ్రీ సిద్ధేశ్వర స్వామికి పట్టు వస్త్రాల సమర్పణ

**తిరుపతి, ఫిబ్రవరి 14 మనం న్యూస్ :** తిరుపతి జిల్లా ఆధ్యాత్మిక క్షేత్రంగా పేరుగాంచిన తలకోన సిద్ధేశ్వర స్వామి దేవాలయంలో మాజీ ఎమ్మెల్యే చెవిరెడ్డి భాస్కర్ రెడ్డి దంపతులు భక్తిశ్రద్ధలతో స్వామివారికి పట్టు వస్త్రాలు సమర్పించారు. ఈ కార్యక్రమం సందర్భంగా చిన్నగొట్టిగల్లు, ఎర్రవారిపాలెం మండలాల నుంచి భారీగా తరలివచ్చిన వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీ నాయకులు, కార్యకర్తలు నేతలకు ఘన స్వాగతం పలికి ప్రాంతాన్ని పండుగ వాతావరణంగా మార్చేశారు. ఉదయం నుంచే నెరబైలు ప్రాంతం నినాదాలతో కళకళలాడింది. చెవిరెడ్డి భాస్కర్ రెడ్డి దంపతులతో పాటు హర్షిత్ రెడ్డిని వైసీపీ శ్రేణులు అంగరంగ వైభవంగా ఊరేగింపుగా తీసుకెళ్లాయి. డప్పుల మోతలు, హర్షధ్వానాలు, పూలవర్షం మధ్య సాగిన ఈ ఊరేగింపు స్థానికులను విశేషంగా ఆకట్టుకుంది. జనసంద్రం కారణంగా ఊరేగింపు మరదలు దాటేందుకు దాదాపు రెండు గంటల సమయం పట్టడం కార్యక్రమానికి వచ్చిన స్పందనను స్పష్టంగా చూపించింది. వేలాదిగా తరలివచ్చిన కార్యకర్తలతో నెరబైలు ప్రాంతం జన సముద్రాన్ని తలపించింది. ప్రతి వీధి, ప్రతి మూలలో స్వాగత ద్వారాలు ఏర్పాటు చేసి నాయకులకు అభినందనలు తెలిపారు. మహిళలు హారతులు పట్టి స్వాగతం పలకగా, యువత నినాదాలతో ఉత్సాహాన్ని మరింత పెంచారు.

దేవస్థానానికి చేరుకున్న చెవిరెడ్డి దంపతులకు ఈవో, అర్చకులు పూర్ణకుంభంతో వేదమంత్రాల నడుమ ఆత్మీయ స్వాగతం పలికారు. అనంతరం ప్రత్యేక పూజలు నిర్వహించి స్వామివారికి పట్టు వస్త్రాలు సమర్పించారు. కుటుంబ



సమేతంగా స్వామివారి ఆశీస్సులు తీసుకున్న చెవిరెడ్డి దంపతులు ప్రాంత ప్రజల శ్రేయస్సు కోసం ప్రార్థించారు. కార్యక్రమం మొత్తం భక్తి, ఉత్సాహం, రాజకీయ ఉత్సవాల సమ్మేళనంగా కొనసాగింది. భారీ సంఖ్యలో పాల్గొన్న పార్టీ శ్రేణులు శాంతియుతంగా వ్యవహరించగా, నిర్వాహకులు అన్ని ఏర్పాట్లను సమర్థంగా నిర్వహించారు. ఈ వేడుక స్థానికంగా విశేష చర్చనీయాంశంగా మారింది. చెవిరెడ్డి మాట్లాడుతూ గత 14 సంవత్సరాలుగా సిద్దేశ్వర స్వామికి సారె సమర్పించడం ఆనవాయితీగా వస్తోంది. శివరాత్రి పర్వదినాన్ని చంద్రగిరి నియోజకవర్గ ప్రజలందరూ కుటుంబ సమేతంగా ఉల్లాసంగా హాయిగా ప్రశాంతంగా జరుపుకోవాలని కోరుతున్నానని తెలిపారు.

మనం Manam





# సనాతన ధర్మమే 'శైవ' ధర్మం



భారత హైందవ సంస్కృతిలో శైవం ఒక ప్రత్యేకతను సంతరించుకొని ఉంది. శైవమతం ప్రాచీన, వేద సాంప్రదాయాల సమ్మేళనం. చాతుర్వర్ణ వ్యవస్థ కలిగిన భారత హిందూ సమాజం శూద్రులు, అతిశద్రులను దేవుళ్ల దగ్గర కూడా అంటరాని వారిని చేసింది. కానీ ఇదే భారతదేశంలో అతి పురాతనమైన మతంగా విరాజిల్లుతున్న శైవ మతం అన్ని కులాలను అక్కున చేర్చుకున్నదని చెప్పాలి. ఆత్మ పరిశీలన ద్వారా ఆత్మ-పరమాత్మల ఐక్యతను శైవ మతం విశదీకరించడమే దీనికి కారణం కావచ్చు. దక్షిణ భారతదేశంలో ద్రావిడ సంస్కృతి ప్రభావంతో వైష్ణవ మతం కంటే ముందుగానే శైవ మతం బలంగా విస్తరించింది. శైవ మత సిద్ధాంతానికి దక్షిణ భారతదేశంలోని తమిళనాడు మరియు పొరుగున ఉన్న శ్రీలంక వంటి దేశంలో బలమైన పునాదులు పడ్డాయి. శైవ మతం అత్యంత ప్రాచీనమైన ఆధ్యాత్మిక సాంప్రదాయాలలో ఒకటి. వేదాలు మూలాలుగా గల అష్టాదశ పురాణాలు ఉన్నాయి. ఆ వేదాలు చతుర్ముఖుడైన బ్రహ్మకు పరమశివుడే ఉపదేశించాడు అంటారు. కాబట్టి వేదాలు వాటి నుండి వెలువడిన శృతి,స్మృతులు, పురాణాలు అన్ని ప్రథమంగా శివుని చేత బ్రహ్మదేవుడికి తెలుపబడింది అన్నమాట. మహాభారతంలోని శాంతి పర్వంలో అష్టాదశ పురాణాం 'దశభిః కథ్యతే శివః' అని పేర్కొన్నారు. అష్టాదశ పురాణాల్లో పది పురాణాలు శివుని కథలతో నిండి ఉన్నాయంటేనే శివుడే పురాణ కథానాయకుడు అని తెలిసిపోతుంది. పురాణాలుఅలాగే సనాతనధర్మం వేదాలు మరియు ప్రాచీనగ్రంధాల నుండి ఉద్భవించిన అత్యంత ప్రాచీన వైదిక ధర్మంగా, పూర్వ ఆర్య సాంప్రదాయాలు, వేదాలలోని రుద్రుడి ఆరాధన నుండి శైవం ప్రాచుర్యంలోకి వచ్చిందని చెపుతారు. శైవమతం శివుడిని సర్వోన్నత దేవుడిగా ఆరాధించే పురాతన అతిపెద్ద సాంప్రదాయం. శైవమతంలో శైవ సిద్ధాంతం ( ద్వైతం ) కాశ్మీరీ శైవం ( అద్వైతం) వీరశైవం వంటి వివిధ శాఖల సంప్రదాయాలు ఉన్నాయి. సృష్టి స్థితి లయకారుడిగా శివుడిని ఆరాధిస్తారు. శివుని ఆరాధనకు శివాలయం ప్రధాన కేంద్రం. మన దేశంలో ఎన్నో శివాలయాలు ఉన్నాయి. అందునా మన తెలంగాణలో శైవ మతం చారిత్రకంగా కాకతీయుల కాలంలో బలంగా విస్తరించింది. శైవ మతం దాని ఆచారాలు పూర్వకాలం నుండి భారతదేశంతో పాటు నేపాల్, శ్రీలంక వంటి దేశాల్లో బలంగా వేల్లూనుకుపోయి ప్రజలలో విడదీయరాని విశ్వాసాన్ని పాదుకొల్పాయనేది నిజం. ఇక యోగ, ధ్యానం, భక్తి మరియు ఆగమశాస్త్రాలకు శైవం ప్రాధాన్యత నిస్తుంది. శివుడు వేదాలకు పూర్వమే పూజించబడ్డాడని తెలుస్తోంది. క్రీ. పూ 200.. క్రీ.శ 100 సంవత్సరాల మధ్య కాలంలో రూపు దిద్దుకున్నాయి. శైవ మత మూలాలు క్రీ.పూ 2500-2000 మధ్యకాలంలోని సింధూ నాగరికత (పశుపతి ముద్రిక ) వరకు విస్తరించి ఉన్నాయని చెప్పాలి. ఋగ్వేదం ( క్రీ,,పూ1500-1200)లో రుద్ర ప్రస్తావన మొదటి స్పష్టమైన ఆధారం కాగా, పాణిని మహాభాష్యం (క్రీ.పూ 2వ శతాబ్దం) శివ భాగవతుల గురించి ప్రస్తావించడం గమనార్హం. ప్రధానంగా ప్రాచీన మధ్యయుగ భారతదేశంలో పల్లవ, చోళ, రాష్ట్ర కూట, కాకతీయ మరియు కళ్యాణి చాళుక్య వంశాల రాజులు శైవ మతాన్ని రాజ ధర్మంగా స్వీకరించి శైవ సిద్ధాంతాలను ప్రజల్లోకి తీసుకెళ్లడమే కాకుండా శైవ మత ఉద్యమాలకు ఊతమిచ్చి భారీ శివాలయాలను నిర్మించి శైవ మత వైభవాన్ని చాటిచెప్పారు. అంతెందుకు సృష్టికి మూలపురుషుడు అతి శూద్రుల ఆరాధ్యుడు జాంభవంతుడి కొలనుపాక లోని అదిజాంభవ మతంలో శివారాధనే ప్రధాన మతాచారంగా కొనసాగుతోంది. లింగరూపంలో శివున్ని పూజించటం, ప్రకృతి నియమాలను పాటించటం ధ్యానం మరియు భక్తి మార్గాలద్వారా ముక్తి పొందటం దీని ప్రత్యేకత. శైవ సిద్ధాంతం ద్వంద్వ తత్వాన్ని బోధిస్తుంది. ఆత్మ శివుని అనుగ్రహంతో జ్ఞానోదయం పొందటం దీని అంతిమ లక్ష్యం. ఆదిశంకరాచార్యులు చెప్పినట్టు శివుడు అంటే అత్యంత పవిత్రమైన వాడు, ఎలాంటి కల్మషం లేనివాడు అని అర్థం. శివుడే సర్వజీవుల అంతర్ముఖుడు. శైవులు సాధారణ వ్యక్తిత్వం, అద్వైత వేదాంతం చుట్టూ కేంద్రీకృతమై ఉంటారు. రామాయణంలో మహావిష్ణు అవతారమైన రాముడు శివుడిని పూజించి కీర్తించాడు.

అలాగే శివుడు శ్రీరామ రామ రామేతి రామే రామే మనోరమే సహస్ర నామ తత్త్వం రామ నామ వారణనే అనిచెప్పి రామ నామాన్ని కీర్తించాడు. ఇక మహావిష్ణువు అవతారమైన భార్గవ రాముడు శివుడిని పూజించి 'పరశు' అనే దైవిక గొడ్డలి ని పొందాడు అని విన్నాం కదా అందుకే శివ తత్వాన్ని మించినది ఆయనతో సమానమైనది ఏదీ లేదు అంటారు. దక్షిణ భారతదేశంలో ద్రవిడ సంస్కృతి నేపథ్యంలో అత్యధిక జనాభా కలిగిన శూద్ర, అతిశూద్ర వర్గాల ప్రజలు అనాదిగా శైవ మతాన్ని ఆచరిస్తున్నారు. స్థానిక సాంప్రదాయాలు, ప్రకృతి ఆరాధనతో శైవులుగా మారి వైష్ణవంలో సమ్మిళితం కాలేకపోయారు. కాబట్టి దక్షిణాదిన అనాదిగా శైవ మతం గొప్పగా విరాజిల్లుతుందని చెప్పొచ్చు. హర హర మహాదేవ శంభో శంకర, ఓం నమః శివాయ. సర్వం శివాత్మికం.

**నేడు మహా శివరాత్రి**

**- ధీరన్ కొడారి**
8008200664

## చిదానంద రూపం శివోహం

ఆనంద ప్రదాత ప్రళయ రుద్రుడు
జీవితం ఆనంద-విషాదాల మయం
దుఃఖ దాత, దహనుడూ ఆ శివుడే
శివైక్య ఆధ్యాత్మిక క్రమమే రౌద్రీకరణం

జీవన్నాటకం రక్తి కట్టించడానికి నటరాజు..
రంగరిస్తాడు సుఖదుఃఖాల వడ్డిస్తూ..
మంచి చెడుల్ని మేళవిస్తాడు పశుపతి
శివమెత్తి రౌద్ర రసాలు కుమ్మరిస్తాడు !

కైలాసం హిమాలయాల్లోనే కాదు..
కాయకష్టం చేసే శ్రమజీవిలోనూ ఉన్నాడు
కాయకమే కైలాసం, శ్రమజీవనమే శివం
భక్తి చిక్కబడితే 'అశివం' కరిగిపోతూ
సత్యం శివం సుందరం వెలువడుతుంది
అమృతం తాగినోళ్లు దేవతలైతే.
దేవతల హితానికి గరళాన్ని మింగినోడు..
ఎంత గొప్ప దేవ దేవుడో తెలుసుకోవాలి !

చావు పుట్టుకల మధ్య నాటకమాడించే..
ఆద్యంతరహితుడు, కాలాతీతుడు..
గంగలో జీవరాలు కొట్టుకుపోకుండా..
జాహ్నవిని జటాజూటంలోకి ఆహ్వానించి..

ఏడు పాయలుగా నేలపై పారించిన..
ఆ చిదానందరూప పరమేశ్వరుడు..
లింగమై భక్తకోటి దరికి దిగొస్తాడు..
అర్హతకు తగిన కోరిన వరాలిస్తాడు !

**మధుపాళీ**
9949700037

# బంధం ఇప్పుడైనా బలపడుతుందా?



ఎట్టకేలకు బంగ్లాదేశ్ లో ఎన్నికలు జరిగి ఫలితాలు వెలువడ్డాయి. బంగ్లా ఎన్నికలపై భారతదేశానికి ఆసక్తి ఎందుకో అందరికీ తెలిసిందే. ఎందుకంటే స్నేహితులని మార్చుకోవచ్చు కానీ పొరుగు వారిని మార్చలేము అన్నది పెద్దల సామెత. కాబట్టి పొరుగునే ఉన్న దాయాది దేశంలోని రాజకీయ పరిణామాలను ఆసక్తితో పరిశీలించడం అనేది మనకు అనివార్యమైపోయింది.

భారతదేశానికి చెందిన ఐదు రాష్ట్రాలు బంగ్లాదేశ్‌తో సరిహద్దులను పంచుకుంటున్నాయి. ఆయా రాష్ట్రాల్లో తీవ్రవాద గ్రూపుల బెడద తీవ్రంగా ఉండడం, వాటికి గతంలో భౌతిక మరియు నైతిక మద్దతు బంగ్లాదేశ్ నుంచి అంది ఉండడం, ఆ మద్దతు కూడా ఇప్పుడు బంగ్లాలో గెలిచిన పార్టీ హయాంలోనే అంది ఉండడం వలన ఇక్కడి ప్రతి పరిణామమూ భారత్‌కు ముఖ్యమైనదే. ఒకటిన్నర సంవత్సరాల క్రితం ఆ దేశంలో సంభవించిన పరిణామాలు ఆశ్చర్యకరమైనవి. అప్పటి ప్రధాని షేక్ హసీనా అమలుపరిచిన క్రూర నిర్బంధం, అణచివేత చర్యలకు వ్యతిరేకంగా చెలరేగిన విద్యార్థి-యువజనుల ఉద్యమం ఆమె పదవీచ్యుతికి దారితీస్తుందని ఎవరు ఊహించి ఉండరు.

ఆమె తరువాత ఏర్పడిన తాత్కాలిక ప్రభుత్వానికి ప్రధాన సలహాదారుగా బాధ్యతలు చేపట్టిన నోబెల్ బహుమతి గ్రహీత మహమ్మద్ యూనస్ కూడా ఇంత అధ్వాన్నంగా పరిపాలిస్తాడని ఎవరూ ఊహించలేదు. ఆయన పరిపాలన కాలంలో ఎక్కువ భాగం మత ఛాందస వాదాన్ని మరింత ఎగదోయడానికి మాత్రమే ఉపయోగించాడు.

ఒకప్పుడు తమ పార్టీని నిషేధించిన అవామీలీగ్‌పై తాత్కాలిక ప్రభుత్వము చేత నిషేధం



విధింప చేసి జమాతే ఇస్లామి మీద ఒక విధంగా పగ తీర్చుకుంది.

ప్రధాన పార్టీ అయిన అవామీ లీగ్‌కు ఈ ఎన్నికల్లో పోటీ చేసే అవకాశం లేకపోవడం, దానిపై నిషేధం ఉండడం, బిఎన్‌పి, జమాతే ఇస్లామిపార్టీలకు కలిసి వచ్చింది. 299 పార్లమెంటు స్థానాలలో 212 స్థానాలను బంగ్లా నేషనలిస్టు పార్టీ గెలుచుకోవడం, దానితో పాటుగా పూర్తి మతతత్వ పార్టీ అయిన జమాతే ఇస్లామి 70 స్థానాలను కైవసం చేసుకోవడం గొప్ప విషయం ఏమీ కాదు.

ఎందుకంటే పోటీయే లేని చోట ఎన్నికల పోరాటం అన్నది నల్లేరు మీద బండి నడకే కదా. విద్యార్థి యువజనుల పార్టీ అయిన నేషనల్ సిటిజన్ పార్టీకి అతి తక్కువ ఓట్లు రావడం ఇక్కడ గమనార్హం. ఉద్యమాన్ని నడపడం అయితే నడిపారు గాని దాని యొక్క లక్ష్యాలను సాధించడంలో వాళ్లు విఫలం కావడమే ఈ తక్కువ ఫలితాలకు కారణమని తెలుస్తూనే ఉంది.

అధికారంలోకి రాబోతున్న బీఎన్‌పీ కానీ ప్రతిపక్షంలో కూర్చోబోతున్న జమాతే ఇస్లామి పార్టీ గానీ భారత్‌తో అనుకూలమైన సంబంధాలను కోరుకునే పార్టీలు కాదు. వాటి గత చరిత్ర చూస్తే మనకు ఈ విషయం అర్థం అవుతుంది. అయినప్పటికీ బీఎన్‌పీ కొత్త నాయకుడు దివంగత బీఎన్‌పీ అధ్యక్షురాలు ఖలీదా జియా కుమారుడు తారిఖ్ రెహమాన్ బంగ్లా ప్రజలకు ఇచ్చిన హామీలను బట్టి ఆయన పరిపాలన గతంలో కంటే భిన్నంగా ఉంటుందనీ,ఇరుగు పొరుగు దేశాలతో సత్సంబంధాలు నెలకొల్పుకొనే దిశగా ఆయన అడుగులు వేస్తారని విశ్లేషకులు భావిస్తున్నారు.

బంగ్లాదేశ్ మనకు పొరుగు దేశం కావడం వలన సరిహద్దు భద్రత, నదీ జలాల పంపకం అక్రమ చొరబాట్లు వంటి అంశాలు భారత్ బంగ్లాదేశ్‌ల మధ్య సంబంధాలను నిత్యం ప్రభావితం చేస్తాయి. ఈ విషయంలో బంగ్లా పాలకులు చిత్తశుద్ధితో వ్యవహరించాల్సి ఉంటుంది.పశ్చిమ బెంగాల్లో చొరబాట్ల తీవ్రత ఎక్కువగా ఉందని అక్రమ వలసదారులను పంపించి వేయడానికి కేంద్ర ప్రభుత్వం దేశమంతా సర్ అనే కార్యక్రమాన్ని చేపట్టిన విషయం తెలిసిందే. ప్రస్తుతం ఈ కార్యక్రమం పసివ బెంగాల్లో కొనసాగిస్తుండడం తెలిసిందే ఈ విషయంలో అనేక అనేక మలుపులు, సుప్రీంకోర్టు తీర్పులు సాక్షాత్తు ముఖ్యమంత్రి సుప్రీంకోర్టులో తమ రాష్ట్ర వాదనలు ఒక లాయర్ లాగా తానే వినిపించడం లాంటివన్నీ ఇటీవల జరిగిన పరిణామాలు. అలాగే ఇంకొక సరిహద్దు రాష్ట్రమైన అస్సాంలో కూడా ఎన్నికలు జరగబోతున్నాయి. వేరే రూపంలో అక్కడ కూడా అక్రమ చొరబాట్ల సమస్య అసెంబ్లీ ఎన్నికల్లో ప్రధాన ప్రచారాస్త్రంగా ఉంది..నదీ జలాల ఒప్పందం ఇంకా అలాగే వుంది. ఇక సరిహద్దు భద్రత విషయంలో బంగ్లాదేశ్ అనుసరించే విధానం అనేది ఇరుదేశాల సంబంధాల పైన తీవ్రమైన ప్రభావం చూపే అవకాశం ఉంది.

ఎందుకంటే 2001- 2006లో బంగ్లాదేశ్ ను బంగ్లాదేశ్ నేషనలిస్ట్ పార్టీ పరిపాలించినప్పుడు జమాతే ఇస్లామి ఒత్తిడి మేరకు బి యన్ పి, భారత్ తో ఘర్షణాత్మక వైఖరిని అవలంబించినందువల్లనే ఆ కాలంలో ఇరుదేశాల సంబంధాలు కుదుపునకు గురయిన విషయం తెలిసిందే. ఇప్పుడు కూడా బంగ్లా నేషనలిస్టు పార్టీ అధికారంలోకి రాబోతుండడం, ప్రధాన ప్రతిపక్షంగా జమాతే ఇస్లామి ఉండడం అనేది ఇరు దేశాల సంబంధాల పైన తీవ్రమైన ప్రభావం చూపే అవకాశమే కనిపిస్తుంది.

ఎందుకంటే గతంలో జమాతే ఇస్లామి ప్రోత్సాహంతోనే తీవ్రవాద శక్తులు విజృంభించడం సరిహద్దుల్లో ఘర్షణలు తలెత్తడం జరిగేది. ఇప్పుడు ఆ పార్టీ ప్రధాన ప్రతిపక్షం స్థానంలో కూర్చుంటున్నది కనుక, అట్లాంటి చర్యలకి మళ్లీ ఊతమిచ్చే అవకాశం ఉంది గనుక, తారిఖ్ రెహమాన్ వివేకంతో వ్యవహరించాల్సి ఉంటుంది. అప్పుడే ఇరుదేశాల మధ్య సుహృద్భావ వాతావరణం ఏర్పడుతుంది.

**- గుండెబోయిన శ్రీనివాస్**
9985194697

# రుణాల ఊబిలో భారత్



సామాన్యులే కాకుండా ప్రభుత్వాలు సైతం అప్పులు లేనిదే ముందుకు వెళ్లలేని పరిస్థితులు కనిపిస్తున్నాయి. ఈ అప్పులు ప్రపంచ దేశాల ఆర్థిక వ్యవస్థల గమనాన్ని నిర్దేశిస్తున్నాయి. సామాజిక సంక్షేమం, మౌలిక సదుపాయాల కల్పన, ఆర్థిక స్థిరత్వం కోసం దేశాలు చేస్తున్న అప్పులు అతి భారీ స్థాయికి చేరుకున్నాయి. అంతర్జాతీయ ద్రవ్యనిధి వెల్లడించిన గణాంకాల ప్రకారం




2025-26 నాటికి ప్రపంచ దేశాల మొత్తం అప్పు 110.9 ట్రిలియన్ డాలర్లకు చేరుకుంటుందని అంచనా. ఈ అప్పులో ఎక్కువ భాగం ప్రపంచంలోని అతిపెద్ద ఆర్థిక వ్యవస్థలు కలిగిన దేశాల్లోనే ఉండటం గమనార్హం.

భారతదేశంలోని 147 కోట్ల మంది జనాభాలో ప్రతి ఒక్కరిపై ఈ ఏడాది మార్చి నాటికి రూ.1.34 లక్షల అప్పుంది. ఇది వ్యక్తులు చేసిన అప్పు కాదు. కేంద్ర ప్రభుత్వం తీసుకున్న రుణం. ఈ సంవత్సరం (2026-27)కూడా భారీగాఅప్పులు చేయాల్సి వస్తోంది. ప్రస్తుత ఆర్థిక సంవత్సరంలో రూ.14.61 లక్షల కోట్ల అప్పులు చేసిన కేంద్రం రాబోయే ఆర్థిక సంవత్సరానికి ఏకంగా రూ.17.2 లక్షల కోట్ల రుణాలు తీసుకోవాల్సి ఉంటుంది. ప్రస్తుత ఆర్థిక సంవత్సరంలో తీసుకున్న రుణానికి 17 శాతం ఎక్కువ కావడం గమనార్హం. 2026-27 ఆర్థిక సంవత్సరానికి కేంద్ర ప్రభుత్వం రూ.53.47 లక్షల కోట్లకు బడ్జెట్ ప్రవేశపెట్టింది. ఇందులో మార్కెట్ నుంచి మొత్తం రూ.17.2 లక్షల కోట్లు సేకరించాల్సి ఉందని కేంద్ర ఆర్థిక మంత్రి వెల్లడించారు.

2025-26 సవరించిన అంచనాల ప్రకారం కేంద్రం మొత్తం అప్పులు రూ.1,97, 18,016 కోట్లు కాగా మార్చి 2027 నాటికి ఇది 2,14, 82,050 కోట్లకు చేరనుంది. ఇక జీడీపీలో రుణ నిష్పత్తిని 55.6 శాతానికి తగ్గించాలని లక్ష్యంగా పెట్టుకున్నారు.

వాస్తవానికి ఈ నిష్పత్తి 2019లో 50 శాతంలోపే ఉంది. ఇక తాజాబడ్జెట్‌లో జీడీపీలో ద్రవ్యలోటును 4.3 శాతంగా అంచనా వేశారు.2026 మార్చి 31నాటికి కేంద్రం మొత్తంఅప్పులు రూ.197.18లక్షల కోట్లకు (సుమారు ట్రిలియన్ డాలర్లు) చేరుకుంటా యని అంచనా వేశారు. ఇది 2026-27 ఆర్థిక సంవత్సరంలో మరింత పెరిగి రూ. 214.82 లక్షల కోట్లకు చేరవచ్చని బడ్జెట్ అంచనాలు వెల్లడిస్తున్నాయి. 2024లో దేశం మొత్తం అప్పు సుమారు 85 శాతంగా ఉంది.

2025-26 ఆర్థిక సంవత్సరంలో కేంద్ర ప్రభుత్వ అప్పులు రూ. 197.18 లక్షల కోట్ల నుండి 2026-27 నాటికి రూ. 214.82 లక్షల కోట్లకు పెరుగుతాయని అంచనా.

2026 ప్రారంభానికి, దేశంలోని ప్రతి పౌరుడిపై సుమారు రూ. 1.34 లక్షల అప్పు (కేంద్రం చేసిన రుణాల ప్రకారం) ఉంది.

2025-26లో 4.4శాతం , 2026-27 నాటికి 4.3 శాతంకు తగ్గించాలని ప్రభుత్వం లక్ష్యంగా పెట్టుకుంది. 2025-26 నాటికి 56.1శాతం గా ఉన్న అప్పు-జీడీపీ నిష్పత్తిని, 2026-27 నాటికి 55.6 శాతంకి తగ్గించాలని లక్ష్యంగా పెట్టుకున్నారు. 2026 మార్చి నాటికి అప్పులు రూ. 7.46 లక్షల కోట్లకు చేరవచ్చని అంచనా వేశారు. 2026-27 బడ్జెట్లో గ్రాస్ మార్కెట్ బోరోయింగ్ (మొత్తం అప్పులు) సుమారు రూ. 17.2 లక్షల కోట్లుగా అంచనా వేశారు.

అంతర్జాతీయ ద్రవ్యనిధి తాజా గణాంకాల ప్రకారం ప్రపంచ దేశాల మొత్తం అప్పు 2025 నాటికి 110.9 ట్రిలియన్ డాలర్లకు చేరుకుంది. అత్యధిక అప్పులు ఉన్న దేశాలజాబితాలో అమెరికా తొలిస్థానంలో ఉండగా, భారతదేశం 3.36 ట్రిలియన్ డాలర్లతో ఏడవ స్థానంలో ఉంది. ప్రభుత్వం తన రుణ నిష్పత్తిని 56.1 శాతం నుండి 55.6 శాతానికి తగ్గించాలని లక్ష్యంగా పెట్టుకుంది.

ప్రపంచంలోనే అత్యధిక ప్రభుత్వ అప్పులు ఉన్న దేశంగా అగ్రరాజ్యం అమెరికా తొలి స్థానంలో నిలిచింది. అమెరికా మొత్తం అప్పు 38.27 ట్రిలియన్ డాలర్లుగా ఉంది. ఇది ప్రపంచ మొత్తం అప్పులో మూడో వంతు కంటే ఎక్కువ కావడం గమనార్హం. నిరంతర బడ్జెట్ లోటు, పెరుగుతున్న వడ్డీ చెల్లింపులే ఇందుకు ప్రధాన కారణమని ఐఎంఎఫ్ పేర్కొంది.

ప్రపంచంలోనే రెండో అతిపెద్ద ఆర్థిక వ్యవస్థ కలిగిన చైనా ఈ విషయంలో రెండో స్థానంలో నిలిచింది. ఈ దేశం 18.68 ట్రిలియన్ డాలర్ల అప్పుల ఊబిలో ఉంది. చైనా అప్పులు 2025లో 13.6 శాతం వృద్ధితో అత్యంత వేగంగా పెరుగుతున్నట్లు ఐఎంఎఫ్ నివేదిక పేర్కొంది. రుణాల ఊబి జాబితాలో జపాన్ కూడా ఉంది. ఈ దేశం 9.83 ట్రిలియన్ డాలర్ల అప్పుతో 3వ స్థానంలో నిలిచింది. జపాన్ అప్పు దాని జీడీపీలో దాదాపు 230 శాతంగా ఉండటం ఆ దేశ ఆర్థిక పరిస్థితికి అద్దం పడుతోంది. ఇక యూరప్ దేశాల్లోని యునైటెడ్ కింగ్డమ్ 4.09 ట్రిలియన్ డాలర్లతో 4వ స్థానం, ఫ్రాన్స్ 3.92 ట్రిలియన్ డాలర్లతో 5వ స్థానం, ఇటలీ 3.48 ట్రిలియన్ డాలర్లతో 6వ స్థానంలో నిలిచాయి. ఆయా దేశాల్లో సామాజిక సంక్షేమం, పింఛన్ల కోసం కోసం ఇబ్బడి ముబ్బడిగా ఖర్చు చేయడం వల్లే ఈ పరిస్థితి తలెత్తిందని ఐఎంఎఫ్ నివేదికలో పేర్కొంది. అన్ని దేశాల మాదిరిగానే భారత్ కూడా అప్పులు ఇబ్బడి ముబ్బడిగా తీసుకుంటోంది. అత్యధిక అప్పులు ఉన్న దేశాల జాబితాలో భారతదేశం 3.36 ట్రిలియన్ డాలర్లతో 7వ స్థానంలో నిలిచింది. భారత్ వేగంగా అభివృద్ధి చెందుతున్న ఆర్థిక వ్యవస్థ. దీంతో అభివృద్ధి పనుల కోసం చేసే ఈ అప్పు సాధారణమేనని ఆర్థిక నిపుణులు విశ్లేషిస్తున్నారు. అయితే, కేంద్ర బడ్జెట్లో ప్రభుత్వం ఒక సానుకూల లక్ష్యాన్ని నిర్దేశించుకుంది. దేశ అప్పుల నిష్పత్తిని జీడీపీలో 56.1 శాతం నుండి 55.6 శాతానికి తగ్గించాలని ప్రభుత్వం నిర్ణయించింది. ఇండియా తర్వాత స్థానాల్లో జర్మనీ 3.23 ట్రిలియన్ డాలర్లు, కెనడా 2.60 ట్రి.డా, బ్రెజిల్ 2.06 ట్రిలియన్ డాలర్ల అప్పులతో టాప్ 10 జాబితాలో నిలిచాయి. జర్మనీ ఆర్థిక క్రమశిక్షణ మారుపేరు. అయినప్పటికీ ఇంధన ఖర్చులు తదితర కారణాలతో అప్పులపాలైంది. కెనడా, బ్రెజిల్..బడ్జెట్ లోటు, ప్రాంతీయ రుణాల కారణంగా అప్పుల ఊబిలో చిక్కుకున్నాయి.

**- ఇస్కా రాజేష్ బాబు**
93973 99298

# చట్ట సభలంటే వైసీపీకి చులకనా?



ప్రజా సమస్యలను శాసనసభలో ప్రస్తావించి సమర్థవంతమైన పరిష్కార మార్గాలను వెతకడమన్నది ప్రజాస్వామ్యంలో ఎంతో కీలకమైన ప్రక్రియ. కానీ రాష్ట్రంలో ప్రతిపక్ష వైసీపీకి ఇది అర్థమైనట్టు లేదు. ఆ పార్టీ నాయకులు శాసనసభల పట్ల నిర్లక్ష్య ధోరణిని ప్రదర్శిస్తున్నారు. బడ్జెట్ సమావేశాలను బహిష్కరించి, బయట మీడియా ముందు మాత్రం అడ్డగోలుగా మాట్లాడారు. అనేక ప్రజా సమస్యలతో పాటు తిరుపతి లడ్డు వ్యవహారం తదితర అంశాలపైన శాసనసభలో చర్చ జరిగే వేళ ప్రతిపక్షం ఇలా ప్రవర్తించడం ఎంతో బాధ్యతా రహితం. శాసనసభలో అధికారికంగా చెప్పే అవకాశం ఉన్నప్పుడు, బయట ఎన్ని చిలుక పలుకులు పలికినా అవన్నీ 'ఆఫ్ ది రికార్డు'గానే మిగిలిపోతాయి.

ప్రతిపక్ష హోదా అంశంతో శాసనసభనే బాయ్ కాట్ చేసిన వైసీపీకి రాజ్యాంగ నిబంధనలపై అవగాహనలోపం స్పష్టంగా కనిపిస్తున్నది. అసెంబ్లీలో ప్రతిపక్షానికి తగిన సంఖ్యాబలం లేకపోయినా ప్రతిపక్ష హోదాతో గుర్తింపు ఇవ్వాలని వైసీపీ డిమాండ్ చేయడం విడ్డూరంగా ఉంది. సభా నియమావళి ప్రకారం నిర్ణయం తీసుకుంటామని స్పీకర్ ఇప్పటికే పలుమార్లు చెప్పినప్పటికీ తాను పట్టిన కుందేలుకు మూడే కాళ్ళు అన్నట్టుగా వైసీపీ ప్రవర్తిస్తూ చట్ట సభలను అవహేళన చేస్తోంది. ప్రజలు ఎన్నికలలో తమ ప్రతినిధిగా ఎన్నుకుని చట్ట సభలకు పంపేది,అక్కడ తమ వాణిని వినిపించి తమ సమస్యల పరిష్కారానికి పాటుపడతారని.అంటే ఒక నియోజకవర్గం లోని సమస్యలు పరిష్కరించబడాలంటే ఆ నియోజకవర్గ ప్రతినిధి తప్పనిసరిగా సభకు హాజరు కావాలి. ఆలా హాజరు కావడం లేదంటే తన్ను ఎన్నుకున్న ప్రజలకు ద్రోహం చేసినట్లే.అందుకే చట్టసభ సభ్యులు ఎవరైనా ఆకస్మికంగా మరణించినా ఆరు నెలల లోపుగా ఎన్నికలు నిర్వహిస్తారు.అంటే ఆరు నెలలకు మించి ఆ స్థానం ఖాళీగా ఉండ కూడదు.ఇటీవలి కాలంలో అధికారంలో ఉన్నంత కాలం సభలో కొనసాగుతూ,అధికారం పోతే తమ అహంతో సభను బహిష్కరించి వెళ్లిపోవడం జరుగుతుంది.గత శాసనసభలో చంద్రబాబును వైఎస్ఆర్సీపీ సభ్యులు ప్రతినిత్యం అవహేళన చేస్తూ, నిందిస్తూ, వ్యక్తిగత దూషణలకు పాల్పడడంతో ఒకరోజు ఆయన విలపిస్తూ ఇది కౌరవసభ, ఈ సభకు ఇక రాను, తిరిగి ముఖ్యమంత్రిగానే సభలో అడుగుపెడతాను అంటూ సభను వీడి, అన్న మాట ప్రకారం తన



ప్రతిజ్ఞ నెరవేర్చుకునే తిరిగి ముఖ్యమంత్రిగా సభలో అడుగు పెట్టారు. మరి అప్పుడు ఆయన జీత భత్యాలు తీసుకున్నారో, లేదో తెలీదు. ఆయన ఆరోజు ఆ విధంగా సభను విడడానికి బలమైన కారణం ఉంది. ఆయన సభా సాంప్రదాయం తెలిసిన వ్యక్తి. అంత తేలిగ్గా దూషణలకు చలించే వ్యక్తి కాదు. ప్రధానంగా తన వాణిని సభలో వినిపించే అవకాశం ఇవ్వకపోవడం వల్లనే తప్పని స్థితిలోఎంతో బాధతో ఆయన సభని వీడారు. పైగా గత సభలో ప్రతిపక్ష సభ్యులు ప్రజా సమస్యలపై గళమెత్తిన ప్రతిసారీ వైఎస్ఆర్సీపీ సభ్యులు వారిని గేలి చేస్తూ వ్యక్తిగతంగా దూషిస్తూ చర్చను పక్కదారి పట్టించడం నిత్య కృత్యమై పోయింది. దానిని సిఎం జగన్ కూడా వెకిలిగా నవ్వుతూ ఎంకరేజ్ చేస్తూ సభా సమయం వృధా కావడంలో తనవంతు పాత్ర పోషించారు. ఇక ఇప్పుడు వైఎస్ఆర్సీపీని ప్రజలు అత్యంత అవమానకర రీతిలో ఓడించి కేవలం 11 సీట్లకు పరిమితం చేసి ప్రతిపక్ష హోదా కూడా దక్కకుండా చేశారు. జగన్ దీనిపై ఆత్మ విమర్శ చేసుకోకుండా ప్రజలు తనను మోసం చేశారని ఒకసారి, ఇవిఎంలను టాంపర్ చేశారని మరోసారి నిందిస్తున్నారు. ప్రజల తీర్పును అర్థం చేసుకోకుండా ఇదే రీతిన వ్యవహరిస్తే ఈ పార్టీ మనుగడ కష్టమౌతుంది.పైగా కూటమి ప్రభుత్వం ఏర్పడిన మరుక్షణం నుండి 2029 ఎన్నికల్లో మనదే గెలుపు, టీడీపీకి సింగిల్ డిజిట్ సీట్లే వస్తాయి అంటూ చిత్త చాంచల్యపు మాటలు మాట్లాడుతున్నారు. సభకు హాజరు కాబోనంటూ పరోక్షంగా సంకేతాలిస్తున్నారు. సభలో జరిగే అర్థవంతమైన చర్చల్లో పాల్గొనడు. సభలో ప్రమాణ స్వీకారానికి హాజరైన జగన్‌ను అధికార పక్షం గౌరవంగానే చూసింది. గతంలో చంద్రబాబును తొలి సమావేశంలో వైఎస్ఆర్సీపీ సభ్యులు చాలా గేలి చేసారు.అయినా బాబు గారు నవ్వుతూ తిప్పికొట్టారు.జగన్ తనకున్న అహంభావంతో సాధారణ సభ్యుడిగా సభలో కుర్చోలేకున్నారు అందుకే ప్రమాణం పూర్తయిన వెంటనే సభను విడి వెళ్ళిపోయారు. అధికారంలో ఉంటే సభలో ఉంటారు..ప్రజల్లోకి వెళ్ళరు.అధికారం లేకుంటే సభలో ఉండలేరు, ఓదార్పు యాత్ర అంటూ ప్రజల్లోకి వెళ్తారు. అయినా ప్రజలు పీడపోయిందంటూ సంతోషంగానే ఉన్నారు. వారికి ఎవరి ఓదార్పు అవసరం లేదు. ఓదార్పు కావలసింది ఈయనకే. స్వంత నియోజకవర్గం పులివెందులకు వెళ్తే నాయకులు మొహం చాటేశారు. కార్యకర్తలు తిరగబడ్డారు.ఇప్పటికైనా జగన్ మారి బుద్ధిగా సభకు హాజరై అర్థవంతమైన చర్చల్లో పాల్గొని ప్రజల మనసుల్ని గెలవడం మంచిది. కేవలం ఇద్దరు సభ్యులతో భాజపా సభలో పోరాడి ఆ తర్వాతి ఎన్నికల్లో వందకు పైగా సీట్లు సాధించింది. కనుక ఉన్న కొద్దిపాటి సభ్యులను నిలుపుకొని ప్రభుత్వాన్ని నిలదీస్తూ ప్రతిపక్ష పాత్ర సక్రమంగా పోషిస్తూ ప్రజలిచ్చిన తీర్పుని సరిగా అర్థం చేసుకుని తన పాత్రకు న్యాయం చేయాలి. అలా కాదని అహంభావంతో సభను బహిష్కరిస్తే, ప్రజా తీర్పును వమ్ము చేసినందుకు 6 నెలల్లో ఆయన సభ్యత్వాన్ని రద్దు చేసి,పులివెందులలో తిరిగి ఎన్నికలు నిర్వహించి రాజ్యాంగ స్ఫూర్తిని కాపాడాల్సిన బాధ్యత ప్రభుత్వంపై ఉన్నది. అదే విధంగా ప్రజల తీర్పుని కాలరాసి సభకు హాజరు కాని ఆయనను తదుపరి ఎన్నికలో అక్కడి నుంచి పోటీ చేయకుండా అనర్హుడిని చేయాలి. గతంలో చంద్రబాబుకు ఈ విధంగా చేయలేదని అనేవారికి ఒక్కటే సమాధానం ఆ సభలో చంద్రబాబు గొంతు నొక్కేశారు. ఈ సభలో ఆ విధంగా జరగలేదు. ఒకవేళ జరిగితే జగన్ కూడా ప్రజల్లోకి వెళ్ళవచ్చు. అయినా సభా మర్యాదను ఏ మాత్రం పాటించని జగన్‌లో మనం మార్పును ఆశించలేం.

ప్రభుత్వం తరుపున జరిగే అధికారిక కార్యక్రమాలకు జగన్‌ను ఆహ్వానిస్తున్నప్పటికీ ఆయన ఏ ఒక్క కార్యక్రమానికి హాజరు కాలేదు. ప్రజలు ఏమనుకుంటారనే వెరపు కూడా లేదు.కనీస మర్యాద పాటించడు. అసూయతోనూ, ప్రతీకారేఛ్ఛతోనూ నిత్యం రగిలిపోతుంటాడు. భవిష్యత్తులో ఈ సంప్రదాయం కొనసాగకుండా ఉండాలంటే తప్పకుండా శాసన సభ సభ్యత్వాన్ని రద్దు చేసి సకాలంలో ఎన్నికలు నిర్వహించాలి. అప్పుడే ఈ పెడ ధోరణిని అరికట్టగలుగుతాం.

**- వాసంశెట్టి సుభాష్**
కార్మికశాఖమంత్రి
ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వం

## కళ్ళం గాలయ్య గారి మృతికి నివాళులర్పించిన మాజి ఎమ్మెల్యే అన్నా



మార్కాపురం ఫిబ్రవరి 14 (మనం న్యూస్): మార్కాపురం జిల్లా కొనకనమిట్ల మండలం చౌటపల్లి గ్రామం నందు కళ్ళం గాలయ్య(78) మృతి చెందగా విషయం తెలుసుకున్న గిద్దలూరు మాజి శాసనసభ్యులు,మార్కాపురం నియోజకవర్గ వైఎస్సార్సీపీ ఇంచార్జి అన్నా రాంబాబు గాలయ్య గారి పార్థీవదేహానికి పూలమాల వేసి నివాళులర్పించారు.

# బీసీలకే సింహభాగం

- బడ్జెట్ కేటాయింపుల్లో మంత్రి సవిత
- సీఎం చంద్రబాబుకు ధన్యవాదాలు




అమరావతి,ఫిబ్రవరి,14,మనం న్యూస్ : బీసీల అభ్యున్నతి పట్ల కూటమి ప్రభుత్వానికి ఉన్న చిత్తశుద్ధి మరోసారి రుజువైందని, ఆర్థిక మంత్రి పయ్యావుల కేశవ్ ప్రవేశ పెట్టిన బడ్జెట్ లో వెనుకబడిన వర్గాల సంక్షేమానికి చరిత్రలో కనీవినీ ఎరుగని కేటాయింపులు చేశారని రాష్ట్ర బీసీ, ఈడబ్ల్యూఎస్ సంక్షేమ, చేనేత మరియు జౌళి శాఖ మంత్రి ఎస్.సవిత ఆనందం వ్యక్తంచేశారు. మూడు కూటమి ప్రభుత్వం వచ్చిన తరవాత ప్రవేశ పెట్టిన మూడు బడ్జెట్లోనూ నిధుల కేటాయింపులు పెంచుకుంటూ వెళుతున్నా మన్నారు. నూతన బడ్జెట్ లో ఆదరణ 3.0 పథకానికి మరో రూ.1000 కోట్లు కేటాయించడంపై హర్షం వ్యక్తంచేశారు. 2026-27 బడ్జెట్ లో రూ.51,021 కోట్లు బీసీ సంక్షేమానికి కేటాయించినందుకు సీఎం చంద్రబాబుకు, మంత్రి పయ్యావులకు ధన్యవాదాలు తెలియజేశారు. ఈ మేరకు శనివారం అసెంబ్లీ మీడియా పాయింట్ వద్ద ఆమె మాట్లాడారు. 2026-27 బడ్జెట్ అన్ని వర్గాల వారికి అనుకూలమైనదన్నారు. ముఖ్యంగా బీసీల ఉన్నతికి బడ్జెట్ లో ప్రాధాన్యత ఇచ్చారన్నారు. 2024-25 బడ్జెట్ లో రూ.39,007 కోట్లు, 2025-26 బడ్జెట్ 47,456 కోట్లు, 2026-27 బడ్జెట్లో 51,021 కోట్లు కేటాయిం చారన్నారు. అందులో ఈడబ్ల్యూఎస్ సంక్షేమానికి రూ.10,669 కోట్లు వెచ్చిస్తున్నామన్నారు. 2025-26లో రూ.10,614 కోట్లు, 2024- 25లో రూ.10,273.80కోట్లు కేటాయి ంచామన్నారు. నూతన బడ్జెట్లోనూ ఆదరణ 3.0 పథకానికి మరో రూ.1000 కోట్లు, చేనేతలకు, సెల్యూన్లకు ఉచిత విద్యుత్ కోసం రూ.150 కోట్లు, రూ.50 కోట్లు వెచ్చిస్తున్నామన్నారు. ఇలా ఏటా బీసీ సంక్షేమానికి నిధులు కూటమి ప్రభుత్వం కేటాయింపులు పెంచుతూ వస్తోందన్నారు. చరిత్రలో ఎరుగని విధంగా, సింహభాగం నిధులు బీసీల సంక్షేమానికి కేటాయించామన్నారు. ఉమ్మడి ఆంధ్రప్రదేశ్ లోనూ ఇటువంటి కేటాయింపులు చేయలేదన్నారు. రాయలసీమ ను గ్లోబల్ హార్టీ కల్చర్ గా అభివృద్ధి చేయడానికి కూటమి ప్రభుత్వం రూ.30 వేల కోట్లు కేటాయిస్తోం దన్నారు. అన్ని వర్గాల ప్రజలకు మేలు చేకూరేలా బడ్జెట్ ను రూపకల్పన చేశామన్నారు. వ్యవసాయానికి, పారిశ్రామిక రంగానికి కూడా ప్రాధాన్యమిస్తూ బడ్జెట్ లో నిధులు కేటాయించామన్నారు, బీసీల పట్ల కూటమి ప్రభుత్వానికి, సీఎం చంద్రబాబుకు ఉన్న చిత్తశుద్ధికి నిదర్శనమన్నారు. సీఎం చంద్రబాబుకు, ఆర్థిక మంత్రి పయ్యావులకు మంత్రి సవితకు ఆ ప్రకటనలో ధన్యవాదాలు తెలియజేశారు.



## ఎట్టకేలకు ఉచిత దర్శనానికి లైన్ క్లియర్

- ప్రకటన చేసిన ఆలయ ఇ.ఓ



పొదిలి ఫిబ్రవరి 14 (మనం న్యూస్): మార్కాపురం జిల్లా పొదిలి నిర్మమహేశ్వరస్వామి బ్రహ్మోత్సవాల సందర్భంగా స్వామివారి ఉచిత దర్శనం లేకపోవడంతో భక్తుల అసహనం వ్యక్తం చేశారు.ఇదిగమనించిన పాలక వర్గం,అధికారులు స్పందించి సామాన్య భక్తులకు ఉచిత దర్శనం,శీఘ్ర దర్శనం ఏర్పాటు చేస్తున్నట్లు ప్రకటన చేశారు.శ్రీఘ్ర దర్శనం రూ 100 నిర్ణయించగా సామాన్య భక్తులకు ఉచిత దర్శనం, అభిషేకాలకు రూ 200, ఉదయం ఆరుగంటలలోపు మాత్రమేనని తెలియజేశారు. అధికార్లు ఉచిత దర్శనం ప్రకటన చేయడంతో సామాన్య భక్తులు సంతోషం వ్యక్తం చేస్తున్నారు.గతంలో ఉచిత దర్శనానికి రూ 10 లు వసూలు చేశారు, ఈ సంవత్సరం పూర్తిగా ఉచితంగా ప్రకటించారు.అధికారుల ప్రకటన సామాన్యులకు కొంత ఉరటనిచ్చిందని చెప్పవచ్చు.

# ఎస్టేట్‌వై జంక్షన్ బోడుపాడు కాలువ అనుకొని అక్రమణల పర్వం

- దేవాలయాల పేరుతో అక్రమన, ఆపై పక్కనే కొంత ప్రభుత్వ స్థలంలో వెంచర్
- గతంలో షెడ్డు వేసుకొని ఒక వ్యక్తి జీవనం సాగిస్తుండగా తొలగించిన అధికారులు




మార్కాపురం ఫిబ్రవరి 14 (మనం న్యూస్): మార్కాపురం జిల్లా కేంద్రంలో రోజురోజుకు ఆక్రమణలు అధికంగా కనిపిస్తున్నాయి. పట్టణ పరిధిలోని వై జంక్షన్ నందు కట్టా కదుర్గమ్మ దేవాలయం పేరుతో లక్షల రూపాయల ప్రభుత్వ స్థలాన్ని కబ్జా చేసి స్వాధీనం చేసుకున్న సంఘటన చోటుచేసుకుం ది. అందుకు సంబంధించిన అధికారులు కన్నెత్తి చూడకపోవడంపై పలువురు పట్టణ ప్రజలు విమర్శిస్తున్నారు. వై జంక్షన్ నందు గతంలో ఒక వ్యక్తి చిన్న రేకుల షెడ్డు వేసుకొని జీవనం కొనసాగిస్తుండగా అధికారులు వాటిని తొలగించి సంఘటన మనకు తెలిసిందే.. ఇప్పుడు కొంతమంది రోడ్డుకు ఇరువైపులా షెడ్లు వేసుకొని, వెంచర్లు వేసుకొని, దేవాలయాల పేరుతో ఆక్రమణలు కొనసాగిస్తున్నప్పటికీ అధికారులు ఎందుకు మౌనవమోహిస్తున్నారని ప్రజలు ప్రశ్నిస్తున్నారు. ఇప్పటికైనా ఉన్నతాధికారులు లక్షలు విలువ చేసే ప్రభుత్వ స్థలాన్ని అక్రమార్కుల నుండి స్వాధీనం చేసుకోవాలని ప్రజలుకోరుతున్నారు...

## గుండ్ల బ్రహ్మేశ్వరానికి వెళ్లే భక్తులకు ప్రత్యేక అనుమతులు



గిద్దలూరు ఫిబ్రవరి 14 (మనం న్యూస్): మార్కాపురం జిల్లా: గిద్దలూరు ఎమ్మెల్యే ముత్తుముల అశోక్ రెడ్డి ఇటీవల అసెంబ్లీలో మంత్రి పవన్ కళ్యాణ్ ని కలిసి, మహాశివరాత్రి సందర్భంగా గిద్దలూరు మండలం,దిగువమెట్ట పరిధిలోని నల్లమల అటవీ ప్రాంతం లో ఉన్న గుండ్ల బ్రహ్మేశ్వర స్వామి ఆలయం కు భక్తులు వెళ్లేందుకు ప్రత్యేక అనుమతులు ఇవ్వాలని విజ్ఞప్తి చేశారు. డిప్యూటీ సీఎం వెంటనే సానుకూలంగా స్పందించి అధికారులకు ఆదేశాలు జారీ చేయగా, అటవీ శాఖ అధికారులు మహాశివరాత్రి పండుగ సందర్భంగా శనివారం, ఆదివారం రెండు రోజుల పాటు ఆలయానికి వెళ్లేందుకు ప్రత్యేక అనుమతులు మంజూరు చేశారు. అటవీ శాఖ నిబంధనల మేరకు వాహనాల్లో కూడా ఆలయానికి వెళ్లవచ్చని స్పష్టం చేశారు.అదేవిధంగా అడవిలోని వన్యప్రాణులకు హాని కలిగించే ప్లాస్టిక్ కవర్లు మరియు ప్లాస్టిక్ సంబంధిత వస్తువులు తీసుకువెళ్లరాదని, అటవీ ప్రాంతానికి నష్టం కలిగించే ఏ వస్తువులనూ తీసుకురావద్దని అధికారులు జారీ చేసిన ఉత్తర్వుల్లో పేర్కొన్నారు.కాబట్టి ప్రజలు అటవీ శాఖ నియమ నిబంధనలను పాటిస్తూ గుండ్ల బ్రహ్మేశ్వర స్వామి ఆలయానికి దర్శనార్థం వెళ్లవచ్చని ఎమ్మెల్యే అశోక్ రెడ్డి తెలిపారు.

## పుల్వామా అమర వీరులకి నివాళి



- దేశాన్నికదిలించిన పుల్వామా దాడి మరువలేని రోజు
- మాజీ ఏమ్మెల్యే , నెల్లూరు జిల్లా పార్లమెంటరీ పరిశీలకులు జంకే వెంకటరెడ్డి

మార్కాపురం ఫిబ్రవరి 14 (మనం న్యూస్): 2019 ఫిబ్రవరి 14 - దేశ చరిత్రలో మరిచిపోలేని విషాద రోజు. జమ్మూ కాశ్మీర్లోని పుల్వామా జిల్లాలో సీఆర్పీఎఫ్ దళాల కాన్వాయ్పై జరిగిన ఆత్మాహుతి దాడిలో 40 మంది జవాన్లు వీరమరణం పొందారు.ఈ ఘటన అనంతరం దేశవ్యాప్తంగా అమర వీరులకు ఘన నివాళులు అర్పించారు. ప్రజలు కొవ్వొత్తుల ర్యాలీలు నిర్వహించి సైనికుల త్యాగాన్ని స్మరించుకున్నారు. వీరుల త్యాగం వల్లే మనకు ఈరోజు భద్రత.వారి సేవలకు దేశం ఎప్పటికీ ఋణపడి ఉంటుంది అని మాజీ ఏమ్మెల్యే , నెల్లూరు జిల్లా పార్లమెంటరీ పరిశీలకులు జంకే వెంకటరెడ్డి అన్నారు.

## ప్రజా సమస్యల పరిష్కారానికి కృషి



- తెదేపా ఇంచార్జ్ పొత్తూరి రామరాజు

నరసాపురం, ఫిబ్రవరి 14 (మనం న్యూస్) : ప్రజా సమస్యల పరిష్కారానికి ఎన్డీఏ కూటమి ప్రభుత్వం కట్టుబడి ఉందని తమ ప్రభుత్వం చేపట్టిన సూపర్ సిక్స్ పథకం సూపర్ హిట్ అయిందని నరసాపురం నియోజక వర్గ తెలుగుదేశం పార్టీ ఇన్చార్జ్ పొత్తూరి రామరాజు అన్నారు. శనివారం స్థానిక నాలుగవ వార్డులో వార్డు అధ్యక్షుడు మోకా ఏడుకొండలు ఆధ్వర్యంలో నిర్వహించిన కార్యకర్తల ఆత్మీయ సమావేశంలో పొత్తూరి రామరాజు ముఖ్యఅతిథిగా పాల్గొని వార్డులో నెలకొన్న ప్రధాన సమస్యలపై చర్చించారు. ముఖ్యంగా త్రాగునీరు, డ్రైనేజీలు, రోడ్ల అభివృద్ధి, పారిశుధ్యం, వీధి దీపాలు తదితర అంశాలపై స్థానిక ప్రజలు ఎదుర్కొంటున్న ఇబ్బందులను కార్యకర్తలు రామరాజుకు వివరించగా ప్రజల సమస్యల పరిష్కారానికి కృషి చేస్తామని ఆయన హామీ ఇచ్చారు. పట్టణంలోని ప్రతి వార్డులోనూ ప్రజలతో నేరుగా మమేకమై వారి సమస్యలను గుర్తించి వాటిని సంబంధిత అధికారుల దృష్టికి తీసుకెళ్లి పరిష్కారం సాధించే దిశగా కృషి చేస్తామని ఈ సందర్భంగా రామరాజు పేర్కొన్నారు. కార్యకర్తలు పార్టీ బలోపేతానికి సమన్వయం తో పనిచేయాలని ఆయన పిలుపునిచ్చారు. ఈ కార్యక్రమంలో ఏఎంసీ చైర్మన్ జక్కం శ్రీమన్నారాయణ, పాలకొల్లు నియోజవర్గ ఏఎంసీ చైర్మన్, కోడి విజయ భాస్కరరావు, పార్టీ సీనియర్ నాయకులు కొవ్వాడ రవీంద్ర నాథ్ ఠాగూర్, తుమ్మలపల్లి లక్ష్మీనారాయణ, షేక్ హుసేన్, పెంద్ర శ్రీనివాస్, పొన్నాల నాగబాబు, కొవ్వాడి నరేష్, బర్రె మురళి, నాగిడి రాంబాబు, తిరుమాని శశిదేవి, బోరా చిన్నయమ్మ, బస్వాని నాగమణి, బొమ్మిడి అప్పా రావు, పట్నాల జగన్, బుంగ రమేష్ పాల్గొన్నారు.

### చలో విజయవాడ కార్యక్రమాన్ని జయప్రదం చేయండి

## ఐక్య ఉపాధ్యాయ ఫెడరేషన్ పిలుపు




మార్కాపురం ఫిబ్రవరి 14 (మనం న్యూస్): ఆంధ్రప్రదేశ్ ఐక్య ఉపాధ్యాయ ఫెడరేషన్ పెద్దారవీడు మండల శాఖ కార్యవర్గ సమావేశం శనివారం ఉదయం స్థానిక యుటిఎఫ్ కార్యాలయం నందు బి చెన్నారెడ్డి అధ్యక్షతన జరిగింది. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథులుగా విచ్చేసిన జిల్లా ప్రధాన కార్యదర్శి ఓవి వీరారెడ్డి మాట్లాడుతూ దీర్ఘకాలంగా అపరిష్కృతంగా ఉన్న ఉద్యోగ ఉపాధ్యాయ ల సమస్యలను వెంటనే పరిష్కరించాలని డిమాండ్ చేశారు. పి అర్ సి కమిటీని నియమించాలని ఉద్యోగుల ఉపాధ్యాయులకు చెల్లించవలసిన ఆర్థిక బకాయిలను వెంటనే విడుదల చేయాలని సిపిఎస్ విధానాన్ని రద్దు చేయాలని పెండింగ్ డీఏలను మంజూరు చేయాలని ఐఖ ప్రకటించాలని ఈనెల 17న రాష్ట్ర సంఘం తలపెట్టిన చలో విజయవాడ కార్యక్రమాన్ని ఎక్కువమంది సభ్యులు పాల్గొని జయప్రదం చేయాలని కోరారు. జిల్లా కోశాధికారి అయిన బి శ్రీరాములు మాట్లాడుతూ కోవిడ్ అనంతరం పాఠశాలల్లో విద్యార్థుల సంఖ్య అలాగే ఉపాధ్యాయుల సంఖ్య గణనీయంగా తగ్గిపోతుంది అని ప్రభుత్వ బడిన కాపాడుకోవాలంటే ఉపాధ్యాయులందరూ గ్రామస్తులతో కలిసి విద్యార్థుల నమోదు పెంచాలని లేకపోతే బడులు మూతపడతాయని తెలియజేశారు. జిల్లా కార్యదర్శి పాపయ్య మాట్లాడుతూ యుటీఎఫ్ చేపట్టిన ఎన్విరాన్మెంట్ డ్రైవ్ కార్యక్రమాన్ని అన్ని గ్రామాలలో జయప్రదం చేయాలని కోరారు. యుటిఎఫ్ జిల్లా ఆడిట్ కన్వీనర్ పి ప్రభాకర్ మాట్లాడుతూ పెద్దారవీడు మండలంలో పిఎఫ్ ఇఇజూజీ ఎలాంటి సమస్యలు లేవని అలాంటి సమస్యలు ఎవరికైనా ఉంటే లిఖితపూర్వకంగా రాసిస్తే వెంటనే ఆ సమస్యల పరిష్కారానికి మండల శాఖ కృషి చేస్తుందని తెలియజేశారు. మరో జిల్లా కార్యదర్శి పి వెంకటేశ్వర్లు మాట్లాడుతూ సంఘ నిర్మాణం పటిష్టంగా ఉండాలని బాధ్యతలను పంచుకొని సంఘాన్ని అభివృద్ధి చేయాలని జిల్లా ఏర్పాటు నందు వలన పోటీ తత్వం ఎక్కువగా ఉంటుందని ఉపాధ్యాయుల సమస్యలు ఎప్పటికప్పుడు పరిష్కారం చేయాలని కోరారు. మండల శాఖ ప్రధాన కార్యదర్శి ఆర్ పి బి శ్రీనివాసులు మాట్లాడుతూ మండలంలో తమకు వచ్చిన సమస్యలన్నీ ఎప్పటికప్పుడు పరిష్కారం చేస్తున్నామని తమ నివేదికలో తెలియజేశారు. అలాగే ఉపాధ్యాయుల సమస్యల కోసం పోస్ట్ కార్డు ఉద్యమంలో భాగంగా ప్రతి ఒక్కరూ పోస్ట్ కార్డులను ముఖ్యమంత్రి గారికి చేరవేయాలని తెలియజేశారు. ఈ కార్యక్రమంలో అల్లూరి శ్రీనివాసులు ఎస్ రజనీకాంత్ రావు ఎన్ వి శ్రీనివాస్ అయ్యా ఏ శేషరెడ్డి రెడ్డి జనవిజ్ఞాన వేదిక జిల్లా అధ్యక్షులు వెంకట్రావు టి సుబ్బారావు రవికుమార్ డిపి మస్తాన్ వి శ్రీనివాసులు రామాంజనేయులుపాల్గొన్నారు.

### మహాశివరాత్రి వేడుకలకు

## సర్వం సిద్ధం



త్రిపురాంతకం ఫిబ్రవరి 14 (మనం న్యూస్): మహాశివరాత్రి పర్వదినాన్ని పురస్కరించుకుని శ్రీ త్రిపురాంతకేశ్వర స్వామి, బాలత్రిపుర సుందరిదేవీ దేవస్థానంనకు తరలివచ్చే భక్తులకు సకల సౌకర్యాలు కల్పించామని, ఈ మేరకు అధికారులతో మాట్లాడి ఏర్పాట్లపై సమీక్షించిన టీడీపీ ఇంఛార్జ్ గూడూరి ఎరిక్షన్ బాబు ఇప్పటికే యర్రగొండపాలెం నుంచి త్రిపురాంతకం వరకు నూతన రహదారి నిర్మాణం పూర్తి చేసాము,కొండపైకి వెళ్లే భక్తులకు ఇబ్బందులు లేకుండా నూతన రోడ్డు. పదేళ్లుగా గతుకుల రోడ్డుతో భక్తుల ఇబ్బందులు. ప్రయాణ సౌకర్యాన్ని మెరుగుపరిచేలా నూతన రోడ్డు ఏర్పాటు చేయడం జరిగింది అని ,భక్తులకు తాగునీటి సౌకర్యం కల్పించేందుకు ప్రత్యేక ట్యాంకులు. ఏర్పాటు చేయడం జరిగింది అని,వృద్ధులు, మహిళలు, వికలాంగులకు ప్రత్యేక దర్శన ఏర్పాట్లు చేయాలని, భక్తులకు ఎలాంటి అసౌకర్యం కలగకుండా చర్యలు తీసుకోవాలని ఎరిక్షన్ బాబు స్పష్టమైన ఆదేశాలు ఇచ్చామని చెప్పారు.

# మెడికల్ మరియు ఫార్మా మాఫియాను అరికట్టాలి

- సీపీఐ ఆధ్వర్యంలో ర్యాలీ



(మార్కాపురం ఫిబ్రవరి 14 మనం న్యూస్): మెడికల్ మరియు ఫార్మా మాఫియాను అరికట్టాలని డిమాండ్ చేస్తూ సీపీఐ ఆధ్వర్యంలో శనివారం ఉదయం 11 గంటలకు మార్కాపురంలో ర్యాలీ నిర్వహించారు. సీపీఐ కార్యాలయం నుంచి ప్రారంభమైన ఈ ర్యాలీ సబ్ కలెక్టర్ కార్యాలయం వరకు సాగింది. అధికారులు కార్యాలయంలో లేకపోవడంతో నిరసనకారులు తమ డిమాండ్లతో కూడిన కరపత్రాన్ని కార్యాలయ గోడకు అంటించారు.ఈ సందర్భంగా సీపీఐ నియోజకవర్గ కార్యదర్శి షేక్ ఖాసిం మాట్లాడుతూ, ప్రజా ఆరోగ్యం ప్రభుత్వ బాధ్యత మాత్రమే కాకుండా రాజ్యాంగ హక్కు అని పేర్కొన్నారు.రాష్ట్రవ్యాప్తంగా మెడికల్ మరియు ఫార్మా మాఫియాపై పోరాటం చేయాలని సీపీఐ పిలుపునిచ్చిందని తెలిపారు.ఫార్మా పరిశ్రమలు మరియు కార్పొరేట్ ఆసుపత్రులు ప్రజలను నిరంతరం దోపిడీ చేస్తున్నాయని ఆయన ఆరోపించారు. నాసిరకం మందుల విక్రయం, జనరిక్ మందులపై అధిక ధరలు, అద్దె సర్టిఫికెట్లతో ఫార్మసిస్టులు లేకుండా మందుల విక్రయం వంటి అక్రమాలకు అడ్డుకట్ట వేయాలని డిమాండ్ చేశారు. ప్రైవేటు మరియు ప్రభుత్వ వైద్య సంస్థల్లో పేరుకుపోయిన అవినీతిని నిర్మూలించాలని, ముఖ్యంగా ప్రైవేటు వైద్య కళాశాలల్లో సుమారు రూ.300 కోట్లకు పైగా స్టైఫండ్ ఎగవేత జరిగిన అంశంపై సమగ్ర విచారణ జరిపించాలని కోరారు.అలాగే ఫార్మసీ, మెడికల్, డెంటల్, నర్సింగ్ మరియు పారామెడికల్ కౌన్సిళ్లలో ఉన్న అవినీతి పై కూడా చర్యలు తీసుకోవాలని ప్రభుత్వాన్ని కోరారు. మెడికల్ మాఫియాను అరికట్టి ప్రజలకు నాణ్యమైన ఆరోగ్య సేవలు, అందుబాటులో ధరలలో మందులు అందించేందుకు ప్రభుత్వం కట్టుబడి పనిచేయాలని విజ్ఞప్తి చేశారు.ఈ కార్యక్రమంలో ఆర్టీసీ రిటైర్డ్ ఉద్యోగి కేశవరావు, బీఎస్ఎన్ఎల్ రిటైర్డ్ ఉద్యోగి కృష్ణారావు, శంకర్రావు, బిల్డింగ్ వర్కర్స్ సీనియర్ నాయకులు శ్రీనివాసులు, పి. సుబ్బారెడ్డి, మల్లేశ్వరి, గురమ్మ పాల్గొన్నారు.

## అగ్నిప్రమాదంలో గుడిసె దగ్ధం

- రూ 20 వేల నగదు,మోటర్ బైక్,టి.వి అగ్నికి ఆహుతి



పొదిలి ఫిబ్రవరి 14 (మనం న్యూస్): మార్కాపురంజిల్లా పొదిలి పట్టణంలోని పిచ్చిరెడి తోట గురజాల నరేష్ కు చెందిన పూరి గుడిసె విద్యుత్ షార్ట్ సక్యూట్ కారణంగా దగ్ధం అయింది. ఒక్కసారిగా మంటలు ఎగసి పడటంతో ఇంట్లోవారు బయటకు వచ్చే ఆర్పే ప్రయత్నం చేసిన మంటలు అదుపులోకి రాలేదు.త్వరలో గుడిసెతొలగించి రేకులు వేసుకుందామని రూ 20 తెచ్చి పెట్టుకున్నారు అవి కుడా ఆగ్నికి ఆహుతి కావ డంతో తీవ్రంగా దుఖ్ఖిస్తున్నారు.ఇంట్లో వంట సామానులు, బట్టలు అన్ని మంటల్లో కాలిపొ వడంతో కట్టుబట్టలతో మిగిలారు.ప్రభుత్వం తక్షణమే ఆదుకొని తగిన నష్టపరిహారం చెల్లించాలని బాధితులు వేడుకొంటున్నారు.

# సంజీవయ్య స్ఫూర్తితో విద్యార్థులు ఎదగాలి

- జాయింట్ కలెక్టర్ శ్రీనివాసులు





మార్కాపురం ఫిబ్రవరి 14 (మనం న్యూస్): మాజీ ముఖ్యమంత్రి దామోదర సంజీవయ్య స్ఫూర్తితో విద్యార్థులు ఎదగాలని జాయింట్ కలెక్టర్ శ్రీనివాసులు విద్యార్థులకు సూచించారు. కలెక్టర్ కార్యాలయంలో ఆయన 105 వ జయంతి వేడుకలను ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా జేసీ మాట్లాడుతూ చిన్నప్పుడే తండ్రిని కోల్పోయినప్పటికీ పట్టుదలతో చదివి దేశంలోనే మొట్టమొదటి దళిత ముఖ్యమంత్రి అయ్యారని వివరించారు. బడుగు బలహీన వర్గాల కోసం కోసం ఆయన చేసిన కృషిని ఎప్పటికీ మరువలేమన్నారు. అదేవిధంగా కాపులకు ప్రత్యేక రిజర్వేషన్ కృషి చేసిన ఘనత కూడా ఆయన దేనని కొనియాడారు. విద్యార్థులుగా భవిష్యత్తును తీర్చిదిద్దు కావాల్సిన బాధ్యతలపై తల్లిదండ్రులపై కాకుండా మీ పైనే ఉందన్నారు. దళితులు అంటే కొన్నిచోట్ల ఇప్పటికి చిన్నచూపు ఉందన్నారు. ప్రభుత్వం కనిపిస్తున్న కల్పిస్తున్న అవకాశాలు, వసతులను విద్యార్థులు సద్వినియోగం చేసుకొని అన్ని రంగాల్లో రాణించాలని వారికి దిశా నిర్దేశం చేశారు. ఈ కార్యక్రమంలో జిల్లా మలేరియా అధికారి జిల్లా మలేరియా అధికారి జు రాహుల్, మార్కాపురం తహసీల్దార్ చిరంజీవి, పట్టణంలోని ఎస్సీ, ఎస్టీ విద్యార్థులు, సచివాలయ రెవెన్యూ సిబ్బంది పాల్గొన్నారు.

# కోతులు భావి స్థలంపై వాస్తవాలు తెలుసుకొని మాట్లాడాలి

- దేశాయ్ కుటుంబాన్ని విమర్శించడం మీకు సరికాదు..
- స్థలం కబ్జాపై కోనేరు నాగేంద్రప్రసాద్ స్పష్టత ఇవ్వాలి
- టిడిపి జిల్లా మాజీ ఉపాధ్యక్షులు మాధవరావు దేశాయ్...



**నందవరం ఫిబ్రవరి మనం న్యూస్ 14:** స్థలం కబ్జాపై కోనేరు నాగేంద్రప్రసాద్ స్పష్టత ఇవ్వాలని టిడిపి మాజీ జిల్లా ఉపాధ్యక్షులు మాధవ రావ్ దేశాయ్ కోరారు.ఆయన శనివారం విలేకరులతో మాట్లాడారు.ఎమ్మిగనూరు కోతుల బావి శ్రీ ఆంజనేయ స్వామి దేవాలయ స్థలం సర్వే (నంబర్ 321బి )కబ్జాకు గురైనట్లు మాజీ కౌన్సిలర్ కోనేరు వరప్రసాద్ మాట్లాడడం జరిగింది.ఆ స్థలాన్ని 2017 సంవత్సరంలో దేశయ్ కుటుంబీకులు కబ్జా చేశారని ఆయన మాట్లాడారని తెలిపారు. దేశాయి కుటుంబీకులు అన్నారు,ఎవరు ఆ దేశాయ్ లు? ఏ గ్రామానికి చెందిన వ్యక్తులు స్పష్టంగా ఆయన తెలపాలని కోరారు.జిల్లాలో చాలా గ్రామాలలో దేశయ్ లు ఉన్నారన్నారు.కాకపోతే వారు అందరూ ఒకే వర్గానికి చెందిన వ్యక్తులు కారు,ఆ ఊరి సాంప్రదాయాలు,పద్ధతులు ప్రకారం కొన్ని గ్రామాలలో కొంతమంది వ్యక్తులను దేశయలుగా

పిలుస్తున్నారని తెలిపారు.ఎమ్మిగనూరులో స్థలాన్ని అబ్జా చేసిన వ్యక్తులు ఎవరో వారి పేరు ఏమిటో బహిరంగంగా ఆయన మాట్లాడడానికి ఎందుకు భయపడుతున్నాడో అర్థం కావట్లేదని అన్నారు. ఆయన స్పష్టత లేని మాటలు మాట్లాడటం వలన మా మనోభావాలు దెబ్బతిన్నాయన్నారు.స్థల వివాదంపై నేను ఆయనను ప్రశ్నించడం లేదు. ఆ స్థలాన్ని దేశయ్ కుటుంబీకులు కబ్జా చేశారని అనటంపై ఆయనను ప్రశ్నిస్తున్నానని తెలిపారు.

ఆ ప్రదేశంలో మా తాతగారైన దేశయ్ కృష్ణమూర్తికి సర్వేనెంబర్ 321లో 376 స్క్వేర్ ఫీట్ స్థలం రికార్డుల ప్రకారం ఉందని తెలిపారు.వాటికి సంబంధించిన రికార్డులు మా దగ్గర ఉన్నాయని తెలిపారు.ఏ రోజు కూడా మా తాత గారికి చెందిన స్థలం కావాలని మా కుటుంబీకులు ఎవరు అక్కడకు వెళ్లలేదని తెలిపారు.దేవాలయాలకు మా ఆర్థిక సహాయాన్ని అందిస్తాము కానీ వ్యతిరేకంగా వెళ్లబోమని తెలిపారు.అక్కడ స్థలాన్ని నందవరం గ్రామానికి చెందిన దేశయ్ కుటుంబీకులు వదులుకున్నామన్నారు.స్పష్టత లేని కోనేరు మాటల వలన మా కుటుంబాలకు ఇబ్బంది కలిగిందని తెలిపారు.ఆ స్థలాన్ని కబ్జా చేసిన దేశయ్ కుటుంబీకుల పేరు,ఊరు స్పష్టంగా తెలపాలన్నారు.



# మంత్రాలయం నియోజకవర్గ అభివృద్ధికి సహకరించండి

**ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడును మర్యాదపూర్వకంగా కలిసిన టీడీపీ ఇన్చార్జ్ ఎన్. రాఘవేంద్ర రెడ్డి**

**మంత్రాలయం , ఫిబ్రవరి 14(మనం న్యూస్):** మంత్రాలయం నియోజకవర్గ అభివృద్ధికి సహకరించాలని మంత్రాలయం టీడీపీ ఇన్చార్జ్ ఎన్. రాఘవేంద్ర రెడ్డి ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు ను కోరారు. శనివారం తాడేపల్లి లోని ముఖ్యమంత్రి కార్యాలయంలో ఆయనను మర్యాదపూర్వకంగా కలిశారు.నియోజకవర్గంలో ఉన్న పలు సమస్యలను ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడుకు దృష్టికి తీసుకెళ్లారు. దీనికి ముఖ్యమంత్రి సానుకూలంగా స్పందిస్తూ మంత్రాలయం నియోజకవర్గ అభివృద్ధి నా బాధ్యత అని హామీ ఇచ్చినట్లు ఆయన తెలిపారు.



## మాజీ మంత్రి జోగీ రమేష్ ను పరామర్శించిన ఎమ్మెల్యే

**మంత్రాలయం ,ఫిబ్రవరి 14,మనం న్యూస్:** విజయవాడ ఇబ్రహీంపట్నం లోని మాజీ మంత్రి జోగీ రమేష్ ను, ఆయన కుటుంబ సభ్యులను అదే విధంగా అంబటి రాంబాబు కుటుంబ సభ్యులను మంత్రాలయం ఎమ్మెల్యే వై. బాలనాగిరెడ్డి శనివారం పరామర్శించారు. ఇటీవల జరిగిన ఘటనలకు సంబంధించి వివరాలు అడిగి తెలుసుకున్నారు. ధైర్యంగా ఉండాలని త్వరలోనే మంచి రోజులు వస్తాయని ధైర్యం చెప్పారు.

# శివరాత్రికి పటిష్ట బందోబస్తు

- 'ప్రజల రక్షణ కోసమే పోలీసులు
- 'ఎసై ఎన్సీ మల్లికార్జున

**తుగ్గలి, ఫిబ్రవరి 14(మనం న్యూస్):** శివరాత్రికి విచ్చేసే భక్తులకు ఎటువంటి అంతరాయం కలగకుండా పటిష్ట బందోబస్తు ఏర్పాటు చేస్తున్నట్లు జొన్నగిరి సబ్ ఇన్స్పెక్టర్ ఎన్సీ మల్లికార్జున అన్నారు. జిల్లా ఎస్పీ విక్రాంత్ పటేల్ ఆదేశాల మేరకు తుగ్గలి మండలం జొన్నగిరి పోలీస్ స్టేషన్ పరిధిలో ఉన్న బోడిబండ తిమ్మాగురుడు,పక్కిరప్ప స్వామి ఉరుసు ఏర్పాట్లను శనివారం ఆయన పరిశీలించారు.ఎటువంటి ఇబ్బందుల్లేకుండా దర్శనాలు జరిగేలా అల్లర్లు జరగకుండా ఎలాంటి అసంఘిక కార్యకలాపాల జరగకుండగా 3రోజులు బందోబస్తు ఏర్పాటు చేశామన్నారు.ముందుగా మండల ప్రజలందరికీ మహాశివరాత్రి శుభాకాంక్షలు



తెలిపారు. ఈ కార్యక్రమంలో పకీరప్ప స్వామి ఆలయ ధర్మకర్త అప్పా వేణుగోపాల్ రాయల్ తదితరులు పాల్గొన్నారు.



## అలరించిన చిన్నారుల నృత్యాలు

**మహానంది, ఫిబ్రవరి14,మనంన్యూస్.** మహాశివరాత్రి బ్రహ్మోత్సవాల సందర్భంగా కళావేదిక వద్ద చిన్నారులు నిర్వహించిన నృత్యాలు భక్తులను ఆకట్టుకున్నాయి. శనివారం వివిధ ప్రాంతాలనుండి వచ్చిన కళాకారులు నృత్యాలు చేశారు.ఏ ఈఓ మధు ఆధ్వర్యంలో జరిగిన నృత్యాలు భక్తులను ఎంతగానో ఆకట్టుకున్నాయి.



## మంత్రాలయంలో దామోదరం సంజీవయ్య 105వ జయంతి

**మంత్రాలయం, ఫిబ్రవరి 14,మనం న్యూస్ :** మండల కేంద్రమైన మంత్రాలయంలో కెవిపిఎస్ ,సిపిఎం రైతు సంఘం ఆధ్వర్యంలో దామోదర సంజీవయ్య 105వ జయంతి వేడుకలు శనివారం ఘనంగా జరుపుకున్నారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ కెవిపిఎస్ జిల్లా ఉపాధ్యక్షులు జి జయరాజు, కెవిపిఎస్ గౌరవ అధ్యక్షులు అనీలు బడుగు బలహీన వర్గాలకు అండదండగా నిలిచిన వ్యక్తి దామోదరం సంజీవయ్య అన్నారు. ఆయన ఎన్నో పనులు అభివృద్ధి పనులు పేద ప్రజలకు సంక్షేమ పథకాలు అందేలా చేయడం జరిగిందన్నారు. రానున్న కాలంలో దామోదరం సంజీవయ్య ఆశయాల సాధన కోసం పోరాడుతామని ఈ సందర్భంగా అన్నారు ఈ కార్యక్రమంలో పాల్గొన్న వారు రైతు సంఘం నాయకులు ఎస్ వీరేశ్ కెవిపిఎస్ మండల నాయకులు అనీలు అంజి దళిత నాయకులు ఈరన్న దస్తగిరి తదితరులు పాల్గొన్నారు.

## అంబేద్కర్ గురుకుల పాఠశాలకు రెగ్యులర్ వార్డెన్ నియమించాలి..

**సిపిఐ జిల్లా కార్యవర్గ సభ్యులు ఎం. రమేష్ బాబు**



**జూపాడుబంగ్లా ఫిబ్రవరి 14 (మనం న్యూస్):** సంవత్సర కాలం నుండి జూపాడు బంగ్లా అంబేద్కర్ గురుకుల పాఠశాలకు రెగ్యులర్ వార్డెన్ లేకపోవడం వల్ల విద్యార్థులు చాలా ఇబ్బందులకు గురవుతున్నారని తక్షణమే జిల్లా కలెక్టర్ గారు దృష్టి కేంద్రీకరించి రెగ్యులర్ వార్డెను నియమించాలని లేనిపక్షంలో విద్యార్థులతో కలిసి ఆందోళన కార్యక్రమాలు నిర్వహిస్తామని సిపిఐ జిల్లా కార్యవర్గ సభ్యులు ఎం. రమేష్ బాబు హెచ్చరించారు. శనివారం సిపిఐ మండల నాయకులు మక్బూల్ బాషా, తిరుపతయ్యలతో కలిసి పాఠశాల డైనింగ్ హాల్ ను పరిశీలించి విద్యార్థులతో మాట్లాడారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ అంబేద్కర్ గురుకుల పాఠశాల జిల్లాలోని అనేక ప్రాంతాల నుండి విద్యార్థులు చదువుకోవడానికి వస్తారని అయితే వారికి మెనూ ప్రకారం భోజనం వడ్డించాలని వారన్నారు వార్డెన్ ఉంటే అన్ని రకాల వసతులతో పాటు కూరగాయలు, మౌలిక సదుపాయాలు సమస్యలు కూడా చూసుకుంటారని టీచర్స్ కి వార్డెన్ బాధ్యతలు అప్పగించడం వల్ల అటు వారు చదువు చెప్ప లేక విద్యార్థులకు భోజన వసతి మీద దృష్టి పెట్టలేక చాలా ఇబ్బందులు ఎదుర్కొంటున్నారన్నారు.. 600 మంది విద్యార్థులకు వార్డెన్ లేకపోతే ఏలా అని వారు ప్రశ్నించారు.. తక్షణమే విద్యార్థుల బాగోగులు చూసుకునేందుకు భోజన సక్రమ వసతులు కల్పించేందుకు రెగ్యులర్ వార్డె ను నియమించా లని దీనివల్ల అవకతవకలకు చోటు ఉండదు అన్నారు. విద్యార్థులకు న్యాయం జరుగుతుం దన్నారు. వారు కోరారు లేని పక్షంలో ఆందోళన కార్యక్రమాలు నిర్వహిస్తామని వారు హెచ్చరించారు..

## అన్నదానం పరం దానం విద్యాదానమతః పరం

**'దాతలు పసుల శ్రీరాములు,పసుల ఈశ్వరమ్మ దంపతులు**



**తుగ్గలి,ఫిబ్రవరి 14(మనం న్యూస్):** అన్నదానం పరం దానం విద్యాదానమతః పరం అన్నేన క్షణికాతృప్తిర్యావజ్జీవం చ విద్యా అని పసుల శ్రీరాములు అన్నారు.మండలోనే బోడబండ అటవీ ప్రాంతంలో వెలసిన శ్రీశ్రీశ్రీ తిమ్మ గురుడు, శ్రీశ్రీశ్రీ పకీరప్ప స్వాముల ఆలయాల కు మహాశివరాత్రి పర్వదినం సందర్భంగా వచ్చే భక్తులకు ఉచిత అన్నదాన కార్యక్రమాన్ని నిర్వహించేందుకు శనివారం దాతలు మదనంతపురం పసుల శ్రీరాములు, పసుల ఈశ్వరమ్మ దంపతులు ముమ్మురంగా ఏర్పాట్లను చేపట్టారు. ఈ సందర్భంగా పసుల శ్రీరాములు పసుల ఈశ్వరమ్మ దంపతులు మాట్లాడుతూ ఎంతోమంది ప్రజల కు ఆరాధ్య దేవతలైన తిమ్మ గురుడు, పకీరప్ప స్వామి ఆలయాలకు శివరాత్రి సందర్భంగా వచ్చే భక్తులకు ప్రతి సంవత్సరం నిర్వహించే అన్నదాన కార్యక్రమాన్ని ఈ సంవత్సరం కూడా భారీ ఎత్తున అన్నదాన కార్యక్రమాన్ని ఏర్పాటు చేయడం జరుగుతుందని వారు పేర్కొన్నారు. తమకు తిమ్మ గురుడు, పకీరప్ప స్వాముల ఆశీర్వాదం ఉన్నంతవరకు ఈ కార్యక్రమాన్ని కొనసాగిస్తామని తెలిపారు. కావున శివరాత్రి ఉత్సవాలకు వచ్చే భక్తులు స్వాములను దర్శించుకున్న అనంతరం మనస్ఫూర్తిగా భోజనాలు చేయాలని వారు భక్తులను వారు కోరారు.

# రూ.6090 కోట్ల మైనారిటీ బడ్జెట్ కాగితాల గారడీ

- ముస్లిం హామీలు ఎక్కడ?
- షేక్ నాగుల్ మీరా, రాష్ట్ర అధ్యక్షుడు, ముస్లిం హక్కుల పరిరక్షణ సమితి

**విజయవాడ,ఫిబ్రవరి,14,మనం న్యూస్):** కూటమి ప్రభుత్వం ప్రకటించిన రూ.6090 కోట్ల మైనారిటీ సంక్షేమ బడ్జెట్ వాస్తవానికి సంఖ్యల మాయ మాత్రమే తప్ప, ముస్లిం మైనారిటీలకు ప్రత్యక్షంగా లబ్ధి కలిగించే స్పష్టమైన చర్యలు కనిపించడం లేదని ముస్లిం హక్కుల పరిరక్షణ సమితి రాష్ట్ర అధ్యక్షుడు షేక్ నాగుల్ మీరా తీవ్ర అసంతృప్తి వ్యక్తం చేశారు. ఇమామ్, మౌజన్ల గౌరవ వేతనం తప్ప ముస్లిం మైనారిటీలకు ప్రత్యేకంగా అమలవుతున్న కొత్త సంక్షేమ పథకం ఒక్కటీ లేదన్నారు. వ్యవసాయం, విద్య, ఎనర్జీ, గృహ నిర్మాణం, పౌర సరఫరాలు వంటి రాష్ట్ర ప్రజలందరికీ వర్తించే సాధారణ పథకాలను మైనారిటీ సబ్ ప్లాన్ పేరుతో చూపిస్తూ ముస్లింలకు



ప్రత్యేకంగా మేలు చేస్తున్నట్టు ప్రచారం చేయడం ప్రజలను తప్పుదారి పట్టించడమేనని ఆయన విమర్శించారు.

ఎన్నికల సమయంలో ముస్లిం మైనారిటీలకు ఇచ్చిన హామీలలో - చంద్రన్న పెళ్లికానుక, విదేశీ విద్య పథకం, 50 ఏళ్లకే వృద్ధాప్య పింఛన్లు, ఇస్లామిక్ బ్యాంకు ఏర్పాటు, ముస్లింలకు ఆర్థిక భరోసా, మైనారిటీ మహిళలకు ప్రత్యేక పథకాలు, నూరేబాషా కార్పొరేషన్ ఏర్పాటు, మైనారిటీ ఫైనాన్స్ కార్పొరేషన్ ద్వారా రూ.5 లక్షల వరకు వడ్డీ లేని రుణాలు, ముస్లిం విద్యార్థులకు ప్రత్యేక స్కాలర్షిప్లు, మసీదుల అభివృద్ధికి నిధులు, అనాథ పిల్లలకు ప్రభుత్వ భరోసా వంటి కీలక హామీలు ఇప్పటివరకు పూర్తిస్థాయిలో అమలు కాలేదని ఆయన గుర్తుచేశారు.

కేవలం బడ్జెట్ సంఖ్యలు ప్రకటించడం వల్ల ముస్లిం సమాజానికి నిజమైన మార్పు రాదని, నేలమీద అమలు జరిగితేనే అభివృద్ధి సాధ్యమని షేక్ నాగుల్ మీరా స్పష్టం చేశారు. ప్రభుత్వం నిజంగా ముస్లిం మైనారిటీల అభ్యున్నతిని కోరుకుంటే వెంటనే ముస్లిం మైనార్టీలకు ఇచ్చిన ఎన్నికల హామీలను అమలు చేయాలని ఆయన డిమాండ్ చేశారు. లేకపోతే రూ.6090 కోట్ల మైనారిటీ బడ్జెట్ కేవలం ప్రచార పరమైన సంఖ్యగానే మిగిలిపోతుందని హెచ్చరిస్తూ, గ్రాఅ కూటమి అధికారంలోకి వచ్చిన తర్వాత మైనార్టీల సంక్షేమంపై శ్వేత పత్రం విడుదల చేసే దమ్ముందా? అని నాగుల్ మీరా రాష్ట్ర ప్రభుత్వాన్ని సూటిగా ప్రశ్నించారు.

## కలెక్టరేట్లో దామోదరం సంజీవయ్య జయంతి



- పూలమాల వేసిన నివాళులర్పించిన ఇన్చార్జి డీఆర్వో సత్తిబాబు

**విశాఖపట్నం, మనం ఉత్తరాంధ్ర ప్రాంతీయ ప్రత్యేక ప్రతినిధి ఫిబ్రవరి 14:** మాజీ ముఖ్యమంత్రి స్వర్గీయ దామోదరం సంజీవయ్య జయంతి సందర్భంగా విశాఖపట్నం కలెక్టరేట్ మీటింగ్ హాలులో శనివారం సాంఘిక సంక్షేమ శాఖ ఆధ్వర్యంలో జయంతి వేడుకలను నిర్వహించారు. ఇన్చార్జి జిల్లా రెవెన్యూ అధికారి (డీఆర్వో) సత్తిబాబు దామోదరం సంజీవయ్య చిత్రపటానికి పూలమాల వేసి ఘన నివాళులర్పించారు. సాంఘిక సంక్షేమ శాఖ ఏడీ శ్యామల, కలెక్టరేట్ ఏవో బి.వి. రాణి అధికారులు పాల్గొని దామోదరం సంజీవయ్య సేవలను స్మరించుకున్నారు. ఆయన సామాజిక న్యాయం, బడుగు బలహీన వర్గాల అభ్యున్నతికి చేసిన కృషి చిరస్మరణీయమని ఈ సందర్భంగా వక్తలు అభిప్రాయాలు వ్యక్తపరిచారు.

## సింహాచల పుణ్యక్షేత్రంలో దేవనాథ జీయర్ స్వామి

**విశాఖపట్నం మనం ఉత్తరాంధ్ర ప్రాంతీయ ప్రత్యేక ప్రతినిధి ఫిబ్రవరి 14:** ప్రముఖ ఆధ్యాత్మిక వేత్త, పరమహంస శ్రీ శ్రీ శ్రీ దేవనాథ జీయర్ స్వామి వారు శనివారం సింహాచల వరాహ లక్ష్మీ నరసింహ స్వామి వారిని దర్శించుకున్నారు. స్వామి వారి ఆగమనం క్షేత్రంలో ఆధ్యాత్మిక శోభను సంతరింపజేసింది. ఆలయ ప్రాంగణానికి చేరుకున్న పూజ్యశ్రీ జీయర్ స్వామి వారికి ఆలయ సహాయ నిర్వహణాధికారి కె తిరుమలేశ్వరరావు ప్రధాన అర్చకులు శ్రీ శ్రీనివాస ఆచార్యులు పూర్ణకుంభ స్వాగతం పలికారు. నాదస్వర మంగళ వాయిద్యాల నడుమ, వేద పండితుల మంత్రోచ్చారణలతో స్వామి వారికి ఆలయ మర్యాదల ప్రకారం పూర్ణకుంభ స్వాగతం లభించింది.అనంతరం స్వామీజీ అంతరాలయం లో వెలసిన శ్రీ వరాహ లక్ష్మీ నరసింహ స్వామి వారిని దర్శించుకుని ప్రత్యేక పూజలు నిర్వహించారు. దర్శనానంతరం వేద పండితులు స్వామీజీకి వేద ఆశీర్వచనం అందజేశారు. ఈ సందర్భంగా ఆలయ



అధికారులు జీయర్ స్వామి వారికి శేష వస్త్రముతో సత్కరించి, డిప్యూటీ ఎగ్జిక్యూటివ్ ఆఫీసర్ సింగం రాద అప్పన్న స్వామి వారి దివ్య ప్రసాదాలను అందజేశారు.దర్శనం అనంతరం జీయర్ స్వామి వారు భక్తులను ఉద్దేశించి మాట్లాడుతూ, సింహాద్రి అప్పన్న క్షేత్ర మహత్తును కొనియాడారు. లోక కల్యాణం కోసం, ప్రజలందరూ ఆయురారోగ్యాలతో వర్ధిల్లాలని స్వామి వారిని ప్రార్థించినట్లు తెలిపారు. ఈ కార్యక్రమంలో ఆలయ సిబ్బంది, అర్చకులు మరియు భక్తులు పాల్గొని స్వామీజీ ఆశీస్సులు పొందారు.

## హార్బర్ ఏసిపి గా బాధ్యతలు చేపట్టిన ఐ.చిట్టి బాబు

**విశాఖపట్నం మనం ఉత్తరాంధ్ర ప్రాంతీయ ప్రత్యేక ప్రతినిధి ఫిబ్రవరి 14:** 91 ఎస్.ఐ బ్యాచ్ కు చెందిన ఐ.చిట్టి బాబు శనివారం హార్బర్ ఏసిపి కార్యాలయం లో హార్బర్ ఏసిపిగా బాధ్యతలు స్వీకరించారు. అనంతరం నగర సిపి డా.శంఖబ్రాత బాగ్చి,ని మర్యాదపూర్వకంగా కలిసి పుష్ప గుచ్చం అందజేసా రు. సిటీ స్పెషల్ బ్రాంచ్ గా ఏసిపి విధులు నిర్వర్తించి, బదిలీ పై నగర హార్బర్ ఏసిపి గా వచ్చిన ఐ.చిట్టి బాబు గతంలో నగరంలో టాస్క్ ఫోర్సు ఏసిపి గా, ఎస్.బి ఏసిపిగా కీలక బాధ్యతలను నిర్వర్తించి, అధికారుల మన్ననలు పొందిన విషయం విదితమే.



## ఘనంగా దామోదర సంజీవయ్య 105వ జయంతి

**శ్రీకాకుళం:మనం ఉత్తరాంధ్ర ప్రాంతీయ ప్రత్యేక ప్రతినిధి ఫిబ్రవరి 14:** ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర రెండువ ముఖ్యమంత్రి దామోదరం సంజీవయ్య 105వ జయంతి పురస్కరించుకొని శనివారం ఉదయం జిల్లా పోలీసు కార్యాలయంలో ఘనంగా నివాళులు అర్పించారు.ఈ కార్యక్రమంలో అదనపు ఎస్పీ కేవీ రమణ సంజీవయ్య చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు.ఈ సందర్భంగా అదనపు ఎస్పీ మాట్లాడుతూ, దామోదర సంజీవయ్య సాధారణ కుటుంబం నుంచి ఎదిగి ఉమ్మడి ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర ముఖ్యమంత్రిగా సేవలందించిన మహానుభావుడని పేర్కొన్నారు. సమాజంలోని వెనుకబడిన వర్గాల అభ్యున్నతికి ఆయన చేసిన సేవలు చిరస్మరణీయమని తెలిపారు. ప్రజాసేవలో నిబద్ధత, నిజాయితీ, సామాజిక న్యాయం పట్ల ఆయన చూపిన కట్టుబాటు ప్రతి ఒక్కరికీ ఆదర్శప్రాయమన్నారు.ఈ కార్యక్రమంలో డీఎస్పీ శేషాద్రి, డిసిర్బీ ఇన్స్పెక్టర్ శ్రీనివాసరావు, సైబర్ సెల్ ఇన్స్పెక్టర్ శ్రీనివాస్ ఇతర పోలీసు అధికారులు, సిబ్బంది పాల్గొన్నారు.



# మహాశివరాత్రి ఏర్పాట్లపై ఆలయ ఈవో సమీక్ష

- ప్రసాద తయారీ,అన్నప్రసాదం, కేంద్రంలో ఆకస్మిక తనిఖీ.

**విశాఖపట్నం మనం ఉత్తరాంధ్ర ప్రాంతీయ ప్రత్యేక ప్రతినిధి ఫిబ్రవరి 14 :** సింహాచల పుణ్యక్షేత్రంలో రేపు జరగనున్న మహాశివరాత్రి పర్వదినాన్ని పురస్కరించుకుని భక్తులకు కల్పించాల్సిన సౌకర్యాలు, క్షేత్రస్థాయి ఏర్పాట్లపై ఆలయ కార్యనిర్వహణాధికారి జె. వెంకట్రావు శనివారం అధికారులతో కలిసి విస్తృతంగా పర్యటించారు. కొండపై ఉన్న శివాలయాలను ఈవో సందర్శించి, శివరాత్రి వేడుకల కోసం జరుగుతున్న ఏర్పాట్లను పరిశీలించారు. కొత్త క్యూ కాంప్లెక్స్ వద్ద జరుగుతున్న ఇంజనీరింగ్ పనులను ఎగ్జిక్యూటివ్ ఇంజనీర్ బండారు రాంబాబు, డిప్యూటీ ఇంజనీర్ రామరాజులకు త్వరితగతిన పూర్తి చేయాలని, తెలియజేశారు

లడ్డు, పులిహోర ప్రసాద తయారీ విభాగాలను పర్యవేక్షించిన ఈవో తయారీ విధానం, వినియోగిస్తున్న వస్తువుల నాణ్యతను పరిశీలించిన ఆయన, స్వయంగా లడ్డు ప్రసాదాన్ని తిని రుచి చూశారు. అనంతరం అక్కడ ఉన్న పాత్రికేయ మిత్రులను కూడా ప్రసాదాన్ని రుచి చూడవలసిందిగా కోరారు. పాత్రికేయ మిత్రులు ప్రసాదాన్ని రుచి చూసి, నాణ్యత మరియు రుచి అత్యద్భుతంగా ఉందని చెప్పడంతో ఈవో సంతృప్తి వ్యక్తం చేశారు.దక్షిణ రాజగోపురం వద్ద ఈవో వెంకటరావు ఏఈవో తిరుమలేశ్వరరావుతో కలిసి భక్తులతో మమేకమయ్యారు. దర్శనం ఏ విధంగా జరుగుతోంది? సౌకర్యాలపై సంతోషంగా ఉన్నారా? అని ఆరా తీశారు. అనంతరం అన్నదాన భవనంలో ఏఇఓ రమణమూర్తి, పర్యవేక్షణ అధికారి నర్సింగరావు బృందంతో కలిసి భోజనం చేస్తున్న భక్తులతో నేరుగా మాట్లాడారు అన్న ప్రసాదము



రుచి అడిగి తెలుసుకున్నారు. భక్తుల నుంచి సానుకూల స్పందన రావడంతో హర్షం వ్యక్తం చేశారు.వచ్చే ఫిబ్రవరి 23 నుండి 27 వరకు (5 రోజుల పాటు) శ్రీ విశ్వావసు నామ సంవత్సర ఉత్తరాయణ ఫాల్గుణ మాస శుక్ల పక్ష ఏకాదశి, 27.02.2026 (శుక్రవారం) ఉదయం 11:25 గంటలకు వృషభ లగ్నమందు ఆలయ పునఃప్రతిష్ఠా కార్యక్రమాలు వైభవంగా నిర్వహించనున్నట్లు ఈ సందర్భంగా ఈవో ప్రకటించారు.

ఆలయ పరిసరాల్లోని సీసీ కెమెరాల పనితీరును కూడా ఈవో పరిశీలించారు. భక్తుల భద్రత దృష్ట్యా నిరంతరం నిఘా కొనసాగించాలని సిబ్బందిని ఆదేశించారు.శివరాత్రి రద్దీ దృష్ట్యా నిరంతర నిఘా కొనసాగించాలని సిబ్బందిని ఆదేశించారు.

# కూటమి సర్కారుపై ధర్మాన కృష్ణదాస్ నిప్పులు



నరసన్నపేట: ఫిబ్రవరి 14 మనం న్యూస్: రాష్ట్ర శాసనసభలో కూటమి ప్రభుత్వం ప్రవేశపెట్టిన బడ్జెట్ ప్రజలను నిలువునా వంచించేలా ఉందని వైఎస్ఆర్సిపి శ్రీకాకుళం జిల్లా అధ్యక్షులు, మాజీ ఉప ముఖ్యమంత్రి ధర్మాన కృష్ణదాస్ మండిపడ్డారు. శనివారం ఆయన ఒక ప్రకటన విడుదల చేస్తూ... ఈ బడ్జెట్లో పేదలకు, రైతులకు ఒరిగిందేమీ లేదని, కేవలం అంకెల గారడీతో ప్రజలను తప్పుదోవ పట్టించే ప్రయత్నం చేశారని దుయ్యబట్టారు.

**అడుగడుగునా మోసమే..**

ఎన్నికల ముందు సూపర్ సిక్స్ అంటూ భారీ హామీలు ఇచ్చిన చంద్రబాబు, ఇప్పుడు బడ్జెట్లో వాటి ఊసే ఎత్తకపోవడం సిగ్గుచేటు. తల్లికి వందనం, నిరుద్యోగ భృతి, మహిళలకు నెలకు రూ.1500 వంటి పథకాలకు పైసా కేటాయించకుండా ఆడబిడ్డలను ఘోరంగా మోసం చేశారు' అని కృష్ణదాస్ విమర్శించారు. అన్నదాత సుఖీభవ పథకానికి అరకొర నిధులు కేటాయించి రైతులకు వెన్నుపోటు పొడిచారని ఆగ్రహం వ్యక్తం చేశారు.

**ఉత్తరాంధ్రకు మొండిచేయి**

పారిశ్రామికంగా, విద్యాపరంగా వెనుకబడిన శ్రీకాకుళం జిల్లాకు బడ్జెట్లో ఎటువంటి ప్రత్యేక కేటాయింపులు లేవని ఆయన ఆవేదన వ్యక్తం చేశారు. గత వైఎస్ఆర్సిపి ప్రభుత్వ హయాంలో జిల్లాలో చేపట్టిన అభివృద్ధి పనులను ఈ ప్రభుత్వం విస్మరించిందని, కనీసం పూర్తి కావాల్సిన ప్రాజెక్టులకు కూడా నిధులు ఇవ్వలేదని ఎద్దేవా చేశారు. బడ్జెట్లో చూపిన గణాంకాలు అన్నీ అబద్ధాలని, రాష్ట్ర అప్పుల గురించి తప్పుడు ప్రచారం చేస్తూ ప్రజలను భయభ్రాంతులకు గురిచేస్తున్నారని ధ్వజమెత్తారు. ఈ ప్రజా వ్యతిరేక బడ్జెట్, ప్రభుత్వం విస్మరించిన హామీల పైన వైఎస్ఆర్సిపి తరపున క్షేత్రస్థాయిలో ప్రజలతో కలిసి పోరాడతామని ధర్మాన కృష్ణదాస్ హెచ్చరించారు.

# అభివృద్ధిని, సంక్షేమాన్ని సమాంతరంగా తీసుకువెళ్లే బడ్జెట్

- ఎమ్మెల్యే అదితి గజపతి రాజు



విజయనగరం మనం ఉత్తరాంధ్ర ప్రాంతీయ ప్రత్యేక ప్రతినిధి ఫిబ్రవరి 14: 2026-27 రాష్ట్ర బడ్జెట్ను రూ.3.32 లక్షల కోట్ల అంచనాతో ఆర్థిక మంత్రి పయ్యావుల కేశవ్ శనివారం శాసనసభలో ప్రవేశపెట్టడం జరిగిందని, ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు నాయకత్వంలో కూటమి ప్రభుత్వం ఈ బడ్జెట్ ద్వారా రాష్ట్రాన్ని అభివృద్ధిని, సంక్షేమంలో సమాంతరంగా ముందుకు తీసుకువెళ్తుందని విజయనగరం ఎమ్మెల్యే పూసపాటి అదితి విజయలక్ష్మి గజపతి రాజు అన్నారు. సంక్షేమానికి పెద్దపేట వేస్తూ ఎన్టీఆర్ భరోసా పింఛన్లు, తల్లికి వందనం, స్త్రీ శక్తి, దీపం, అన్నదాత సుఖీభవ, ఆటో డ్రైవర్ల సేవలో వంటి సంక్షేమ పథకాలకు నిధులు కేటాయించారని, ముఖ్యంగా యువతకు 20 లక్షల ఉద్యోగ అవకాశాలు కల్పించాలనే లక్ష్యంతో పనిచేస్తున్న నారా లోకేష్ స్పీడ్ ఆఫ్ డూయింగ్ బిజినెస్ ను అమలు చేస్తూ చీఫ్ జాబ్ క్రియేటర్ గా చరిత్రలో నిలుస్తారని ఈ సందర్భంగా ఆమె తెలిపారు.కూటమి ప్రభుత్వం వచ్చాక రైతులకు 24 గంటల్లోనే ధాన్యం కొనుగోలు డబ్బులు జమ చేస్తున్నామని, అదేవిధంగా ఈ బడ్జెట్ లో రైతు సంక్షేమానికి పెద్దపీట వేశారన్నారు. పారదర్శక పాలనను ప్రజలకు మరింత చేరువ చేసే దిశగా వాట్సాప్ గవర్నెన్స్ ద్వారా 900 సేవలు అందిస్తున్నామన్నారు. ప్రతి వ్యక్తికి రోజుకు 55 లీటర్ల త్రాగునీరు అందేలా ప్రభుత్వం ప్రణాళిక చేస్తుందన్నారు. పోలవరం, రాజధాని అమరావతి నిర్మాణానికి నిధులు కేటాయించారు. నాగావళి - చంపావతి నదుల అనుసంధానం, భోగాపురం విమానాశ్రయం నిర్మాణంతో మన ప్రాంతానికి మేలు కలుగుతుందన్నారు.

# మహాశివరాత్రి ఉత్సవాలు వైభవంగా నిర్వహించాలి

**భక్తులకు ఇబ్బందులు తలెత్తకుండా పకడ్బందీ ఏర్పాట్లు చేయాలి**

**జిల్లా కలెక్టర్, ఎస్పీలకు ఫోన్ చేసి మంత్రి అచ్చెన్నాయుడు కీలక ఆదేశాలు**



నిమ్మాడ, ఫిబ్రవరి 14(మనం ప్రతినిధి): ప్రముఖ శైవ దేవాలయాలైన ఎండల మల్లికార్జున స్వామి, ఉమా రుద్ర కోటేశ్వర స్వామి, మహేంద్ర తనయ ప్రముఖ దేవాలయాల్లో మహాశివరాత్రి ఉత్సవాలను అత్యంత వైభవంగా, భక్తులకు ఎటువంటి ఇబ్బందులు కలగకుండా నిర్వహించాలని రాష్ట్ర వ్యవసాయ శాఖ మంత్రి కింజరాపు అచ్చెన్నాయుడు ఆదేశించారు. ఈ మేరకు శుక్రవారం ఆయన జిల్లా కలెక్టర్ స్వప్నిల్ దినకర్ పుండ్కర్, ఎస్పీ కేవీ మహేశ్వర్ రెడ్డిలతో ఫోన్ ద్వారా మాట్లాడి ఏర్పాట్లపై ఆరా తీశారు. దక్షిణ కాశిగా ప్రసిద్ధి చెందిన జలుమూరు మండలం శ్రీముఖలింగంలో ఫిబ్రవరి 15 నుంచి 18 వరకు జరిగే మహాశివరాత్రి ఉత్సవాలకు రాష్ట్రం నలుమూలల నుంచి భక్తులు పెద్ద సంఖ్యలో తరలివస్తారని పేర్కొన్న మంత్రి, వారందరికీ సంతృప్తికరమైన దర్శనం కల్పించాలని సూచించారు. గత అనుభవాలను దృష్టిలో ఉంచుకుని ఎక్కడా చిన్న పొరపాటు కూడా జరగకుండా జాగ్రత్తలు తీసుకోవాలని, వంశధార నదిలో పుణ్యస్నానాలు ఆచరించే సమయంలో భద్రతా ఏర్పాట్లు పటిష్టంగా ఉండాలని ఆదేశించారు. తాగునీరు, పారిశుధ్యం, విద్యుత్ సరఫరా వంటి మౌలిక వసతుల్లో ఎక్కడా అంతరాయం కలగకూడదని కలెక్టర్కు స్పష్టం చేశారు. అలాగే భద్రతా పరంగా దేవాలయ పరిసరాల్లో నిరంతరం సీసీ కెమెరాల నిఘా ఉండాలని, ట్రాఫిక్ ఇబ్బందులు తలెత్తకుండా చర్యలు తీసుకోవాలని ఎస్పీకి సూచించారు. ముఖ్యంగా చక్రతీర్థ స్నానాల సమయంలో భక్తుల రక్షణ కోసం గజఈతగాళ్లను అందుబాటులో ఉంచాలని, ఎలాంటి అవాంఛనీయ సంఘటనలు జరగకుండా నిరంతర పర్యవేక్షణతో మహాశివరాత్రి వేడుకలను విజయవంతం చేయాలని మంత్రి అచ్చెన్నాయుడు అధికారులను కోరారు.

# ఉచిత ఆటో సదుపాయం ఏర్పాటు

కాత్రేనికోన ఫిబ్రవరి 14 మనం ప్రతినిధి : దక్షిణ కాశీగా పేరు పొందిన కుండలేశ్వరం పుణ్యక్షేత్రంలో మహా శివరాత్రి సందర్భంగా కాత్రేనికోన నుండి కుండలేశ్వరం వరకు ఉచిత ఆటో సదుపాయం ఏర్పాటు చేశామని కాత్రేనికోన శ్రీ సిద్ధార్థ ఆటో యూనియన్ అధ్యక్షుడు కొప్పాడి విగ్నేశ్వర రావు ఒక ప్రకటనలో తెలిపారు కాత్రేనికోన శ్రీ సిద్ధార్థ ఆటో యూనియన్ ఆధ్వర్యంలో కుండలేశ్వర స్వామి వారి ఆలయానికి వచ్చే భక్తులకు కాత్రేనికోన నుండి కుండలేశ్వరం శివాలయం వరకు ఉచితంగా 30 ఆటోలు నడుపుతున్నట్లు ఆటో యూనియన్ నాయకులు , నేలపాటి సురేష్,పాము శ్రీనివాస రావు,కాండ్రేకుల విజయ్ కుమార్, తెలిపారు విలేకర్ రాజు ఆధ్వర్యంలో ఉచిత ఆటో సౌకర్యం : కాత్రేనికోన గ్రామానికి చెందిన కీర్తి శేషులు పి సత్యవతి జ్ఞాపకార్థం టీడీపీ నాయకుడు పి ఎస్ ఎన్ రాజు ( విలేకర్ రాజు )ఆర్థిక సాయం తో శివరాత్రి సందర్భంగా ఆదివారం ఉదయం నుండి సాయంత్రం వరకు కాత్రేనికోన నుండి కుండలేశ్వరం ఆలయం వరకు ఉచిత ఆటో సౌకర్యం ఏర్పాటు చేశారు. భక్తులు ఈ సౌకర్యం ఉపయోగించుకోవాలని అయన కోరారు.

# భీమిలి జోన్‌లో ఎల్ఆర్ఎస్ మంజూరు

**స్థలాలను పరిశీలించిన కమిషనర్**



విశాఖపట్నం, ఫిబ్రవరి 14 (మనం ఉత్తరాంధ్ర ప్రాంతీయ ప్రత్యేక ప్రతినిధి): జీవీఎంసీ పరిధిలో గల అనధికారిక లేఔట్లలో ఎల్ఆర్ఎస్ పథకంలో స్థల యజమానులు దరఖాస్తు చేసిన స్థలాల పూర్తి వివరాలను పరిశీలించి అనుమతుల మంజూరు ప్రక్రియ జరపాలని జీవీఎంసీ టౌన్ ప్లానింగ్ అధికారులకు జీవీఎంసీ కమిషనర్ కేతన్ గార్గ్ ఆదేశించారు.

# ఆర్థిక సంక్షోభంలోనూ రెండంకెల వృద్ధి లక్ష్యంతో బడ్జెట్: ఎమ్మెల్యే నల్లమిల్లి



తూర్పుగోదావరి, ఫిబ్రవరి 14, మనం బ్యూరో న్యూస్ : రాష్ట్ర ప్రభుత్వం ప్రవేశపెట్టిన 2026-27 వార్షిక బడ్జెట్ ఎమ్మెల్యే నల్లమిల్లి స్పందించారు. బడ్జెట్ అనేది కేవలం ఆదాయం-వ్యయాల లెక్కలు కాకుండా ప్రజల ఆశలను నెరవేర్చే రోడ్మ్యాప్గా రూపొందించారని తెలిపారు. ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు నేతృత్వంలో, ఆర్థిక మంత్రి పయ్యావుల కేశవ్ ప్రవేశపెట్టిన ఈ బడ్జెట్లో పాలన, సంక్షేమం, అభివృద్ధి మధ్య సమతుల్యత సాధించే ప్రయత్నం కనిపిస్తుందని అన్నారు.

విభజన అనంతరం 2014-19లో రాష్ట్ర వృద్ధిరేటు 13.5 శాతం ఉండగా 2019-24లో అది గణనీయంగా తగ్గిందని పేర్కొన్నారు. ప్రస్తుతం కూటమి ప్రభుత్వం ఆర్థిక వ్యవస్థను గాడిలో పెట్టి 13.75 శాతం వృద్ధిరేటు లక్ష్యంగా పెట్టుకుని రెండంకెల అభివృద్ధి దిశగా ముందుకు సాగుతోందని చెప్పారు. కాగితాలకే పరిమితమయ్యే బడ్జెట్ కాకుండా క్షేత్రస్థాయిలో అమలయ్యే విధంగా రూపొందించారని వివరించారు. సూపర్ సిక్స్ హామీలకు అనుగుణంగా నిధులు కేటాయించడంతో పాటు వ్యవసాయం, వైద్య ఆరోగ్య రంగాలకు ప్రాధాన్యం ఇచ్చారని తెలిపారు. విశాఖలో ఏర్పాటు చేయబోయే భారీ డేటా సెంటర్కు రూ.28 వేల కోట్లు కేటాయించడం రాష్ట్ర ఐటీ రంగానికి దోహదం చేస్తుందని చెప్పారు. రాయలసీమను హార్టికల్చర్ హబ్గా మార్చేందుకు సాగు విస్తీర్ణాన్ని 8 లక్షల హెక్టార్ల నుంచి 14 లక్షల హెక్టార్లకు పెంచే ప్రణాళికకు బడ్జెట్లో మద్దతు ఇచ్చారని పేర్కొన్నారు. పోలవరం, వెలిగొండ, హంద్రీనీవా ప్రాజెక్టుల పూర్తి, అమరావతి అభివృద్ధి, రోడ్లు-పోర్టుల నిర్మాణానికి నిధులు కేటాయించారని తెలిపారు. విద్యుత్ రంగానికి రూ.13,934 కోట్లు కేటాయించడాన్ని ఆయన స్వాగతించారు. ధరల స్థిరీకరణకు నిధులు, సీఎంఆర్ చెల్లింపుల ద్వారా రైతుల సమస్యల పరిష్కారం, రైతన్నా నీకోసం కార్యక్రమానికి భారీ కేటాయింపులు చేయడం రైతులకు ఉపశమనం కలిగిస్తుందని అన్నారు.

తీవ్రమైన ఆర్థిక పరిస్థితుల్లో కూడా వృద్ధి సాధించేలా బడ్జెట్ రూపొందించారని ఆర్థిక మంత్రి పయ్యావుల కేశవ్కు, ప్రభుత్వానికి ఆయన కృతజ్ఞతలు తెలిపారు. కేంద్ర సహకారం కూడా రాష్ట్ర అభివృద్ధికి ఉపయోగపడుతుందని ఎమ్మెల్యే నల్లమిల్లి పేర్కొన్నారు.

# సంక్షేమంతో పాటు రాష్ట్ర అభివృద్ధిని పరుగులు పెట్టించేలా 2026-27 బడ్జెట్



కర్నూలు ఫిబ్రవరి 14మనం న్యూస్: శాసనసభలో ఆర్థిక మంత్రి పయ్యావుల కేశవ్ రూ.3,32,205 కోట్లతో ప్రవేశపెట్టిన 2026-27 వార్షిక బడ్జెట్ రాష్ట్రాన్ని అభివృద్ధి దిశలో తీసుకెళ్లడంతో పాటు సంక్షేమాన్ని పరుగులు పెట్టించేలా ఉందని రాష్ట్ర పరిశ్రమలు, వాణిజ్యం, ఫుడ్ ప్రాసెసింగ్ శాఖ మంత్రి టీజీ భరత్ అన్నారు. బడ్జెట్ ఆయన ఒక ప్రకటన విడుదల చేశారు. విద్యార్థుల నుండి రైతులు, వ్యాపారులు, పేదలు, మహిళలు, బీసీ,ఎస్సీ,ఎస్టీ, మైనారిటీ, అన్ని సామాజిక వర్గాల వారికి ఎంతో ప్రయోజనం చేకూర్చేవిధంగా రాష్ట్ర ప్రభుత్వ బడ్జెట్ ఉందని పేర్కొన్నారు. ఆర్థిక లోటు ఉన్నప్పటికీ సంక్షేమ పథకాలకు పెద్దపీట వేశామన్నారు. వైసీపీ ప్రభుత్వ హయాంలో ఎంతో నష్టం జరిగిందని, సీఎం నారా చంద్రబాబు నాయుడు నాయకత్వంలో అభివృద్ధిలో రాష్ట్రం ఎంతో ముందుకెళ్తోందన్నారు. అమరావతి నిర్మాణంతో పాటు రాష్ట్రంలోని అన్ని ప్రాంతాల అభివృద్ధికి కూటమి ప్రభుత్వం కృషి చేస్తోందన్నారు. బడ్జెట్లో రాయలసీమ గ్లోబల్ హార్టికల్చర్ హబ్ కోసం రూ.30,000 కోట్లు కేటాయించడం గొప్ప నిర్ణయమని పేర్కొన్నారు. స్పీడ్ ఆఫ్ డూయింగ్ బిజినెస్ విధానం అమలుచేయడం వల్లే పెట్టుబడుల్లో రాష్ట్రం ప్రపంచం దృష్టిని ఆకర్షిస్తోందన్నారు. కూటమి ప్రభుత్వం ప్రవేశపెట్టిన ఈ బడ్జెట్ అందరికీ అనుకూలమైందన్నారు.

# వృషభ పోటీలకు ఆహ్వానం



మహానంది, ఫిబ్రవరి14,మనంన్యూస్. మహాశివరాత్రి బ్రహ్మోత్సవాల సందర్భంగా నంద్యాల జిల్లా శ్రీశైలం నియోజకవర్గం ఎమ్మెల్యే బుడ్డా రాజశేఖరరెడ్డి ఆశీస్సులతో కేసికేనాల ప్రాజెక్టు చైర్మెన్ బన్నూరు రామలింగారెడ్డి,మాలపాటి పుల్లయ్యచౌదరి, కౌరా ఇన్ఫ్రాప్రైవేట్ లిమిటెడ్, నంద్యాల వారి సహకారంతో, తెలుగుదేశం పార్టీ మండల రైతుకమిటి సహకారంతో ఒంగోలుజాతిబండలాగు పోటీలకు ఈఓ శ్రీనివాస్ రెడ్డిని మర్యాదపూర్వకంగా ఆహ్వానించారు.ఈ కార్యక్రమంలో తెలుగుదేశంపార్టీమండల కన్వీనర్ కంచర్ల శివశంకర్ చౌదరి, క్లస్టర్ఇంచార్జీ నరాల మౌలీశ్వర్ రెడ్డి,యూనిట్ ఇంచార్జీలు బాష్యం రాముడుగౌడ్, శ్రీను, మహానంది దేవస్థానం మజీ దార్మకర్త గంగిశెట్టి మల్లికార్జున, ఉమా దేవి, పటాల శ్రీను,తదితరులు పాల్గొన్నారు.

# మురమళ్ల శ్రీ వీరేశ్వర స్వామి వారి ఆలయంలో మహా శివరాత్రి మహోత్సవాలు



పోలవరం ఫిబ్రవరి 14 మనం న్యూస్: ఫిబ్రవరి 15 నుండి 19 వతేది వరకు ఐదు రోజులు అంగరంగ వైభవంగా జరగనున్న ఉత్సవాలు.అధిక సంఖ్యలో భక్తులు విచ్చేస్తారని అధికారులు అంచనా. అందుకు అనుగుణంగా ఏర్పాట్లు చేస్తున్న అధికారులు. ప్రత్యేక క్యూ లైన్లు ఏర్పాటు చలువ పందిళ్లు, విద్యుత్ దీపాలంకరణ విశేష పచ్చి పూల అలంకరణలో ఆలయం. చంటి పిల్లలకు పాలు, బిస్కెట్లు, శ్రీ వీరేశ్వర జలప్రసాదం, ఉచిత ప్రసాదం ఏర్పాటు. మెడిల్ క్యాంప్, పోలీస్ బందోబస్తు ఏర్పాటు. సామాన్య భక్తులకు ప్రాధాన్యత ఇస్తూ దర్శన విధానం. మహా శివరాత్రి సందర్భంగా స్వామి వారికి విశేషంగా ద్వాదశ పుష్కర నదీ జలాభిషేకం. ఐదు రోజులు విశేషంగా దర్శనాలు, పంచామృతాభిషేకాలు, నిత్య అభిషేకాలు. ప్రత్యేక ఆకర్షణగా సెల్ఫీ పాయింట్. శూలాల సంబరం, అఖండ దీపారాదన, లింగార్చన, నిత్య కల్యాణం. ఐదు రోజులు పలు ఆధ్యాత్మిక, సాంస్కృతిక కార్యక్రమాలు. ఆఖరు రోజు 19 వతేది పవిత్ర వృద్ధ గౌతమి నది వద్ద పంచహారతులు, హంస వాహనం పై తెప్పోత్సవ మహోత్సవం. ఏర్పాట్లు పర్యవేక్షిస్తున్న ఆలయ చైర్మన్ దాట్ల రామకృష్ణం రాజు, అసిస్టెంట్ కమీషనర్ వి. సత్యనారాయణ. ముమ్మిడివరం సి ఐ మోహన్ కుమార్ .

# సింహ వాహనంపై స్వామి అమ్మవార్ల దర్శనం



మహానంది, ఫిబ్రవరి14, మనంన్యూస్. మహాశివరాత్రి ఉత్సవాల సందర్భంగా శనివారం శ్రీకామేశ్వరీ దేవి సమేత మహానందీశ్వర స్వామివార్ల ఉత్సవ మూర్తుల విగ్రహాలు సింహ వాహనం పై భక్తులకు దర్శనమిచ్చాయి. ఉదయం ఆలయ కార్యనిర్వాహన అధికారి శ్రీనివాస రెడ్డి ఆధ్వర్యంలో వేదపండితులు రవిశంకర్ అవధాని, శాంతారామ్ భట్, నాగేశ్వర శర్మ, హనుమంతు శర్మ, ప్రధాన అర్చకులు అర్జున్ శర్మ ల ఆధ్వర్యంలో ఋత్వికులు ప్రత్యేక పూజలు నిర్వహించారు. అనంతరం కళ్యాణ మండపంలో ప్రత్యేకంగా అలంకరించిన పల్లకిలో స్వామి అమ్మవార్ల ఉత్సవ విగ్రహాలను ఆశీనులుగా చేశారు. ప్రత్యేక పూజల అనంతరం గ్రామోత్సవం నిర్వహించారు.

సాయంత్రం సేశవాహణం పై భక్తులకు దర్శనమిచ్చారు. ఈ కార్యక్రమంలో సూపర్డెన్స్ సుబ్బారెడ్డి, నిలకంటేశ్వర రాజు,భక్తులు, తదితరులు పాల్గొన్నారు.

# కరప బీసీ గురుకులంలో 5-8 తరగతుల ప్రవేశాలకు దరఖాస్తులు ఆహ్వానం

తూర్పుగోదావరి, ఫిబ్రవరి 14, మనం బ్యూరో న్యూస్: కరపలోని మహాత్మా జ్యోతిబా పూలే బీసీ సంక్షేమ బాలుర గురుకుల పాఠశాలలో ఐదో తరగతి నుంచి ఎనిమిదో తరగతి వరకు ప్రవేశాల కోసం అర్హులైన విద్యార్థుల నుంచి దరఖాస్తులు ఆహ్వానిస్తున్నట్లు ప్రిన్సిపాల్ కేవీ కృష్ణారావు తెలిపారు.

గురువారం విలేకరులతో మాట్లాడిన ఆయన, ఆయా తరగతుల్లో ఖాళీగా ఉన్న సీట్ల భర్తీకి ఈ ప్రక్రియ చేపట్టినట్లు చెప్పారు.

# ప్రతి మహిళా పారిశ్రామికవేత్తగా ఎదగాలి



- తక్కువ పెట్టుబడితో సుస్థిర ఆదాయం పొందాలి
- ఔత్సాహిక మహిళా శక్తికి రైజ్ చేయూత
- ప్రతివారం ప్రత్యేక అవగాహన, నైపుణ్య వర్క్షాపులు
- పారిశ్రామిక యూనిట్ల స్థాపనకు సాంకేతిక-ఆర్థిక మార్గదర్శకత్వం
- మంచి ఆలోచనలతో ఆదాయం పొందే మార్గాలకు దిశానిర్దేశం
- జిల్లా కలెక్టర్ డా. జి.లక్ష్మీశ

(విజయవాడ,ఫిబ్రవరి,14,మనం న్యూస్): మహిళలను ఆర్థికంగా బలోపేతం చేసే స్వయం ఉపాధి, సూక్ష్మ, చిన్న పారిశ్రామిక రంగాల్లో ముందుకు తీసుకువెళ్లే లక్ష్యంతో జిల్లా అధికార యంత్రాంగం, విజయవాడ కూలెక్స్ ఇండస్ట్రీస్ ప్రైవేట్ లిమిటెడ్ భాగస్వామ్యంతో నిర్వహించిన ప్రత్యేక అవగాహన, నైపుణ్య వర్క్షాప్ విజయవంతంగా నిర్వహించామని జిల్లా కలెక్టర్ డా. జి.లక్ష్మీశ అన్నారు. ఇలాంటి కార్యక్రమాలను సద్వినియోగం చేసుకొని ప్రతి మహిళా పారిశ్రామికవేత్తగా ఎదగాలని అన్నారు. మహిళామణులను పారిశ్రామికవేత్తలుగా తీర్చిదిద్దేందుకు జిల్లా పరిశ్రమలు, డీఆర్డీఏ తదితర శాఖలతో పాటు కూలెక్స్ ఇండస్ట్రీస్ భాగస్వామ్యంతో శనివారం ఇబ్రహీంపట్నం మండలం, గుంటుపల్లిలోని రూరల్ ఇంక్యుబేషన్, స్కిల్లింగ్ అండ్ ఆంత్రప్రెన్యూర్షిప్ సెంటర్ (రైజ్)లో ప్రత్యేక జాగృతి వర్క్షాప్ జరిగింది. ఈ సందర్భంగా శీతలీకరణ, కిచెన్ అండ్ ఫుడ్ ఎక్విప్మెంట్ తయారీలో సుదీర్ఘ అనుభవం కలిగిన కూలెక్స్ ఇండస్ట్రీస్ ప్రైవేట్ లిమిటెడ్ యాజమానులు సూక్ష్మ, చిన్న ఫుడ్ ప్రాసెసింగ్ యూనిట్ల ఏర్పాటుతో పాటు విలువ ఆధారిత ఉత్పత్తులు, చిన్నస్థాయి వ్యాపార అభివృద్ధికి ప్రయోజనం కల్పించేలా శిక్షణ అందించారు. ఫ్రయర్స్, పిజ్జా ఓవెన్స్, శాండ్విచ్ గ్రిల్స్, వాఫెల్ మెషీన్స్, ఎలక్ట్రికల్ గ్రైడర్స్ తదితరాలపై లైవ్ డెమో ఇచ్చారు.

ఈ సందర్భంగా కలెక్టర్ లక్ష్మీశ మాట్లాడుతూ ఆహార ఉత్పత్తుల వ్యాపారం చాలా లాభదాయకమని.. అయితే ఉత్పత్తులను అత్యంత పరిశుభ్రతతో నాణ్యతతో అందించినప్పుడే వినియోగదారుల ఆదరణ ఉంటుందన్నారు. అందుకే ఇలాంటి అధునాతన, వినూత్న మెషీన్లు ఉపయోగించడం ద్వారా దీర్ఘకాలం పాటు వ్యాపారాన్ని విజయవంతంగా ముందుకు తీసుకెళ్లొచ్చన్నారు. ఒక కుటుంబం-ఒక పారిశ్రామికవేత్త కలను సాకారం చేసేందుకు ప్రతివారం రైజ్ కేంద్రంలో ప్రత్యేక వర్క్షాపులు నిర్వహిస్తున్నామని.. మహిళలు వీటిని సద్వినియోగం చేసుకొని స్వయంగా ఉపాధి అవకాశాలు సృష్టించుకొని పారిశ్రామికవేత్తలుగా ఎదగాలని ఆకాంక్షించారు.

**రైజ్.. హెల్పింగ్ హ్యాండ్:**

మహిళలు ఆర్థికంగా స్వయం సమృద్ధి సాధిస్తే కుటుంబం, గ్రామం, జిల్లా, రాష్ట్రం, దేశం సమగ్ర అభివృద్ధి సాధ్యమవుతుందని పేర్కొన్నారు. మహిళలు తమ ప్రతిభ, ఆలోచనలను కార్యరూపం దాల్చేందుకు రైజ్ వంటి వేదికలను వినియోగించుకోవాలని సూచించారు. ఈ రైజ్ కేంద్రంలో వరుసగా ఇది నాలుగో వర్క్షాప్ అని.. ఇలాంటి మరిన్ని వర్క్షాప్లు నిరంతరం జరుగుతూనే ఉంటాయన్నారు. ₹పాఠాలు నేర్చుకోవాలంటే బడికి వెళ్లాలి.. దేవుని దర్శనం కోసం ఆలయానికి వెళ్లాలి.. పారిశ్రామికవేత్తగా ఎదగాలంటే రైజ్ కేంద్రానికి వెళ్లాలంటూ మహిళామణుల్లో స్ఫూర్తి నింపారు. మంచి ఆలోచనలు ఆదాయ మార్గాలుగా మారేలా రైజ్ చేయిపట్టి నడిపిస్తుందని, ఆర్థిక సాధికారతను సొంతం చేస్తుందని కలెక్టర్ లక్ష్మీశ పేర్కొన్నారు.

**పథకాలను సద్వినియోగం చేసుకోవాలి:**

మహిళా పారిశ్రామికవేత్తలకు ప్రభుత్వం అందిస్తున్న పీఎంఈజీపీ వంటి పథకాలతో పాటు వివిధ రుణ సదుపాయాలు, సబ్సిడీలు, శిక్షణా కార్యక్రమాలు, మార్కెటింగ్ మద్దతు పథకాలపై జిల్లా పారిశ్రామిక అధికారి వివరించారు. బ్యాంకు రుణాల ప్రక్రియ, డాక్యుమెంటేషన్, స్వయం సహాయక సంఘాల ద్వారా ఆర్థిక మద్దతు పొందే విధానం వంటి అంశాలపై స్పష్టత ఇచ్చారు. కార్యక్రమంలో పాల్గొన్న మహిళలు యూనిట్ స్థాపనలో ఎదురయ్యే సమస్యలు, వినూత్న పరికరాల వినియోగం, నిర్వహణ, ముడి సరుకు అందుబాటు, మార్కెటింగ్ సవాళ్లు వంటి అంశాలపై నిపుణులతో చర్చించారు. ప్రత్యక్షంగా తమ సందేహాలకు సమాధానాలు పొందడంతో మహిళల్లో ఆత్మవిశ్వాసం పెరిగింది.

కొంతమంది మహిళలు త్వరలోనే ఆహార ఉత్పత్తుల తయారీ యూనిట్లు ప్రారంభించేందుకు ఆసక్తి వ్యక్తం చేయడం, రిజిస్ట్రేషన్ చేయించుకోవడం ఈ వర్క్షాప్ విజయానికి నిదర్శనంగా నిలిచింది.

కార్యక్రమంలో ఎంపీపీ పాలడుగు జ్యోత్స్న, విజయవాడ ఆర్డీవో కావూరి చైతన్య, కూలెక్స్ ఇండస్ట్రీస్ యాజమానులు పాలకుర్తి రాధాకృష్ణ, భ్రమరాంబ, సందేశ్, జిల్లా పరిశ్రమల అధికారి ఎం.మధు, డీఆర్డీఏ పీడీ ఏఎన్వీ నాంచారరావు, ఇబ్రహీంపట్నం బ్లాక్ కోఆర్డినేటర్ శ్రీనివాసరావు, మహిళా సమాఖ్యల ప్రతినిధులు, పెద్ద సంఖ్యలో స్వయం సహాయక సంఘాల, ఔత్సాహిక మహిళలు హాజరయ్యారు.

మనం Manam Sports, Cinema
8 SPORTS స్పోర్ట్స్
గుంటూరు - ఆదివారం 15 ఫిబ్రవరి 2026

# ఏడుగురు హీరోయిన్స్‌తో మూవీ.. క్లారిటీ ఇచ్చిన డైరెక్టర్ క్రిష్..!



టాలీవుడ్ విలక్షణ దర్శకుడు క్రిష్ జాగర్లమూడి తన తదుపరి చిత్రం గురించి సోషల్ మీడియాలో వస్తున్న వార్తలపై స్పందించారు. ఇటీవల ఆయన దర్శకత్వం వహించిన 'ఘాటీ' చిత్రం ఆశించిన స్థాయిలో మెప్పించలేకపోవడంతో, తర్వాతి సినిమాపై సర్వత్రా ఆసక్తి నెలకొంది. ఈ క్రమంలోనే ఏడుగురు హీరోయిన్లతో ఒక ట్రెకింగ్ అడ్వెంచర్ మూవీని క్రిష్ ప్లాన్ చేస్తున్నారంటూ ప్రచారం జరిగింది.

ఈ వార్తలపై క్రిష్ క్లారిటీ ఇస్తూ.. ఏడుగురు హీరోయిన్లు, ట్రెకింగ్ అడ్వెంచర్ అనేది మంచి ఐడియానే కానీ, అది నిజం కాదు అని తేల్చి చెప్పారు. ఇదంతా సోషల్ మీడియా సృష్టించిన కథేనని, తన తదుపరి ప్రాజెక్ట్ గురించి త్వరలోనే అధికారికంగా ప్రకటిస్తానని ఆయన పేర్కొన్నారు. ప్రస్తుతం క్రిష్ కొన్ని కొత్త కథలపై కసరత్తు చేస్తున్నారు.

మరోవైపు, నందమూరి బాలకృష్ణ డ్రీమ్ ప్రాజెక్ట్ 'ఆదిత్య 999' సీక్వెల్ కు క్రిష్ దర్శకత్వం వహిస్తారని భావించినా, ఆయన ఆ ప్రాజెక్ట్ నుండి తప్పుకున్నట్లు తెలుస్తోంది. ప్రస్తుతం చిన్న విరామం తీసుకున్న ఈ సెన్సిబుల్ డైరెక్టర్, తన తర్వాతి చిత్రాన్ని ఎవరితో చేస్తారో చూడాలి.

# 'హిట్' చిత్రాల దర్శకుడు తీసిన తొలి ప్రేమకథ



'హిట్' ఫ్రాంచైజీ సినివాలతో ఆకట్టుకున్న దర్శకుడు శైలేష్ కొలను.. కెరీర్ ప్రారంభం నుంచి ఇప్పటివరకు అన్నీ థ్రిల్లర్సే తీశాడు. ఇప్పుడు రూటు మార్చి తొలిసారి ఓ ప్రేమకథని తెరకెక్కిస్తున్నాడు. అదే 'ఏమో ఏమో ఇది'. శ్రీకాంత్ కొడుకు రోషన్ హీరో కాగా ప్రీతి ముకుందన్ హీరోయిన్. తాజాగా ఈ చిత్రాన్ని అధికారికంగా ప్రకటించారు. ఫస్ట్ బ్రీజ్ పేరిట సినిమా కాన్సెప్ట్ ఏంటనే విషయాన్ని రివీల్ చేశారు.

సింగల్ మదర్ పెంపకంలో పెరిగే అభయ్(రోషన్).. ఓ కెఫే యజమాని అయిన అపూర్వ(ప్రీతి ముకుందన్)తో ఎలా ప్రేమలో పడ్డాడు? ఈ జర్నీలో ఏమేం జరిగింది? అనేది సినిమా స్టోరీలా అనిపిస్తుంది. హేషమ్ అబ్దుల్ వాహబ్ సంగీతమందిస్తున్నాడు. సితార ఎంటర్ టైన్ మెంట్స్ బ్యానర్ పై నాగవంశీ నిర్మిస్తున్నారు. ఈ ఏడాది దసరాకే థియేటర్లలోకి మూవీ వస్తుందని ప్రకటించారు. గతంలో 'పెళ్లి సందD', 'ఛాంపియన్' చిత్రాలు చేసిన రోషన్.. వాటితో సక్సెస్ అందుకోలేకపోయాడు. ఈసారి ఏం చేస్తాడో చూడాలి?



# 'కోర్ట్' జంట మరో సినిమా.. కొత్త గ్లింప్స్ రిలీజ్

'కోర్ట్' సినిమాతో గతేడాది హిట్ కొట్టిన జంట శ్రీదేవి-రోషన్. వీళ్లిద్దరూ కలిసి చేస్తున్న మరో మూవీ 'బ్యాండు మేళం'. ఇప్పటికే షూటింగ్ పూర్తి చేసుకోగా.. వచ్చే నెల 13వ తేదీన థియేటర్లలోకి రానుంది. వాలంటైన్స్ డే సందర్భంగా ఎమోషనల్ గ్లింప్స్ ఒకటి రిలీజ్ చేశారు. బ్రేకప్ అయినప్పుడు హీరో బాధపడుతున్నట్లు ఇందులో చూపించారు.

'కోర్ట్' మూవీ ఆంధ్ర బ్యాక్ డ్రాప్ లో ఇది తెలంగాణ నేపథ్యంగా ఉండనుంది. సతీష్ జవ్వాజి దర్శకుడు కాగా విజయ్ బుల్గానిన్ సంగీతమందించాడు. మరి రోషన్-శ్రీదేవి ఈసారి ఏం చేస్తారో చూడాలి? గ్లింప్స్ లో ఎమోషన్ చూపించినప్పటికీ.. హీరో, తన ఫ్రెండ్కి తాళి కట్టడం ఫన్నీగా అనిపించింది.

# ఒమన్‌పై ఐర్లాండ్ ఘన విజయం



కొలంబో వేదికగా ఒమన్తో టీ20 వరల్ కప్ 2026 నేపథ్యంలో జరిగిన మ్యాచ్ లో 96 పరుగుల తేడాతో ఐర్లాండ్ ఘన విజయం సాధించింది. తొలుత బ్యాటింగ్ చేసిన ఐర్లాండ్ నిర్ణీత 20 ఓవర్లలో 5 వికెట్లు కోల్పోయి 235 పరుగులు చేసింది. అనంతరం ఛేదనలో ఒమన్ తడబడింది. 18 ఓవర్లలో 139 పరుగులకు ఆలౌటైంది. ఒమన్ బ్యాటర్లలో అమీర్ కలీమ్ (50; 29 బంతుల్లో 5 ఫోర్లు, 2 సిక్స్ లు), హమ్మద్ మీర్జా (46; 37 బంతుల్లో 6 ఫోర్లు, 1 సిక్స్) మాత్రమే రాణించారు. మిగతా బ్యాటర్లంతా విఫలమయ్యారు. ఐర్లాండ్ బౌలర్లలో జాషువా లిటిల్ 4 ఓవర్లలో 16 పరుగులిచ్చి 3 వికెట్లు తీసుకున్నాడు. మాథ్యూ హంఫ్రీస్, బారీ మెక్కార్తీ 2, జార్జి డాక్రెల్ ఒక వికెట్ తీసుకున్నారు.

# స్కాట్లాండ్‌పై ఇంగ్లాండ్ విజయం



ఆరంభంలో కాస్త కంగారు పడినప్పటికీ స్కాట్లాండ్ పై ఇంగ్లాండ్ ఐదు వికెట్ల తేడాతో విజయం సాధించింది. తొలుత బ్యాటింగ్ కు దిగిన స్కాట్లాండ్ 19.4 ఓవర్లలో 152 పరుగులకు ఆలౌటైంది. అనంతరం లక్ష్య ఛేదనలో ఇంగ్లాండ్ 18.2 ఓవర్లలో ఐదు వికెట్లను కోల్పోయి 155 పరుగులు చేసింది. ఇంగ్లాండ్ ఆటగాడు బాంటన్ (63₹) హాఫ్ సెంచరీ చేయగా.. జాకబ్ బెతెల్ (32), సామ్ కరన్ (28), విల్ జాక్స్ (16₹) రాణించారు. స్కాట్లాండ్ బౌలర్లలో బ్రాండన్, బ్రాడ్, వీల్, లీస్క్, డేవిడ్సన్ తలో వికెట్ తీశారు.

# తారిక్ 'యాక్షన్'కు.. భారత్ 'రియాక్షన్' ఎలా ఉంటుందో?



భారత్ తో మ్యాచ్ వేళ.. కేవలం నాలుగే అంతర్జాతీయ టీ20 మ్యాచులు ఆడిన 28 ఏళ్ల పాక్ స్పిన్నర్ ఉస్మాన్ తారిక్ పేరు ఇప్పుడు ప్రముఖంగా వినిపిస్తోంది. అందుక్కారణం అతడి బౌలింగ్ శైలి. అసలేంటి అతడి ప్రత్యేకత? బౌలింగ్ రికార్డులేంటి? తారిక్ ను ఎదుర్కోవడంపై మాజీలు ఇచ్చిన సలహాలేంటో ఓసారి చూద్దాం..

ఏ బౌలరైనా క్రీజ్ లోకి వచ్చాక బంతిని తనదైన తీరులో విసురుతాడు. లసిత్ మలింగ, జస్ ప్రీత్ బుమ్రా, పతిరన, పాల్ ఆడమ్స్, సోహైల్ తన్వీర్, కేశవ్ జాదవ్.. వంటి ప్లేయర్లు భిన్నమైన శైలితో బౌలింగ్ చేయడం చూశాం. కానీ, తారిక్ మాత్రం వారితో పోలిస్తే చాలా డిఫరెంట్. అతడు బౌలింగ్ చేసేందుకు క్రీజ్ లోకి వచ్చాక.. ఓ క్షణం ఆగి బంతిని విసురుతాడు. అయితే, దీనిపై ఐసీసీ క్లీన్ చిట్ ఇచ్చినా విమర్శలు మాత్రం ఆగడం లేదు.

**'ధోనీ' ఇన్స్పిరేషన్ తో..**

తారిక్ కు 'ధోనీ'నే స్ఫూర్తి. దుబాయ్ లో సేల్స్ మ్యాన్ గా పనిచేస్తుండగా.. 2016లో 'ధోనీ' సినిమా చూసిన తర్వాత మళ్లీ ఆటపై దృష్టి పెట్టినట్లు ఓ ఇంటర్వ్యూలో అతడు వెల్లడించాడు. అప్పటికి అతడికి 18 ఏళ్లు. గత కరేబియన్ లీగ్ లో సత్తా చాటడంతో జాతీయ జట్టులో అవకాశం వచ్చింది. గతేడాది తనను ఎంపిక చేస్తున్నట్లు మేనేజ్ మెంట్ నుంచి కాల్ వచ్చినప్పుడు ప్రాంక్ అనుకున్నాడట. పొడగరి అయిన తారిక్ నాలుగు అంతర్జాతీయ టీ20ల్లో 5.93 ఎకానమీతో 11 వికెట్లు పడగొట్టాడు. డేవాల్ బ్రెవిస్, రీజా హెండ్రిక్స్, కామెరూన్ గ్రీన్ వంటి పొట్టి ఫార్మాట్ స్పెషలిస్టులను బోల్తా కొట్టించాడు. ఇప్పటివరకు అతడు 42 టీ20ల్లో 74 వికెట్లను తీశాడు.

**వివాదాస్పదం ఎందుకంటే?**

మలింగ, పతిరన ఇలాగే బంతిని విసురుతారు కదా.. వారి బౌలింగ్ పై లేని అభ్యంతరం తారిక్ విషయంలో ఎందుకు? అనేది పాక్ క్రికెట్ అభిమానుల సందేహం. కానీ, తారిక్ మినహా ఏ బౌలరూ క్రీజ్ లోకి వచ్చాక బంతిని విసిరే ముందు ఆగిపోవడం లేదు. బ్యాటింగ్ కు రెడీగా ఉండి.. బంతిని విసిరే సమయంలో బౌలర్ ఆగడం వల్ల బ్యాటర్ అయోమయానికి గురయ్యే ప్రమాదం లేకపోలేదు.

**నమ్మకం ఉంచి ఆడండి: సన్నీ**

బ్యాటర్లు తమ బలంపై నమ్మకం ఉంచాలని క్రికెట్ దిగ్గజం సునీల్ గావస్కర్ సూచించారు. బౌలర్ ఆగి బంతిని వేయకూడదని చట్టంలో ఎక్కడా లేదని పేర్కొన్నారు. తారిక్ బౌలింగ్ యాక్షన్ పై ఆసీస్ మాజీ కెప్టెన్ ఆరోన్ ఫించ్ స్పందిస్తూ.. ''అతడి బౌలింగ్ యాక్షన్ సరిగ్గానే ఉంది. ఇలాంటి సమయంలోనే బ్యాటర్ ప్రతిభ బయటపడుతుంది. భిన్నంగా షాట్లు కొట్టేవారికి సమస్యేమీ కాదు'' అని చెప్పాడు. తారిక్ ను బౌలింగ్ చేయొద్దని కేవలం ఫీల్ అంపైర్ మాత్రమే చెప్పగలడని ఉస్మాన్ ఖవాజా అన్నాడు. తారిక్ బౌలింగ్ చేసేటప్పుడు బ్యాటర్ క్రీజ్ లో నుంచి పక్కకు వెళ్లిపోవాలని అశ్విన్ సూచించాడు. కానీ, భారత ఆటగాడు ఇషాన్ మాటలను చూస్తే.. తారిక్ కొత్త 'యాక్షన్'కు టీమ్ఇండియా పక్కా గేమ్ ప్లాన్ తో బరిలోకి దిగడం ఖాయంగా తెలుస్తోంది.



# పెళ్లి చేసుకుంటాను.. కానీ.. : మృణాల్

కొన్ని రోజులుగా వరుసగా రూమర్స్ తో వార్తల్లో ఉంటున్నారు నటి మృణాల్ ఠాకూర్. ధనుష్ తో ఆమె ప్రేమలో ఉన్నారంటూ ప్రచారం జోరుగా సాగుతోంది. వీరిద్దరూ ఫిబ్రవరి 14న పెళ్లి చేసుకోనున్నారంటూ రూమర్స్ వచ్చాయి. వాటిని ఖండించారు. తాజాగా ఓ ఆంగ్ల మీడియాకు ఇచ్చిన ఇంటర్వ్యూలో తన పెళ్లి గురించి మాట్లాడారు. వివాహం విషయంలో తొందరపడటం లేదన్నారు.

''పెళ్లి చేసుకుంటాను. కానీ.. దానికి సమయం రావాలి. సరైన వ్యక్తి నా జీవితంలోకి వచ్చినప్పుడు వివాహబంధంలోకి అడుగుపెడతాను. అప్పుడు నేనే స్వయంగా చెబుతాను. నా సోషల్ మీడియా అకౌంట్స్ లో నేనే పోస్ట్ చేస్తాను. ఆ విషయాన్ని మీతో పంచుకునే మొదటి వ్యక్తిని నేనే'' అని చెప్పారు. ఒకప్పటితో పోలిస్తే ఇప్పుడు పెళ్లిపై అందరి ఆలోచనల్లో మార్పు వచ్చిందని మృణాల్ అన్నారు. ఇక ప్రేమికుల రోజు తన పెళ్లి జరగనుందంటూ వచ్చిన వార్తలపై ఆమె హాస్యాస్పదంగా స్పందించారు. నేడు ఫిబ్రవరి 14. మరికొన్ని రోజుల్లో ఏప్రిల్ 1 వస్తుంది.. ఆరోజు ఫూల్స్ డే కదా.. అని సెటైర్ వేశారు.

ఇక ఇటీవల ఆమె తన మాజీ బాయ్ ఫ్రెండ్ గురించి చెప్పిన విషయం తెలిసిందే. తాను యాక్టింగ్ చేయడం అతడికి నచ్చలేదని అందుకే బ్రేకప్ చెప్పినట్లు వెల్లడించారు. అలాంటివాళ్లతో కొనసాగడం కూడా కష్టమేనని అందుకే విడిపోయినట్లు చెప్పారు.



# బన్నీని చూసి బాలీవుడ్ రగిలిపోతోందా?

## అల్లు అర్జున్‌పై వ్యతిరేక ప్రచారం...

'పుష్ప 2' ఘన విజయం తర్వాత, దక్షిణాది నటుల్లో ఎవరికీ రానంత దేశవ్యాప్త క్రేజ్ అల్లు అర్జున్ కి రావడం, జవాన్ సినిమా తీసిన అట్లీ తన రెండో సినిమాకి ఎంచుకోవడం...అలాగే బాలీవుడ్ అగ్రనటి దీపికా పదుకొణే వంటి స్టార్స్ తో బన్నీ కలిసి నటించనుండడం వంటివి జరిగాయి. ఈ నేపథ్యంలోనే అల్లు అర్జున్ బాలీవుడ్ లో కొందరికి ముప్పుగా కనిపిస్తున్నారా? అనే ప్రశ్నకు కొందరు సినీ పెద్దలు అవుననే సమాధానమే చెబుతున్నారు. ఈ మేరకు ప్రస్తుతం అటు టాలీవుడ్ ఇటు బాలీవుడ్ లో సినీ వర్గాల్లోనూ చర్చ జరుగుతోంది. హైదరాబాద్ లో సంధ్యా థియేటర్ సంఘటన తర్వాత అల్లు అర్జున్ ఎదుర్కొన్న పరిణామాలు తను కొందరు ప్రముఖులకు టార్గెట్ గా మారాడనే విషయాన్ని స్పష్టంగా వెల్లడించాయి. తాజా పరిణామాల నేపథ్యంలో బన్నీ ని ఈ సారి వేరే రకంగా టార్గెట్ చేశారా అనే సందేహాలు వ్యక్తం అవుతున్నాయి.

**వివాదమా? బాలీవుడ్ వ్యూహమా?**

ఇండియన్ ఐకాన్ స్టార్ అల్లు అర్జున్ గురించి పాడ్ కాస్ట్ లో పాల్గొన్న ఓ బ్రాండ్ స్ట్రాటజిస్ట్ అల్లు అర్జున్ ను కలవాలంటే ఏకంగా 42 కఠినమైన నిబంధనలు పాటించాల్సి ఉంటుందని, అందులో కళ్లలోకి చూడకూడదు, చేతులు కలపకూడదు వంటి ఆంక్షలు కూడా ఉన్నాయని ఆరోపించారు. ఈ క్లిప్ సోషల్ మీడియాలో వేగంగా వైరల్ కావడంతో అభిమానులు, నెటిజన్లు తీవ్రంగా స్పందించారు. ఫలితంగా అల్లు అర్జున్ పేరు అన్ని సోషల్ మీడియా ప్లాట్ ఫార్మ్ లలో ట్రెండింగ్ గా మారింది. ఈ వ్యాఖ్యలపై పెద్ద ఎత్తున చర్చ జరగడంతో, నిజంగానే ఇలాంటి నిబంధనలు ఉన్నాయా? అని కొందరిలో సందేహాలు వ్యక్తమవడం సహజమే. అయితే అదే సమయంలో కొందరు ఇది అల్లు అర్జున్ పెరుగుతున్న పాన్ ఇండియా క్రేజ్ ను తగ్గించేందుకు చేసిన ప్రయత్నమని అభిప్రాయపడుతున్నారు. ఈ క్రమంలోనే ఇలాంటి వివాదాలను కావాలనే పెద్దవిగా చేసి ప్రచారం చేస్తున్నారన్న ఆరోపణలు వినిపిస్తున్నాయి.

అయితే ఇలా టాలీవుడ్ స్టార్స్ పై వ్యతిరేక ప్రచారం జరగడం ఇదే తొలిసారి కాదు. గతంలో 'బాహుబలి', 'సాహో' సినిమాల భారీ విజయం తర్వాత ప్రభాస్ కూడా ఇలాంటి విమర్శలు, నెగెటివ్ ప్రచారం చేశారని కొందరు గుర్తు చేస్తున్నారు. బాలీవుడ్ లో చెప్పుకోదగ్గ ఆదరణ పొందిన దక్షిణాది నటులు ఇలాంటి కుట్రలను ఎదుర్కోవాల్సి వస్తుందనే అభిప్రాయం పలువురు వ్యక్తం చేస్తున్నారు.

**అల్లు అర్జున్ టీమ్ స్పందన..**

తమపై పడిన వివాదంపై అల్లు అర్జున్ టీమ్ వెంటనే స్పందించి వైరల్ అవుతున్న ఆరోపణలు అసత్యమని, ఆధారంలేనివని స్పష్టం చేసింది. అల్లు అర్జున్ ఎప్పుడూ గౌరవంగా, వినయంగా వ్యవహరిస్తారని, ఇలాంటి ప్రచారం ఆయన ప్రతిష్టను దెబ్బతీయాలనే ఉద్దేశంతో చేస్తున్నదని కూడా తేల్చి చెప్పడం గమనార్హం. ఈ ఉదంతంపై తగినంత కూపీ లాగి కుట్రలపై ఆధారం దొరికిన తర్వాతే అల్లు టీమ్ ఇలా చెప్పి ఉంటుందనేది నిస్సందేహం. అంతేకాదు అల్లు అర్జున్ పై తప్పుడు ప్రచారం చేసే వారిపై చట్టపరమైన చర్యలు తీసుకుంటామని హెచ్చరించింది కూడా. తద్వారా ఇకపై కూడా ఇలాంటివి జరిగే అవకాశం ఉందని అల్లు అండ్ కో భావిస్తున్నట్టు అర్థం అవుతోంది.

ఈ నేపథ్యంలో రానున్న రోజుల్లో భారీ ప్రాజెక్టులతో బిజీగా అల్లు అర్జున్ ప్రస్తుతం అల్లు అర్జున్ వరుస భారీ ప్రాజెక్టులతో బిజీగా ఉన్నారు. దర్శకుడు అట్లీతో కలిసి ఓ భారీ సైన్స్ ఫిక్షన్ చిత్రంలో నటిస్తున్నారు. అలాగే దర్శకుడు లోకేష్ కనగరాజ్ తో కలిసి రెండు భాగాలుగా రూపొందనున్న ఓ భారీ సినిమా కూడా త్వరలో ప్రారంభం కానుంది. అల్లు అర్జున్ ఎదుగుదలను ఎవరూ ఆపలేరని అభిమానులు ధీమా వ్యక్తం చేస్తున్నారు. కానీ కుట్రలలో ఆరితేరిన చరిత్ర ఉన్న కొన్ని బాలీవుడ్ మీడియా సంస్థల విషయంలో అల్లు అర్జున్ అత్యంత అప్రమత్తంగా ఉండాల్సిన అవసరం కనిపిస్తోంది.

# శ్రీవిష్ణు VS శ్రీవిష్ణు

## ఒక్క రోజు గ్యాప్‌లో వస్తున్న రెండు సినిమాలు..!

కింగ్ ఆఫ్ ఎంటర్ టైన్ మెంట్ శ్రీవిష్ణు ప్రస్తుతం ఒక అరుదైన బాక్సాఫీస్ ఫైట్ కు సిద్ధమవుతున్నాడు. ఒకే హీరో నటించిన రెండు వేర్వేరు సినిమాలు కేవలం 24 గంటల వ్యవధిలో విడుదల కావడం విశేషం. ఆయన నటించిన క్రైమ్ థ్రిల్లర్ 'మృత్యుంజయ' ఫిబ్రవరి 27న విడుదల కానుండగా, మరుసటి రోజే అంటే ఫిబ్రవరి 28న కామెడీ డ్రామా 'విష్ణు విన్యాసం' థియేటర్లలోకి రానుంది. ఈ మేరకు చిత్ర యూనిట్ ఒక వైవిధ్యమైన పోస్టర్ ద్వారా అధికారిక ప్రకటన విడుదల చేసింది. సాధారణంగా ఏ హీరో అయినా తన సినిమాల మధ్య కనీసం నెల రోజుల గ్యాప్ ఉండాలని కోరుకుంటాడు. కానీ ఇక్కడ శ్రీవిష్ణు ఇలాంటి నిర్ణయం తీసుకోవడానికి ప్రధాన కారణం ఓటీటీ ఒప్పందాలే. ప్రస్తుతం టాలీవుడ్ లో ఓటీటీ ప్లాట్ ఫారమ్ ల నిబంధనలు సినిమా విడుదల తేదీలను శాసిస్తున్నాయి. 'మృత్యుంజయ' డిజిటల్ హక్కులను నెట్ ఫ్లిక్స్ దక్కించుకోగా, 'విష్ణు విన్యాసం' స్ట్రీమింగ్ హక్కులను అమెజాన్ ప్రైమ్ వీడియో సొంతం చేసుకుంది. ఒప్పందం ప్రకారం ఆయా ప్లాట్ ఫారమ్ లు సూచించిన తేదీలకే థియేటర్లలో రిలీజ్ చేయాలనే కఠిన నిబంధన ఉండటంతో ఈ 'సెల్ఫ్ క్లాష్' తప్పలేదు.




దీంతో ఈ నెల ఆఖరులో శ్రీవిష్ణు వర్సెస్ శ్రీవిష్ణు వార్ను ప్రేక్షకులు చూడబోతున్నారు. ఒకవైపు సీరియస్ ఇన్వెస్టిగేటివ్ థ్రిల్లర్ తో, మరోవైపు తనదైన శైలి వినోదంతో ఆయన ప్రేక్షకులను పలకరించనున్నాడు. ఈ రెండు సినిమాల ప్రమోషన్లను శ్రీవిష్ణు ఎలా బ్యాలెన్స్ చేస్తారో, అలాగే బాక్సాఫీస్ వద్ద ఏ చిత్రం పైచేయి సాధిస్తుందో చూడాలి. వరుస విజయాలతో ఊపుమీదున్న శ్రీవిష్ణుకు ఈ డబుల్ రిలీజ్ ఏ మేరకు కలిసివస్తుందో వేచి చూడాల్సిందే.

Printed and Published by VUPPARI RAMESH KUMAR on behalf of Navatharam Publications Private Limited, Printed at Sree Seshasai Enterprises D.No:3-88, Gosala village, Penamaluru Mandal, Krishna District 521151(AP), And Published at H.No.23-3-46, 1st Floor, Katamaraju vari Veedhi, Amaravathi Road, Naidupet Guntur(District) AP-522002. EDITOR: VUPPARI RAMESH KUMAR. RNI Reg No.APTEL/2016/73939.